www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం
గురువారం 26-12-2024 | హైదరాబాద్ ప్రచురణ | Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 09, సంచిక : 78 పేజీలు : 8, వెల: రూ.5.00

ఎర్రజెండా సాక్షిగా

సంపాదకీయం

వందేళ్ల దీప్తి జ్వాల. దానితో పాటే వెలుగు నీడలు. వెలుగు భవిష్యద్దర్శనానికి కరదీపిక. నీడలు గుణపాఠాలు నేర్చుకునే తరుణం. వలసవాద కాలంలో స్వాతంత్య్రం అన్న మాట ఉచ్చరించడానికే బెరుకు. అదే సమయంలో అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో దేశంలో వామపక్ష భావాలు అంకురించాయి. అప్పటికి ఇంకా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఉండకపోవచ్చు. కానీ దేశంలోని అనేక చోట్ల ఎర్ర కెరటాలు ఎగిసి పడ్తూనే ఉన్నాయి. వివిధ వర్గాల ప్రజలు సంఘటితం కావడం మొదలు పెట్టారు. క్రమంగా సంఘాలు నెలకొల్పుకోవడమూ మొదలైంది. ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం కోసం వెళ్లిన వారు మాతృదేశ దాస్య శృంఖలాలను తెంచే మార్గాన్వేషణలో పడ్డారు. విదేశీ గడ్డ మీద ఉన్న భారతీయులు సమైక్యం కావడం ప్రారంభించారు. రష్యాలో అక్టోబర్ విప్లవం విజయవంతం కావడం, ఆ దేశాభివృద్ధికి వడివడిగా అడుగులు పడడం మన దేశంలో విప్లవబీజాలు మొలకెత్తడానికి అనువైన మేలిమి మాగాణం సిద్ధమైంది. విదేశాల్లో ఉన్న భారతీయులు ఆ మాగాణంలో ఎర్రవిత్తులు నాటారు. తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ నెలకొల్పడానికి ప్రయత్నాలు చేశారు. కానీ ఆ ప్రయత్నాలకు పెద్దగా మద్దతు లభించలేదు. 1920లో తాష్కెంట్ గడ్డ మీద ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ మన దేశంలో వేళ్లూనుకున్న ఆనవాళ్లే లేవు. తాష్కెంట్ స్ఫూర్తితో కొనసాగిన కార్యకలాపాలూ పెద్దగా లేవు. అప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాలలో వ్యక్తుల నాయకత్వంలో ఎక్కడికక్కడ ఎర్రబాటలు పరుచుకోవడం జరుగుతూనే ఉంది. చెదురుమదురుగా ఎర్ర మిణుగురులు మెరుస్తూనే ఉన్నాయి. ఈ ప్రయత్నాల ఫలితమే 1925 డిసెంబర్ 25న కాన్పూర్‌లో ఈ మిణుగురులన్నీ కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ అనే మహోజ్వల జాల ఆవిర్భావానికి దారి తీసింది. ఇది దేశ రాజకీయాల్లో, జాతీయోద్యమ ప్రస్థానంలో చరిత్రాత్మక అడుగు. కమ్యూనిస్టు భావజాలం అందిపుచ్చుకున్న వారి కార్యకలాపాలు, నిర్దుష్టమైన కార్యక్రమాలు, లక్ష్య శుద్ధి కమ్యూనిస్టు సిద్ధాంతం మీద గురి ఏర్పడేట్టు చేసింది. జనం ఆలోచనల నిండా మార్క్సిస్టు భావజాలం పరుచుకోనారంభించింది. సామ్యవాదం అన్న లక్ష్యం గట్టిగా వినిపించడం మొదలైంది. ప్రజాపోరాటాలకు కమ్యూనిస్టులు మునుం పెట్టారు. ఈ ఉద్యమ వెల్లువకు జడిసి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కమ్యూనిస్టుల మీద అనేక కుట్ర కేసులు మోపారు. కొంతమంది ఉరి కంబం ఎక్కారు. మరికొంతమంది ఏళ్ల తరబడి జైళ్లల్లో మగ్గారు. అయితే జైలు జీవితం వారిని అధ్యయనం వేపు, ముఖ్యంగా మార్క్సిస్టుసాహిత్య అధ్యయనం వేపు మళ్లించింది. సైద్ధాంతిక పునాది, దేశభక్తి ఆధారంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం మొదలైంది. సోషలిజం లక్ష్యంగా దేశమంతటా పోరాటాలు వెల్లువెత్తాయి. కొత్త నాయకత్వం అవతరించింది. అభ్యుదయ రాజకీయ శక్తి రూపంలో భారత గగనతలంపై కొత్త సూర్యుడు ఉదయించాడు. ఈ క్రమంలోనే కమ్యూనిస్టు ఉద్యమంపై కారు మేఘాలు కమ్ముకున్న రోజులూ ఉన్నాయి. పెద్ద తుపానులు కమ్యూనిస్టు భావజాలాన్ని, పోరాట పంథాలో ముందుకు సాగుతున్న వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయడానికి శక్తి మేరకు ప్రభావం చూపిన సందర్భాలూ ఉన్నాయి. కానీ ఎర్రజెండా ఎగరడం ఆగలేదు. నూతన శ్రేణులు అరుణపతాకం కింద సమీకృతం కావడం మానలేదు. స్వాతంత్య్రానికి ముందు వలసవాద ప్రభుత్వం, స్వాతంత్య్రానంతరం భారత ప్రభుత్వం ఎర్రకెరటాలను నిరోధించడానికి సకల ప్రయత్నాలూ చేశాయి. ఆంక్షలు విధించాయి. నిషేధాలు అమలు చేశాయి. కానీ పడినప్పుడల్లా కమ్యూనిస్టు ఉద్యమం వంద రెట్ల శక్తి పుంజుకుని నిలదొక్కుకుంది. ఎర్రబావుటా నీడలు పరివ్యాప్తమవుతూనే వచ్చాయి. కమ్యూనిస్టు పార్టీ కర్షకులకు వేగు చుక్క అయింది. విద్యార్థులకు వినీలాకాశంలో జ్వాజ్వల్యమానమైన దీప శిఖ అయింది. కార్మిక లోకానికి కరదీపిక అయింది.

కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్థానంలో ఎగుడు దిగుళ్లు ఉన్నా సైద్ధాంతిక బలం, లక్ష్య శుద్ధి, నిజాయితీ, త్యాగనిరతి ప్రజల్లో కోటి ఆశలు నింపింది. కార్యకర్తల దీక్షా దక్షత గురించి చెప్పక్కర్లేదు. ఆ రకంగా నేటితో భారత కమ్యూనిస్టు పార్టీ శతవత్సరంలో అడుగు పెట్టింది. లక్ష్య సాధనకు మిగిలిన దూరమెంతో తెలియదు. కానీ ఎర్రని వేకువకోసం ఎంతకాలం పట్టినా, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఎత్తిన జెండా దించడం భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు చేతకాని పని. చరైవేతి అని ముందుకు సాగుతూనే ఉంటారు. లక్ష్యం సిద్ధించేదాకా ఎర్రజెండా బుజాన వేసుకుని ముందుకు సాగుతూనే ఉంటారు. ప్రజాం దోళనలు పలచబడడానికి కారణం ఏమిటో కమ్యూనిస్టు పార్టీకి తెలియక కాదు. కొన్ని సందర్భాలలో నాయకత్వం వేసిన తప్పటడుగుల జాడలూ కమ్యూనిజం మీద నిండైన విశ్వాసంతో సాగుతున్న వారికి స్పష్టంగానే తెలుసు. తేబాగా ఉద్యమం, పున్నప్ర వాయలార్ తిరుగుబాటు, రాయల్ నేవీ పోరాటం, తెలంగాణ సాయుధ సమరం నాటి పోరాట స్ఫూర్తి కమ్యూనిస్టులకు వెనుదిరిగి చూసే అవకాశం ఇవ్వదు.

వేసిన తప్పటడుగులు, వదులుకున్న అవకాశాల గురించి కూడా ఆలోచించవలసిన అవసరం చాలా ఉంది. నిరాశ, నిస్తబ్దత నుంచి బయట పడవలసిన అగత్యం ఉంది. కమ్యూనిస్టు పార్టీ అస్తిత్వం కేవలం చట్టసభల్లో సీట్లకు పరిమితం అయి ఉండదు. అది ఒక నిరంతర ఉద్యమం. ఉద్యమంలో విజయాలు మాత్రమే ఉండవు. విజయావకాశాలను అన్వేషించడానికి అనవరతం ప్రయత్నిస్తూ ఉండవలసిందే. కొత్త దారులు వేసుకోవాల్సిందే. మతోన్మాద విషసర్పం బుసలుకొడ్తున్న వేళ వామపక్ష భావజాలం ఉన్న వారి బాధ్యత మరింత పెరిగింది. ఈ శక్తులను పరాస్తం చేయవలసిందే. ఈ పోరాటం చట్టసభలు, సైద్ధాంతిక రంగం, ఆచరణలో ముప్పేటగా సాగాల్సిందే. అంతిమ విజయం సోషలిజానిదే. ఆ లక్ష్య సాధనకు కృషి చేద్దాం. నడుం బిగిద్దాం, పిడికిళ్లు ఎత్తుదాం. సంఘటితం అవుదాం. మానవ జాతి వెనుకడుగు వేసిన ఉదంతమే లేదు. ఎర్రజెండా బుజాన మోస్తున్న వారికి వెనుకడుగు ఆలోచనే రాదు. ఈ వందేళ్ల చరిత్ర మనకు అనేక అనుభవాలు మిగిల్చింది. సామూహిక కార్యాచరణ ఆవశ్యకతను అనుక్షణం గుర్తు చేస్తూనే ఉంది. ఈ శతాబ్ది సంవత్సరం మన బలహీనతలు త్యజించాలని గుర్తు చేస్తోంది. మానవ జాతి ప్రగతి పథంలో చిరసంచిత వాస్తవికతా నిధి నిక్షేపాలను పరిరక్షించవలసిన బాధ్యత కమ్యూనిస్టులదే. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమైక్యం చేసే బాధ్యతా మనదే. రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా రాజ్యాంగ పరిరక్షణకోసం పాటు పడవలసిన స్థితిలో ఉండడం ఒక రకంగా వైపరీత్యమే. అందుకే పురోగామి శక్తులను వెంట తీసుకుని పీడిత జన విముక్తి కోసం ముందడుగేసే బాధ్యత ఎర్రజెండాను బుజం మీద మోస్తున్న వారిదే. బహుళత్వాన్ని కాపాడవలసింది మనమే. సాంప్రదాయ శక్తులు వెర్రి తలలు వేస్తున్న తరుణంలో వాటిని ఓడించాల్సిందీ మనమే. సాంస్కృతిక పునరుజ్జీవన కర్తవ్యమూ మనదే. దీనిలో కళా సాంస్కృతిక శక్తులకు ప్రేరణ ఇవ్వాల్సిందీ కమ్యూనిస్టు పార్టీనే. ఈ శతాబ్ది ఉత్సవం ఆత్మవిమర్శకు సదవకాశం. పోరాడితేనే విజయ బావుటా ఎగురవేయగలం. అరుణ కేతనం ఆసరాగా ముందడుగు వేద్దాం. జన శ్రేణులకు ప్రేరణ కలిగించడం కమ్యూనిస్టు పార్టీ బాధ్యత.

సీపీఐ శత వసంత
వేడుకలకు ముస్తాబు

ఒంగోలు మల్లయ్యలింగం భవన్

అరుణ పతాకాలు, తోరణాలతో ఎరుపెక్కిన రాష్ట్రం
వాడవాడలా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దేశవ్యాప్తంగా ఏడాది పాటు ఉత్సవాలు జరుపుకోవాలని సీపీఐ జాతీయ సమితి నిర్ణయం

- మిగతా 2 లో

అరుణ పతాకాలు, తోరణాల మధ్య సీఆర్ విగ్రహం

దళిత క్రైస్తవులు, గిరిజనులకు
ఇందిరమ్మ ఇళ్లు

- మెదక్ చర్చి తెలంగాణకు గర్వకారణం
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం: రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో -మెదక్: ఇందిరమ్మ ఇళ్లు దళిత క్రైస్తవులు, గిరిజనులకు అధికశాతం ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కరువు కాలంలో నిర్మించిన మెదక్ చర్చి తెలంగాణకే తలమానికం అన్నారు. క్రీస్తు సూచించిన మార్గంలోనే అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఉద్ఘాటించారు. మెదక్ చర్చి శతాబ్ది, క్రిస్మస్ ఉత్సవాలకు బుధవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎమ్మెల్యేలు సంజీవ రెడ్డి, మధన్ మోహన్ రావు, లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిలతో కలిసి

- మిగతా 2 లో

2030 నాటికి 20 వేల మెగావాట్ల
పునరుత్పాదక ఇంధనం...
3న భాగస్వాములతో సదస్సు: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో లక్షాన్ని చేరుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రతిపాదిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ గ్రీన్, రెన్యువబుల్ ఎనర్జీ పాలసీ పై భాగస్వాములతో బుధవారం సమావేశం అనంతరం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి, వివిధ రంగాలలో విస్తరించి విభిన్న ఆర్థిక

- మిగతా 2 లో

రైతు భాగస్వామ్యంతోనే
దేశ పురోభివృద్ధి

- పంటలు గ్రామాల్లో విక్రయిస్తేనే ఆర్థికవృద్ధి
- రైతన్నల ఎదుగుదలకు కేవీకే, ఐకార్ కృషి అవశ్యం
- ఆత్మీయ సమ్మేళనంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్

విశాలాంధ్ర- మెదక్: దేశంలో మేధావులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉన్నా అనుకున్న విధంగా సాగులో మార్పులు రావడం లేదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పేర్కొన్నారు. రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశం పురోభివృద్ధి చెందుతుందని, ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. ఇంధన, సహజ వనరులను అవసరం మేరకే వినియోగించుకోవాలని సూచించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ సాగుపై బుధవారం రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ధన్కర్... కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్క నాటి, సేంద్రియ ఎరువుల స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం కేవీకే వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులపై పలువురు రైతులతో ముచ్చటించారు. అనంతరం ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ... మెదక్ జిల్లాలో 655 మంది

- మిగతా 2 లో

కజకిస్థాన్‌లో
కుప్పకూలిన విమానం

- ఇద్దరు పైలెట్లు సహా 30 మంది దుర్మరణం
- పక్షి ఢీకొనడమే కారణం?

అక్తావ్: అజర్‌బైజన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కజకిస్థాన్‌లో ఒక్కసారిగా కూలిపోయింది. ఆకాశం నుంచి వేగంగా భూమి మీదకు వచ్చిన విమానం... నేలను తాకిన వెంటనే పేలిపోయింది. దాని శకలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లతో సహా 30 మంది చనిపోయారు. మిగతా వారికి గాయాలు కాగా వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. విమానం వెనుక భాగంలోని ప్రయాణికులు ప్రాణాలతో బయట పడినట్లు అధికారులు తెలిపారు. ఈ విమానం అజర్‌బైజన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని చెచెన్ ప్రాంతానికి చెందిన గ్రోజ్నీ నగరానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. తొలుత ఒక పక్షి

- మిగతా 2 లో

శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల సాయం
అల్లు అరవింద్

విశాలాంధ్ర- హైదరాబాద్: పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా కొద్ది రోజుల క్రితం సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట దుర్ఘటనలో మృతురాలి కుటుంబానికి రూ.రెండు కోట్ల సాయం అందజేసున్నట్టు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మృతురాలి కుమారుడు శ్రీతేజ్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. నటుడు అల్లు అర్జున్ తరపున రూ.కోట, పుష్ప 2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. అంతకుముందు దిల్ రాజు, నిర్మాత రవిశంకర్‌తో కలిసి అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. 'శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వెంటిలేషన్ తీసేశారు. బాలుడు త్వరలోనే మనందరి మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నా. న్యాయపరమైన అంశాల

- మిగతా 2 లో

పార్లమెంటు వద్ద ఆత్మహత్యాయత్నం

90 శాతం కాలిన గాయాలతో పరిస్థితి విషమం

2లో

లాల్ సలాం నల్లకన్ను



భారత్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించినాడే (1925 డిసెంబర్ 26)న జన్మించిన నల్లకన్ను కూడా గురువారం తొంభైతొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని వందవ సంవత్సరంలో అడుగుపెడుతున్నారు. ఆయన కొంత కాలం సీపీఐ తమిళనాడు రాష్ట్ర విభాగం కార్యదర్శిగా పని చేశారు. ఆయన భార్య రంజితం 95వ ఏట 2016లో మరణించారు. నల్లకన్ను తూత్తుకుడి జిల్లా తురువైకుంతంలో జన్మించారు. ఆయనది కలిగిన కుటుంబమే. భారత స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. నల్లకన్ను 15వ ఏటనే కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొన్నారు. 14 ఏళ్లు జైలు శిక్ష అనుభవించారు. అయితే ఏడేళ్ల తరవాత విడుదలయ్యారు. ఇతర పార్టీల నాయకులు కూడా ఆయనను అపారంగా గౌరవిస్తారు. నల్లకన్ను మృదు భాషి, మంచి రచయిత కూడా. ఆయన సంఘసంస్కర్త. భిన్న సామాజిక వర్గాలకు అవకాశాలకోసం పాటుపడేవారు. కింది వర్గాల వారు తమ హక్కుల కోసం అగ్రవర్ణాలవారితో ఎలా

- మిగతా 2 లో

ఒక స్వప్నాన్ని సాకారం చేసేందుకు....

"మానవ సమాజ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే"నని మార్క్స్-ఎంగెల్స్ 1848లో రాశారు. వాళ్లలా రాసిన 77 యేళ్లకు, 1925లో ఈ చరిత్ర మన దేశంలో ఓ మూలమలుపు తీసుకుంది వర్గ సమాజాన్ని అంతమొందించడమనే ఏకైక లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ ఈ గడ్డపై ఆవిర్భవించింది. అంటే, మన మిప్పుడు, మన పార్టీ శత వసంత ఉత్సవాల ముని వాకిట్లో నిలబడివున్నాం! నూరేళ్ల కిందట, భారతదేశ సామాజిక ఆర్థిక స్థితిగతులెలా వున్నాయో అర్థం చేసుకుంటే తప్ప, 1925లోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఎందుకు పుట్టిందో మనకు అర్థం కాదు!

4 లో



"చిరు జ్ఞాపకాలు
చిరస్మరణీయాలు
త్యాగమయ చారిత్రక మూలాలు
నూరు వసంత ఉషోదయాల
అరుణారుణ పారిజాత
అక్షర సుమాంజలి"
అందుకోండి నేటి
సంచిక నుండి ప్రతి ఉదయం
మన విశాలాంధ్రలో....

కళ తప్పిన క్రిస్మస్

కమ్మేసిన యుద్ధ ఛాయలు

బెత్లెహం వెలవెల

బెత్లెహం: క్రీస్తు పుట్టిన రోజు అయిన డిసెంబరు 25వ తేదీని ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు 'క్రిస్మస్'గా జరుపుకుంటారు. పశ్చిమాసియా రగిలిపోతుండటం, అనేక దేశాల్లో ఘర్షణలు, దాడులు, ప్రమాదాల కారణంగా ఈ ఏడాది పండుగ కళ తప్పింది. వాటికన్ నగరంలో సంప్రదాయ బద్ధంగా క్రిస్మస్ ప్రార్థనలు జరిగాయి. పోప్ అధ్వర్యంలో వేలాది మంది పాల్గొన్నారు. 25ఏళ్లకు ఒకసారి జరిగే సంప్రదాయం ప్రకారం 'జుబ్లీ వత్సరాన్ని' పోప్ ప్రకటించారు. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ, భీకర దాడులు, మారణహోమం క్రమంలో గతేడాది వలే ఈ ఏడాది కూడా క్రీస్తు పుట్టిన బెత్లెహంలో క్రిస్మస్ శోభ కనిపించలేదు. క్రిస్మస్ సీజన్‌లో కళకళలాడే వెస్ట్‌బ్యాంక్‌లో యుద్ధ ఛాయలు కనిపించాయి. మంగేర్ స్క్వేర్‌లో రంగుల దీపాలతో ముస్తాబయ్యే భారీ క్రిస్మస్ ట్రీ ఇప్పుడు లేదు. విదేశీ పర్యాటకుల లేదు. దీంతో అంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా మారింది. క్రిస్మస్ సందర్భంగా బ్యాండ్‌తో వీధుల్లో తిరుగుతూ సందడి చేసే పలస్తీనా స్కౌట్లు మౌనం వహించారు. నిశ్శబ్దంగా వీధుల్లో తిరుగుతూ 'మాకు జీవితం కావాలి... చావు కాదు'. 'గాజా, అక్కడి ప్రజలకు శాంతి కావాలి' అన్న ప్లకార్డులు ప్రదర్శించారు. మరోవైపు భద్రతా సిబ్బంది స్థానిక చర్చీల వద్ద బ్యారికేడ్లతో భారీ బందోబస్తు చేశారు. క్రిస్మస్ సందర్భంగా బెత్లెహం నుంచి ప్రపంచానికి ఇచ్చేది శాంతి సందేశమని మేయర్ సాల్మన్ అన్నారు. ఈసారి కూడా శాంతి, ఆకాంక్షలతో కూడిన సందేశాన్ని ప్రపంచానికి బెత్లెహం ఇస్తోంది కానీ పలస్తీనా ప్రజలపై దమనకాండను ఆపాలని కోరుతోందని భావోద్వేకంగా చెప్పారు. క్రిస్మస్ వేడుకలు రద్దు కావడంతో పట్టణ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరిగింది. క్రిస్మస్ సీజన్‌లో పర్యాటకం ద్వారానే బెత్లెహంకు 70శాతం ఆదాయం వస్తుంది. సాల్మన్ మాట్లాడుతూ నిరుద్యోగం బాగా పెరిగిందని, 50శాతం ఎక్కువగా ఉందని చెప్పారు. వెస్ట్‌బ్యాంక్‌లో 30శాతం మేర నిరుద్యోగం ఉందన్నారు. పలస్తీనా ఆర్థికశాఖ గణాంకాల ఆధారంగా ఈ మేరకు ఆయన చెప్పారు. కనీసం వచ్చే వారం గాజా నగరం క్రిస్మస్ సందడి కనిపిస్తుందని బెత్లెహంలో రోమన్ క్యాథలిక్ మతపెద్ద పిజ్జాబల్లా ఆకాంక్షించారు. మంగర్ స్క్వేర్‌లో వందలాది మందిని ఉద్దేశించి సందేశాన్ని ఇచ్చిన ఆయన అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తామంతా బాధగా పండుగ జరుపుకోవడం ఇదే చివరిసారి అని, వచ్చే ఏడాది సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆకాంక్షించారు. గాజా సోదరసోదరీమణులతో కలిసి మునుపటి వలే ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకుంటామని ప్రజల్లో ఆశలు నింపారు.

జర్మనీలో కనిపించని పండుగ శోభ

క్రిస్మస్ మార్కెట్‌పై దాడి క్రమంలో జర్మనీలో పండగ సందడి లేదు. మాగ్‌డెంగ్ మార్కెట్‌పై దాడిలో తొమ్మిదేళ్ల బాలుడు సహా ఐదుగురు చనిపోగా, 200 మందికిపైగా గాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో అధ్యక్షుడు ఫ్రాంక్-వాల్టర్ స్టెయిన్మెర్ తన క్రిస్మస్ సందేశాన్ని తిరిగి రాసుకోవాల్సి వచ్చింది. మాగ్‌డెంగ్ ఘటన క్రమంలో అంతటా బాధ, భయం, అనిశ్చితి దర్శనమిస్తోందన్నారు. ఐక్యంగా ఉండాలని జర్మన్‌లను కోరారు. హింస, విద్వేషానికి ఖండించారు.

క్రిస్మస్‌కు సెలవు ఇచ్చిన సిరియా

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సిరియా అధికారులు బుధ, గురువారాలను సెలువు దినాలుగా ప్రకటించారు. సిరియాల క్రైస్తవుల ర్యాలీల క్రమంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబరు 26వ తేదీన అధికారిక సెలవు దినంగా ప్రకటించారు. అయితే అత్యవసర సేవలు అందించే మంత్రిత్వశాఖలు, వ్యవస్థలు, సంస్థలు పనిచేయాల్సి ఉంటుందని అధికారిక ప్రకటన తెలిపింది.

మొజాంబిక్‌లో ఘర్షణలు: 21 మంది మృతి

మపుటో: మొజాంబిక్‌లో అధ్యక్షుడిగా అధికార పక్ష నాయకుడు డేనియల్ చాపో ఎన్నికయ్యారు. ఫలితాలు వెలువడిన జరిగిన ఘర్షణల్లో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 24 గంటల్లో మొత్తం 236 హింసాత్మక ఘటనలు చోటుచేసుకోగా, 21 మంది మృత్యువాత పడినట్లు అంతర్గత మంత్రి పోస్కోల్ రోండా వెల్లడించారు. అక్టోబరు 9న జరిగిన అధ్యక్ష ఎన్నికల ఫలితాలను మొజాంబిక్ రాజ్యాంగ మండలి సోమవారం ప్రకటించింది. అధికార ఫ్రెలిమో పార్టీ అభ్యర్థి డేనియల్ చాపో విజేతగా నిలిచారు. ప్రాథమికంగా ఫలితాలు వెలువడినప్పుడు చాపో ఆధిక్యత గురించి తెలిసి స్వతంత్ర అభ్యర్థి మొంధ్లానే అసంతృప్తి వ్యక్తంచేశారు. సివిల్ డిసోబిడియెన్స్ (శాసనల ఉల్లంఘనల)కు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే, అధ్యక్ష ఎన్నికల ఫలితాలను దేశ కాన్స్టిట్యూషనల్ కోర్టు సమర్థించింది. చాపోను దేశాధ్యక్షుడిగా ప్రకటించింది. దీంతో చాపో జనవరి 15న అధ్యక్షుడిగా పగ్గాలు చేపడతారు. ఫ్రెలిమో పార్టీకి ఘన చరిత్ర ఉంది. ఇది దేశ స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించింది. 1977 ఫిబ్రవరిలో జరిగిన మూడవ మహాసభప్పుడు రాజకీయ పార్టీగా అవతరించింది. మార్క్సిజం-లెనినిజాన్ని పార్టీ సిద్ధాంతంగా స్వీకరించింది. 1976 నుంచి 1992 వంకు కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులపై ఫ్రెలిమో పార్టీ అంతర్యుద్ధం సాగించి నిలదొక్కుకుంది. తాజా ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ప్రతిపక్షాలు ఆరోపిస్తుండటంతో దేశంలో ఘర్షణలు జరిగాయి.

లాల్ సలాం నల్లకన్ను

(మొదటిపేజీ తరువాయి)

పోరాడాలో చెప్పేవారు. వారితో కలిసి జీవించేవారు. అజ్ఞాతవాసం గడుపుతున్నప్పుడు కూడా ఆయన ఇలాగే వ్యవహరించే వారు. వర్గ రహిత సమాజం కోసం ఎంతటి త్యాగానికైనా సదా సిద్ధంగానే ఉంటారు. పరిమితంగానైనా తనకు అవకాశం ఉన్న చోట జనాభ్యున్నతి కోసం నల్లకన్ను నిరంతరం కృషి చేశారు. కులరహిత సమాజం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడడం నల్లకన్ను లక్షణం. తూత్తుకుడిలో మిల్లు కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపే ప్రదర్శనలలో పాల్గొనడం ద్వారా బాల్యంలోనే న్యాయం, స్వేచ్ఛ కోసం నల్లకన్ను దీక్ష ప్రారంభమైంది. నల్లకన్ను చిన్నతనంలో ఆయన ఊరికి దగ్గరగా ఉన్న తూత్తుకుడిలో మిల్లు కార్మికులు సమ్మె చేశారు. వారి సమ్మెకు సంఘీభావం వెల్లువెత్తింది. సమ్మె కారణంగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులను ఆదుకోవడానికి పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి బియ్యం సేకరించి కార్మికుల కుటుంబాలకు పంపిణీచేశారు. నల్లకన్ను లాంటి చిన్నపిల్లలే బియ్యం సేకరించడానికి చుట్టూ తిరిగేవారు. "ఆ ప్రాంత ప్రజలు పేదవారు, అయినా ప్రతి ఇల్లు ఏదో ఒకదానిని అందించింది. ఆ సమయంలో నాకు 5 లేదా 6 ఏళ్లు, కార్మికుల పోరాటానికి ఈ సంఘీభావం నాపై చాలా ప్రభావం చూపింది" అని నల్లకన్ను తెలిపారు. తన స్వస్థలంలో తమిరబరని నదిలో ఇసుక తవ్వకాన్ని నిషేధించాలని ఆయన 2008లో మదురై హైకోర్టులో ఓ కేసు దాఖలు చేశారు. ఆయన శ్రమ ఫలించింది. 2010లో హైకోర్టు ఇసుక తవ్వకాలను అయిదేళ్ల దాకా నిషేధించింది.

ఉద్యమ జీవితంలో భాగంగా ఆయన అనేక సార్లు నిరాహార దీక్షలు చేయాల్సి వచ్చింది. ఒకసారి నల్లకన్ను నిరాహార దీక్ష కారణంగా ప్రభుత్వం ఆనకట్టే నిర్మించవలసి వచ్చింది. 2000లో నల్లకన్ను కోయంబత్తూరు నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. ఆయన 43.21 శాతం ఓట్లు సాధించినా ఓడిపోయారు. తమిళ నాడు రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు 15న ప్రతిష్టాత్మకమైన తగైసల్ తమిజర్ అవార్డుతో నల్లకన్నును సత్కరించింది. ఈ అవార్డు క్రింద ఆయనకు 10 లక్షలు నగదు బహుమతిగా ఇచ్చారు. ఈ అవార్డును అందుకున్న వెంటనే నల్లకన్ను రూ.10 లక్షలకు మరో 5 వేల రూపాయలు కలిపి ముఖ్యమంత్రి సహాయనిధికి ఇచ్చివేశారు.

పునరుత్పాదక ఇంధనం...

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థను కలిగి ఉందన్నారు. రాష్ట్రం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వలన, తెలంగాణ గరిష్ట విద్యుత్ డిమాండ్ 2023-24లో 15,623 మెగావాట్ల నుంచి 2027-28లో 20,968 మెగావాట్లకు, 2034-35లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని వివరించారు. విద్యుత్ అవసరాలు... 2023-24లో 85,644 మిలియన్ యూనిట్ల నుంచి 2027-28 లో 1,15,347 మిలియన్ యూనిట్లకు... 2034-35లో 1,50,040 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ మేరకు జనవరి 3, 2025న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో భాగస్వాములతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు.

8న ఏపీకి మోదీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. జనవరి 8న ఆయన ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. విశాఖ రైల్వేజోన్‌తో పాటు, దాదాపు రూ.85వేల కోట్ల విలువైన అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టీపీసీ, ఏపీ జెన్కో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ తదితర నిర్మాణాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. దీంతో పదేళ్లుగా ఊరిస్తున్న రైల్వేజోన్‌కు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. విభజన చట్టంలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించిన విషయం తెలిసిందే. వాస్తవానికి నవంబరులోనే ప్రధాని వీటికి శంకుస్థాపన చేయాల్సి ఉంది. అందుకు షెడ్యూల్ కూడా ఖరారు చేశారు. ఇంతలో తుపాను రావడంతో మోదీ పర్యటన వాయిదా పడింది. ఆ తర్వాత నవంబర్ 29న ప్రధాని పర్యటన ఖరారు చేశారు. విశాఖ ఆంధ్ర యూని వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో లక్ష మందితో భారీ బహిరంగ సభకు ప్రణాళికలు రూపొందించారు. అయితే తుపాను కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ ప్రధాని ఉత్తరాంధ్ర పర్యటన ఖాయమైంది. జనవరి 8న ఆయన రాష్ట్రానికి రానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అధికారిక కార్యక్రమాల్లో మోదీ పాల్గొనడం ఇదే తొలిసారి. సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు కానీ ఏపీలో ఆయనకు ఇది తొలి అధికారిక పర్యటన. ప్రధాని పర్యటన కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా సన్నాహాలు చేస్తోంది.

పార్లమెంటు వద్ద ఆత్మహత్యాయత్నం

న్యూఢిల్లీ: న్యూఢిల్లీలోని పార్లమెంటు భవన్ ఎదుట ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనకు తానుగా నిప్పంటించుకున్నాడు. పార్లమెంటుకు ఎదురుగా ఉండే రైల్ భవన్ ముందు బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ ఘటన జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బందిని హుటాహుటిన పంపినట్లు ఢిల్లీ ఫైర్ సర్వీస్ (డీఎఫ్ఎస్) తెలిపారు. అయితే అప్రమత్తమైన పార్లమెంటు భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని కాపాడేందుకు ప్రయత్నించారు. వైద్యం కోసం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. 90శాతం కాలిన గాయాలతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని ఉత్తరప్రదేశ్, బాగ్‌పట్‌కు చెందిన జితేంద్రగా ఢిల్లీ పోలీసులు గుర్తించారు. అతని వయస్సు 30-35ఏళ్ల మధ్య ఉంటుందని డీసీపీ (న్యూఢిల్లీ) దేవేశ్ మహ్లా తెలిపారు. పార్లమెంటు వద్ద పార్కులో తన ఒంటికి నిప్పంటిచుకొని ఆపై మెయిన్ గేట్ వద్దకు చేరుకునేందుకు జితేంద్ర ప్రయత్నించినట్లు చెప్పారు. 2021లో తనపై బాగ్‌పట్‌లో నమోదైన కేసు కారణంగా అతను ఇబ్బంది పడుతున్నట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు. సూసైడ్ నోట్ లభ్యం కాలేదని డీసీపీ చెప్పారు. జితేంద్రకు 90శాతం కాలిన గాయాలయ్యాయని, ఆర్ఎంఎల్‌లో మృత్యువుతో పోరాడుతున్నాడన్నారు. స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులు, కొందరు స్థానికులు సత్వరమే స్పందించి మంటలను ఆర్పి, అతనిని ఆసుపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతోందన్నారు.

రైతు భాగస్వామ్యంతోనే దేశ పురోభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

రైతు కుటుంబాలు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారన్నారు. ఈ ఊరు చిన్నది కాదు, నాకు మార్గ దర్శకం అన్నారు. వీరంతా నా ప్రత్యేక అతిథులు... వారికి ఢిల్లీలో ఆతిథ్యం ఇస్తున్నానని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికాసానికి లాల్ బహదూర్ శాస్త్రి, జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదంతో వాజ్ పాయ్, జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అను సందాన్ నినాదంతో ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. రాబోయే కొద్ది కాలంలోనే భారత్ ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతున్నదన్నారు. 2001 లో అప్పటి ప్రధాని వాజ్ పాయ్ నేతృత్వంలో కిసాన్ దివస్ ను ప్రకటించారు. త్వరలో రజతోత్సవం జరుపుకోబోతున్నదన్నారు. దేశంలో 730కి పైగా కృషి విజ్ఞాన కేంద్రాలు, 150 ఐకార్ సంస్థలు ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామీణ వ్యవస్థలో తమ గ్రామాల్లో పండించిన పండ్లు, కూరగాయలను ఒక యూనిట్ గా ఏర్పాటు చేసుకుని అక్కడే వినియోగించుకోవాలన్నారు. అక్కడే విక్రయిస్తే ఆ గ్రామ వ్యవస్థ ఆర్థికంగా బాగుపడుతుందని పేర్కొన్నారు. దేశంలో దాదాపు 10 కోట్ల మంది రైతులున్నారు... వీరందరికీ సంక్షేమ ఫలాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వందే అన్నారు. విద్యుత్ సబ్సిడీలపై ఆధారపడకుండా సోలార్ ఎనర్జీపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రపంచంలోనే శ్రేష్టమైన రైతులుగా ఎదిగేందుకు కేవీకే, ఐకార్ కృషి చేయాలన్నారు. గాంధీజీ స్వదేశీ నినాద స్ఫూర్తితో ప్రధాని మోదీ ఫోకల్ ఫర్ లోకల్ పిలుపునిచ్చారన్నారు. 1989లో విదేశీ మాదకద్రవ్య నిల్వలతో పోల్చుకుంటే ఇప్పుడు 700 రెట్లు పెరిగిందన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ... ఆర్గానిక్ సాగు చేస్తున్న 800 మంది రైతులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రైతులు మళ్లీ ఆర్గానిక్ సాగు దిశగా అడుగులు వేస్తున్నారని, రసాయనిక సాగును క్రమక్రమంగా తగ్గిస్తున్నారని తెలిపారు. ఏకలవ్య కేవీకే సంస్థ ఆర్గానిక్ సాగులో రైతులకు మేలైన సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఆర్గానిక్ సాగు విస్తృతికి మరింత కృషి అవసరమన్నారు.

ఘనస్వాగతం

తొలుత ఉప రాష్ట్రపతి జగదీశ్ ధన్కర్, డాక్టర్ సుదేశి ధన్కర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండ సురేఖ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ ఘనంగా స్వాగతం పలికారు. ఇద్దరు ఎస్పీల పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

2015 నుంచి 12వ సారి జమిలిపై జేపీసీకి బిల్లులు

న్యూఢిల్లీ: దేశంలో ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి చట్టపరమైన కార్యాచరణను నిర్దేశించిన రెండు బిల్లులు 2015 నుంచి పార్లమెంటు ఉమ్మడి కమిటీకి సూచించబడే ముసాయిదా చట్టాల శ్రేణిలో తాజావి. ఉమ్మడి ప్యానెల్‌కు సూచించిన రెండు బిల్లులు 2015 నుంచి 12వది ఉభయ సభలకు పంపించడం జరిగింది. లోక్‌సభలో ప్రతిపక్షాలు ఈ చర్యలను సమాఖ్య వ్యవస్థపై దాడిగా పేర్కొనడంతో ప్రభుత్వం వాటిని సవివరమైన పరిశీలన, విస్తృత సంప్రదింపుల కోసం పార్లమెంటు సంయుక్త కమిటీకి పంపింది. రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను కలిపి నిర్వహించే యంత్రాంగాన్ని నిర్దేశిస్తుంది. ఇది రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతున్నందున, హాజరయిన, ఓటు వేసిన సభ్యులలో మూడింట రెండు వంతుల మద్దతు అవసరం.

కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూకశ్మీర్ శాసన సభల నిబంధనలను ఇతర అసెంబ్లీలతో సమలేఖనం చేయడానికి ప్రయత్నిస్తుంది. మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు శాసన సభలను కలిగి ఉన్నాయి. ఇది ఆమోదానికి సాధారణ మెజారిటీ అవసరమయ్యే 'సాధారణ బిల్లు'. 'ఒక దేశం, ఒకే ఎన్నికల' బిల్లులకు ముందు, వక్ఫ్ (సవరణ) బిల్లు విస్తృత సంప్రదింపుల కోసం ఉమ్మడి కమిటీకి పంపబడిన చివరిది. ఒక బిల్లును ఉమ్మడి కమిటీకి సూచించాలని ఒక సభ నిర్ణయించినట్లయితే, ప్యానెల్‌కు సభ్యులను ఎంపిక చేయమని ఇతర సభకు తెలియజేస్తుంది. ఎంపిక లేదా సంయుక్త కమిటీ రెండు సభలు చేసినట్లే బిల్లు నిబంధనను నిబంధన వారీగా పరిగణిస్తుంది. సవరణలను కమిటీ సభ్యులు వివిధ నిబంధనలకు తరలించవచ్చు. బిల్లుపై ఆసక్తి ఉన్న సంఘాలు లేదా నిపుణుల సాక్ష్యాలను కూడా కమిటీ తీసుకోవచ్చు. బిల్లును పరిశీలించిన తర్వాత కమిటీ తన నివేదికను సభకు సమర్పిస్తుంది. మెజారిటీ నివేదికతో ఏకీభవించని సభ్యులు దానికి భిన్నాభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. కాగా, సంయుక్త ప్యానెల్స్‌కు సూచించబడిన బిల్లులలో భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు (రెండవ సవరణ) బిల్లు-2015, దివాలా కోడ్-2015 బిల్లు, భద్రతా ప్రయోజనాల అమలు, రుణాల రికవరీ చట్టాలు, ఇతర నిబంధనల (సవరణ) బిల్లు-2016, పౌరసత్వ చట్టం-1955 సవరణ ఉన్నాయి. అలాగే, రిజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లు-2017, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2022ని పరిశీలించడానికి ఇలాంటి ఉమ్మడి పార్లమెంటరీ ప్యానెల్‌లు ఏర్పడ్డాయి. అటవీ (పరిరక్షణ) సవరణ బిల్లు, 2023, ఉమ్మడి ప్యానెల్‌కు సిఫార్సు చేశారు.

శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల సాయం

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నా. అన్ని రకాల అనుమతులు తీసుకుని శ్రీతేజ్‌ను 10 రోజుల క్రితం పరామర్శించా. ఆ సమయంలో వెంటిలేషన్‌పై ఉన్నాడు' అని అల్లు అరవింద్ తెలిపారు. బాలుడి ఆరోగ్యం కాస్త మెరుగు పడింది. అతడి హెల్త్ కండిషన్ బాగుందని వైద్యులు తెలిపారు. 'బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్, 'పుష్ప 2' నిర్మాతలు, దర్శకుడు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగాం. సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలం కలిసి వెళ్తాం. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుంది' అని దిల్ రాజు వివరిఒస్త్రంచారు. తాను చిత్ర పరిశ్రమ వ్యక్తినని, ఇండస్ట్రీ- ప్రభుత్వం మధ్య వారధిగా ఉండాలని సీఎం బాధ్యత ఇచ్చారని, తాను అదే చేస్తున్నానని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... కరువు కాటకాలతో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నప్పుడు... ప్రజలందరికీ భోజనం పెట్టాలి, పని కల్పించాలి అన్న సదాశయంతో ఈ గొప్ప దేవాలయం నిర్మించినట్టు తెలిపారు. ఈ దేవాలయం వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని పరఢవిల్లుతుందన్నారు. తెలంగాణకు ఈ చర్చి ఎంతో గర్వకారణం అన్నారు. దేశంలో గొప్ప చర్చిగా మెదక్ చర్చి కీర్తింపబడుతుందని పేర్కొన్నారు. 100 సంవత్సరాల నుంచి భక్తులు రావడం వల్ల ఈ గుర్తింపు లభించిందన్నారు.

అనాడే చెప్పా సీఎంగా వస్తా అని...

మెదక్ చర్చికి నాకు గొప్ప అనుబంధం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మెదక్ పర్యటనకు వచ్చి చర్చిని సందర్శించినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో మరలా వస్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభు ఆశీర్వాదంతో పేదల ప్రభుత్వం ఏర్పాటు చేసుకొని ముఖ్యమంత్రి హోదాలో వచ్చినట్లు తెలిపారు. రైతులకు ఉచిత కరెంటు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షలు ఉచిత వైద్యం , 200 యూనిట్లు ఉచిత కరెంటు అందిస్తున్నట్టు వివరించారు. కర్షకులకు రూ. 500 పంట బోనస్, 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్ మెంట్ ఇచ్చామని అన్నారు. పనికి ఆహార పథకం ద్వారా మెదక్ చర్చి నిర్మాణం జరిగిందన్నారు. ఆనాడు ప్రభువులు ప్రజలను కాపాడడానికి వాళ్లకు భోజనం పెట్టి పని కల్పించి ఈ చర్చి నిర్మాణం చేశారు. ఈరోజు ఉపాధి హామీకి స్ఫూర్తి పనికి ఆహార పథకం అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం. మెదక్ జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

సీఎం రేవంత్ రెడ్డి మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్, ప్రిసిబిటరీ ఇంచార్జి డా. శాంతయ్య అధ్వర్యంలో గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. చర్చి కమిటీ సభ్యులు సాంసన్ సందీప్, గంట సంపత్, గెలన్ తదితరులు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. చర్చి ప్రాంగణంలో రూ.29.18 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ రావు, మదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సుప్రభాత రావు, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వేడుకలకు ముస్తాబు

(మొదటిపేజీ తరువాయి)

మేరకు రాష్ట్రంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ శాఖలు ఎక్కడికక్కడే వేడుకల కోసం ఏర్పాట్లు పూర్తి చేశాయి. సీపీఐ శ్రేణులు గతవారం రోజులుగా ఏర్పాట్లలో తలమున కలయ్యారు. నగరాలు, పట్టణాలలోని ముఖ్య కూడళ్లను సీపీఐ జెండాలు, తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు. సీపీఐ, ప్రజా సంఘాల కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ప్రతి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయాలతో పాటు, డివిజన్, మండల, గ్రామ కేంద్రాల్లోని కార్యాలయాలను కూడా ఎర్రని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. అరుణ పతాకాలు, తోరణాలు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, స్వాగత ద్వారాల వంటి అలంకరణలతో రాష్ట్రం ఎరుపెక్కింది. రాష్ట్రంలో ఎటు చూసినా పండుగ వాతావరణం నెలకొంది. శత వార్షికోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు, ప్రదర్శనలకు పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యారు. సభా స్థలాలు, ప్రదర్శన నిర్వహించే వీధులను పార్టీ జెండాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలతో ఎరుపుమయం చేస్తున్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సీపీఐ... స్వాతంత్ర్య ఉద్యమం దగ్గర నుంచి ఇప్పటివరకు చేసిన చరిత్రాత్మక పోరాటాలు, త్యాగాలు, పేదల సంక్షేమం కోసం చేసిన కృషిని నేటి తరానికి తెలియజేసేలా కరపత్రాలను పంపిణీ చేయనున్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరంతర ఉద్యమాలు, మరోవైపు భారత లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణకు చేస్తున్న వీరోచిత పోరాటాలను ఈ సందర్భంగా నేటితరానికి గుర్తు చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి సమావేశాలతోపాటు, స్థానికంగా సభలు, గ్రూపు మీటింగ్‌లు నిర్వహించనున్నారు. శత వసంతాలను పురస్కరించుకుని పార్టీలోని సీనియర్లను సత్కరించనున్నారు.

'సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయొద్దు'

విశాలాంధ్ర-హైదరాబాద్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారం ఇచ్చినా, ప్రజలను అపోహలకు గురి చేసేలా వీడియోలు పోస్టు చేసినా కఠిన చర్యలు తీసు కుంటామని పోలీసులు హెచ్చరించారు. అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్లు కొందరు తప్పుడు వీడియోలు పోస్టు చేసిన అంశం తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. వాస్తవాలు వక్రీకరించే ఇలాంటి వీడియోలు వైరల్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వైరల్ వార్తలపై వివరాలు సేకరిస్తున్నారు.

కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం

(మొదటిపేజీ తరువాయి)

ఢీకొనడంతో అత్యవసర ల్యాండింగ్‌కు ప్రయత్నించే క్రమంలో దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. కాగా, అక్తావ్‌కు మూడు కిమీల దూరంలో ప్రమాదం జరిగిందని కజక్ రవాణా శాఖ పేర్కొంది. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో మొత్తం 62 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది ఉన్నారు. ఎంబ్రార్ 190 విమానం ప్రమాదానికి గురైందని అజర్‌బైజన్ ఎయిర్‌లైన్స్ ధ్రువీకరించింది. ప్రయాణికుల్లో 37 మంది అజర్‌బైజన్, 16 మంది రష్యా, ఆరుగురు కజకిస్థాన్, ఒకరు కిర్గిస్థాన్‌కు చెందిన వారున్నారని కజక్ రవాణా శాఖ తెలిపింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొంది. క్షతగాత్రులకు అత్యవసర చికిత్స అందించేందుకు స్పెషలిస్ట్ వైద్యులతో ప్రత్యేక విమానాన్ని అస్తానాకు పంపినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. గాయపడిన వారిలో ఐదుగురికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఓ పక్షి ఢీ కొనడం వల్ల అక్తావ్ నుంచి దారి మళ్లించేందుకు పైలెట్ ప్రయత్నించడంతో అత్యవసర పరిస్థితి తలెత్తిందని రష్యాకు చెందిన ఫెడరల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ తొలుత పేర్కొంది. అయితే విమానంలోని కీలకమైన కంట్రోల్స్, బ్యాకప్ సిస్టమ్స్ విఫలమైనట్లు గుర్తించి ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఇంటర్‌ఫాక్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. విమానం నేలమీదకు దూసుకు రావడం, నేలను తాకిన వెంటనే పేలిపోవడానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఓ మైదానంలో రెక్కలు విరిగి విమానం బోల్తా పడివున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. గ్రోజ్నికి వెళ్లే మార్గం దట్టమైన పొగ మంచుతో కమ్ముకొని ఉండటంతో విమానాన్ని అక్తవ్‌కు మళ్లించినట్లు తెలుస్తోంది. ఈ విమానం నుంచి తమకు అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థన వచ్చిందని కూడా అధికార వర్గాలు వెల్లడించాయి.

అధ్యక్షుడి దిగ్భ్రాంతి: విమాన ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అజర్‌బైజనీ అధ్యక్షుడు ఇల్హమ్ అలీయేవా తన రష్యా పర్యటనను అర్థాంతరంగా ముగించేశారు. వెంటనే తిరిగి పయనమయ్యారు. పూర్వ సోవిట్ దేశాల కామన్‌వెల్త్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన రష్యా వెళ్లారు. విమాన కూలిపోవడంపై సమగ్ర దర్యాప్తునకు అధ్యక్షుడు ఆదేశించినట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. అధ్యక్షుడి సతీమణి, దేశ ఉపాధ్యక్షురాలు మెహ్రిబన్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

క్రిష్టియన్ మైనార్టీల అభివృద్ధికి కృషి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - ఖమ్మం : క్రిష్టియన్ మైనార్టీల సర్వతో ముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చి కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్, బిషప్‌లు మంత్రికి ఆశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రేమ, కరుణ, సహనం, శాంతి, త్యాగం, సేవాభావం వంటి గొప్ప గుణాలను ఆచరించాలని లోక రక్షకుడు యేసు ప్రభువు అందించిన మహోన్నతమైన సందేశం అందరికీ ఆదర్శమని, ఆ ప్రభువు చల్లని చూపు ప్రజల మీద ఉండాలని, అందరూ బాగుండాలని, ప్రభువు ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవలు అందించేలా శక్తినివ్వాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి క్రిస్టియన్ మైనారిటీ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, క్రిస్టియన్ మైనారిటీలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ యేసుక్రీస్తు దీవెనలు లభించాలి : ఎమ్మెల్యే కోరం

విశాలాంధ్ర - ఇల్లందు : ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు దీవెనలు లభించాలని ఎమ్మెల్యే గోరం కనకయ్య కోరారు. క్రిస్టమస్ పర్వదిన సందర్భంగా ఇల్లందు పట్టణంతో పాటు గ్రామాల్లోని పలు చర్చిలలో బుధవారం జరిగిన ప్రార్థనలో ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, బొల్లా సూర్యం, చిల్లా శ్రీనివాస్, ఉల్లింగ సతీష్, కృష్ణ ప్రసాద్‌లు పాల్గొని క్రిస్టమస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సిఎస్పి బస్తి పాస్టర్ ఎలిశా బాబు నిర్వహించిన పాల్గొని మాట్లాడారు. ఫాదర్లు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ప్రపంచంలోనే అత్యధికమంది ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ జరుపుకునే క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అందరి సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే కులమతాలకతీతంగా అన్ని వర్గాలు సోదర భావంతో ఉంటారని ఎమ్మెల్యే కోరం స్పష్టం చేశారు.

అకాల వర్షంతో రైతులకు నష్టం

విశాలాంధ్ర - గార్ల : ఆరు గాలం శ్రమించి పండించిన పంట చేతికందుతున్న వేళ చూస్తున్న అకాల వర్షాలు ఆర్థికంగా రైతుల వెన్ను విరుస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల వ్యాప్తంగా మిర్చి, పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు భారీ నష్టం జరిగింది. గత నెలలో కూడా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు ముఖ్యంగా వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగి వందలాది మంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. మంగళ, బుధవారం కురిసిన వర్షానికి మిర్చి, వరి ధాన్యం రాశులు తడవకుండా ఉండేందుకు సరిపడ పట్టాలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడ్డారు. పెరిగిన సాగు వ్యయాన్ని భరించి అప్పులు తెచ్చి కనాకష్టం మీద ఎలాగోలాగా పంటలను సాగు చేసారు. కానీ పంటలు చేతికందే దశలో రైతులు ప్రకృతి ప్రకోపంతో కూదేలవుతున్నారు. ఎంతో శ్రమించి కొందరు రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించిన వరి ధాన్యం ప్రభుత్వం కోనేలోపే వర్షార్పణం కావడంతో విషాదం నెలకొంది. దింతో రైతుల కళ్ళలో కన్నీరు ప్రవహిస్తుంది. వరి ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో తరచూ జరుగుతున్న మార్పులు రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో తడసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలనీ, సత్వరమే కాటాలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

బూర్గంపాడులో కోడిపందాల స్థావరాలపై దాడి

ఆరుగురు వ్యక్తులు, 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: సంక్రాంతి పండుగ వస్తుందంటేనే రెండు తెలుగు రాష్ట్రాల్లో కోడిపందాలు మొదటగా గుర్తొస్తాయి. సంక్రాంతి పండుగ ఇంకా మూడు వారాలు ఉండగానే ట్రైయల్రా పందాలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. పక్కా ఏజెన్సీ జిల్లా అయిన కొత్తగూడెం లోని అనేక మండలాల మారుమూల ప్రాంతాల్లో విస్తృతంగా కోడిపందాలు నిర్వహిస్తుంటారు. కోడిపందాలపై ఎన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ నిర్వహకులకు, పందెం గాళ్ళకు ఎలాంటి భయం లేకుండా కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలోనే బుధవారం బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టి నగర్, మొరంపల్లి బంజర్ శివార్లలోని మామిడి తోటలో కోడిపందాలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆ స్టావరాలపై మెరుపు దాడి చేశారు. ఈ దాడుల్లో పందేలాడుతున్న ఆరుగురు వ్యక్తులు, ఆరు ద్విచక్ర వాహనాలతో పాటు నాలుగు కోడి పుంజులు, సుమారు రూ. 10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ప్రవీణ్, ఎస్సై రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : కాగజ్‌నగర్ పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయంలో మొదటి రోజు ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో వేదపండితులచే మంగళ వాద్యల మధ్య వేద స్వస్తి వాచనములతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, భద్ర మండల దేవత స్థాపన పూజలు, హెూమాలు, జలాధివాసం, మూల విరాట్టుకు అష్టోత్తర వితరణ, 108 కలశాలతో అభిషేకం, నిర్వహించారు. ఈ కార్యక్రమనికి కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ కుటుంబ సమేతంగా వచ్చి అష్టోత్తర ధ్వజస్తంభంపై అభిషేకం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ అయ్యప్ప గురు స్వాములు నాగేందర్, బిక్షపతి శ్యామ్‌రావు, మూర్తి, రమేష్, మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రేపటి కార్యక్రమంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉంటుందని అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

మెదక్‌లో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

ఏడుపాయల వన దుర్గమ్మకు రేవంత్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : సీఎం రేవంత్ రెడ్డి మెదక్ చర్చి, ఏడుపాయల పర్యటనకు రాగా ఘన అధికార యంత్రాంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం ఏడుపాయల వన దుర్గామాతను సీఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. ఏడుపాయల చరిత్రలో సీఎం మొదటి సారిగా సందర్శించడం విశేషం. ఈ సందర్భంగా సీఎంకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గిరిజన తండాలను అనుసంధానం చేసే బీటి రోడ్లు, సీసీ రోడ్లతో పాటు ఇతర 297 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శంకస్థాపన చేశారు. 35 కోట్లతో ఏడుపాయల రోడ్డు విస్తరణ, 52.76 కోట్లతో గిరిజన తండాలను అనుసంధానం చేసే బీటి, సీసీ రోడ్ల నిర్మాణం, 5 కోట్లతో మహిళా శక్తి భవనం, 203 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం శంకస్థాపన చేశారు. 886 ఎస్‌హెచ్‌జిలకు 102 కోట్ల 37 లక్షల 40 వేల రూపాయల విలువైన బ్యాంకు లింకేజి చెక్కును సీఎం అందజేశారు. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, కొండా సురేఖ, ఎంపీలు ఎం. రఘునందన్ రావు, సురేష్ కుమార్ శెట్కార్, ఎమ్మెల్యేలు డా. మైనంపల్లి రోహిత్‌రావు, సంజీవరెడ్డి, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సుహాసిని రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ రావు, మదన్ రెడ్డి, నాయకులు నీలం మధు, చేరుకు శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్, డిఆర్డీఓ శ్రీనివాస్‌రావు, అడిషనల్ డిఆర్డీఓ సరస్వతి, లీడ్ బ్యాంకు మేనేజర్ మూర్తి తదితరులున్నారు. బేగంపేట్ నుండి ప్రత్యేక చాపర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజానర్సింహా, కొండా సురేఖలు ఏడుపాయలకు వచ్చారు. కలెక్టర్ రాహుల్ రాజ్, స్థానిక ఎమ్మెల్యే డా మైనంపల్లి రోహిత్ రావు, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సీఎంను చూసేందుకు మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వన దుర్గామాత ప్రాంగణం జన సంద్రంగా మారింది.

శాంతియుత లోక నిర్మాణానికి కృషి చేద్దాం : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : అహింసా, నీతి, సత్యం, ధర్మ గుణాలతో జీవించాలనే యేసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని అయన ఆచరణాత్మకంగా బోధించిన మార్గంలో లోక నిర్మాణం కోసం అందరూ పాటుపడాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. యేసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని బుధవారం కొత్తగూడెం పట్టణం, పరిసర గ్రామాల్లోని సీఎస్ఐ, ఆర్సీఎమ్, బెతానీయ, పెంతికోస్తు తదితర చర్చీల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో అయన పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ను కట్ చేసి క్రైస్తవ కుటుంబాలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సర్వమతాలు మానవత్వాన్ని అనుగుణంగా మంచినే బోధిస్తాయని చెడును వ్యతిరేకిస్తాయని అన్నారు. అన్ని మతాల గమ్యం సమాజంలో శాంతిని, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పడమే అన్నారు. ధర్మాలను ఆచరించే వారు మానవ సంబంధాలను మెరుగుపర్చడం, శాంతి స్థాపన కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కులమతాలకతీతంగా అందరికి చర్చీలకు ఆహ్వానించి మతసామరస్యాన్ని చాటడం అభినందనీయమన్నారు. ఇలాంటి అద్భుతమైన చక్కని మన భారతీయ సమాజంలో రాజకీయ నేతల ముసుగులో ఉన్న మతోన్మాదులు ప్రజల మధ్య విభజన చేస్తున్నారని ఆరోపించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని ఏలుతున్నారని విమర్శించారు. రాజకీయ మతోన్మాదుల, అసాంఘిక శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చర్చీల అభివృద్ధికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు మంజూరు చేసేవిధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని హామీ ఇచ్చారు. చర్చీల పాస్టర్ల సంక్షేమకోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్సవాలకు ఆహ్వానించిన చర్చికమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాష, నాయకులు కంచర్ల జమలయ్య, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు యాకూబ్, నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష శిబిరంలోనే క్రిస్మస్ వేడుకలు...

విశాలాంధ్ర - ఖమ్మం : సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలోని ఉద్యోగులు కేజీబీవీ టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం గత 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఖమ్మంలోని కొత్త కలెక్టరేట్ ఎదురుగా దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజు అక్కడ ధర్నా నిర్వహిస్తున్నారు. బుధవారం క్రిస్మస్ పండుగ కావడంతో సమ్మెలో ఉన్న ఉద్యోగులు పండుగ రోజు కూడా తమ ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ క్రిస్మస్, వేడుకలను దీక్షా శిబిరంలోనే జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు పరస్పరం తెలుపుకున్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న ఉద్యోగుల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని తాము అనేక సార్లు విన్నవించడంతోపాటు ధర్నాలు ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వ స్పందించ లేదని వారు పేర్కొన్నారు. కాగా సమ్మె నోటీసు ఇచ్చి తాము గత 15 రోజులుగా సమ్మె చేస్తున్నామని పండుగ రోజు కూడా ఆందోళనను ఆపకుండా దీక్ష శివరంలోనే క్రిస్మస్ జరుపుకోవాలని దుస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అనేక వర్గాల ప్రజలకు వేలాది కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం తమ పట్ల కూడా సానుకూల వైఖరితో న్యాయం చేయాలని వారు కోరుకుంటున్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని కలిసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి కితీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా, జనరల్ సెక్రటరీ అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిర్మల, మహిళ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, సాంబశివరావు, కార్యదర్శి కృష్ణ ప్రసాద్, సురేష్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని ఎప్పుడు ప్రారంభిస్తారు : కవిత



విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : నిజాం షుగర్ ఫ్యాక్టరీని ఎప్పటి వరకు ప్రారంభయిస్తారో చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి బోధన్, మెట్పల్లి, మెదక్ లో చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీఇచ్చి మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని గుర్తు చేశారు.. అధికారంలో రాగానే ఎన్ని వందల కోట్లయినా చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని చెప్పి ఇప్పటివరకు దానిపైన రివ్యూ చేయకపోవడం దారుణమన్నారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇస్తామని హామీ ఇచ్చి మార్చిపోయారని తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిలో క్రిస్మస్, శతాబ్ది వేడుకలలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రిసిబిటరీ ఇంచార్జి శాంతయ్య, చర్చి గురువులు ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. యేసు క్రీస్తు సూచించిన శాంతి, సమాధానంతో సన్మార్గంలో నడవలన్నారు. వెంట జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, వంజరి జయరాజ్, మామిళ్ళ ఆంజనేయులు, ఆర్కే శ్రీనివాస్, కిషోర్, బిఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

సీపీఐ శత వసంతాల ప్రదర్శన నేడు

జిల్లా కార్యదర్శి సాబీర్ పాష

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : భారత కమ్యూనిస్టు పార్టీ వందో ఏట అడుగిడుతున్న సందర్భంగా జిల్లా వ్యాపితంగా గురువారం అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాష తెలిపారు. బుధవారం శేషగిరిభవన్‌లో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ శత వసంతాల వేడుకను ప్రారంభిస్తూ జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన కూలి లైన్ సూర్యోదయ పాఠశాల నుంచి ప్రారంభమై ఎంజి రోడ్డు, రైల్వే స్టేషన్ సెంటర్, బస్టాండ్ సెంటర్ మీదుగా పోస్టాఫీసు సెంటరుకు కొనసాగుతుందన్నారు. అరుణ పతాక ఉద్యమ నేపథ్యం శత వసంతాల్లోకి అడుగిడుతున్న సందర్భంగా వంద మంది రెడ్ షర్ట్ వాలింటర్స్ పార్టీ జెండాలతో కవాతు నిర్వహిస్తారని తెలిపారు. పోస్టాఫీసు సెంటరులో జెండా ఆవిష్కరించిన అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గ కేంద్రాల్లో ఈ వసంతోత్సవాల బహిరంగ సభలు నిర్వహించబోతున్నామని తెలిపారు. కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని సాబీర్ వివరించారు.

ఘనంగా వాజ్‌పయి శత జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పెనుబల్లి : మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్పేయి శత జయంతి వేడుకలను రింగ్ సెంటర్లో మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పాలు పళ్ళు పంచారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఇరువురి రమేష్, పడగల మధుసూదన్ రావు, కొనకల్ల వెంకటస్వామి, పేర్ల మహేష్ నాయుడు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. బుధవారం జిల్లాలోని ఇనుగుర్తి మండలంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్‌తో కలిసి నూతన 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ మాట్లాడుతూ పేద ప్రజలకు మరింత ఆరోగ్య సేవలు అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, మారుమూల ప్రాంతంలోని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక హాస్పటల్‌ను 30 పడకల హాస్పటల్ మారుస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆసుపత్రులకు చేర్చేందుకు 108 వాహనాలను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, ప్రచార కార్యదర్శి బైరు అశోక్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంజి రాజేందర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ కొట్టం మహేందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కొట్టం రాము, సీనియర్ నాయకులు చిన్నాల కట్టయ్య, మలిశెట్టి శ్యామ్ కుంచాల రమేష్ మామిడి జనార్ధన్, చరణ్, అజయ్, సుధీర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కారేపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జై కిసాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారి అప్పారావు సూచించారు. మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఐపీకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. రైతు అమ్మిన ధాన్యానికి మంచి గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా లభిస్తుందన్నారు. తేమ శాతాన్ని బట్టి ధర నిర్ణయించడం జరుగుతుందన్నారు.వర్ష సూచన ఉండడం వల్ల రైతులు కల్లాలలో ఆరబోసిన ధాన్యం తడవకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. మాదారంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం భారీగా రైతులు తీసుకొస్తున్నట్లు కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ అజ్మీర శారద తెలిపారు. ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా 48 మంది రైతుల నుండి రెండు వేల ఐదు వందల క్వింటాల పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు క్వింటాకు 500 రూపాయల బోనస్ వెంటనే అకౌంట్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఆయన వెంట కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ అజ్మీర శారద, ఊతం చంద్రకళ, కుర్ర నర్మద, పూనేం వెంకటమ్మ, వాంకుడోత్ భారతి, లక్ష్మి, ఝాన్సీ, దూలమ్మ, సుజాత, సుధ, కుర్ర శ్రీను, గుర్రం నరసింహారావు, కోయిల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 4,000 స్టోర్లతో ఓలాఎలక్ట్రిక్ ఈవీ విప్లవం

ముంబయి: భారతదేశ అతిపెద్ద ప్యూర్ ప్లే ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ తన నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా 4,000 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. ఈవీ రంగంలో ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన విస్తరణలలో ఒకటి, దేశంలో అందుబాటు, వృద్ధి, స్వీకరణను ఇది పెంచుతుంది. ఓలా ఎలక్ట్రిక్ ఈ రంగంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది. సర్వీస్ సెంటర్లతో కలిసి 3,200కు పైగా కొత్తస్టోర్లను ప్రారంభించడం ద్వారా, టైర్-1, టైర్-2నగరాలను దాటి భారతదేశం అంతటా దాదాపు ప్రతి పట్టణం, తాలూకా వరకు చొచ్చుకుపోవడానికి వీలుగా పెద్దఎత్తున ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తేవడానికి కంపెనీ కట్టుబడి ఉంది. ఈ విస్తరణతో, ఓలా ఎలక్ట్రిక్ తన సేవింగ్స్‌వాలాస్కూటర్ ప్రచారంలో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చింది. ఈ సందర్భంగా ఓలా ఎలక్ట్రిక్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భవిష్ అగర్వాల్ మాట్లాడుతూ, ప్రతినగరం, పట్టణం, తాలూకాకు తమ నెట్వర్క్‌ను విస్తరిస్తున్నందున ఈరోజు భారతదేశపు ఈవీ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు.

4 రోజుల్లో జైపూర్ జ్యువెలరీ షోకు 50,000 మంది సందర్శకులు

హైదరాబాద్: నాలుగు రోజుల పాటు జరిగిన 'ది డిసెంబర్ షో' - జైపూర్ జ్యువెలరీ షో (జేజేఎస్) సోమవారం గ్రాండ్ ఫినాలేతో ముగిసింది. జెఇసిసిలో జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 50,000 మంది సందర్శకులు, వ్యాపారులు స్వాగతం పలికారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే, నిర్వాహకులు, ఎగ్జిబిటర్లు తమకు లభించిన ఉత్సాహభరితమైన, సానుకూల ప్రతిస్పందనతో సంతృప్తి చెందారు, ఇది షో మరొక విజయవంతమైన ఎడిషన్ను సూచిస్తుంది. అసాధారణ విజయాలను పురస్కరించుకుని ముగింపు సభతో కార్యక్రమం ముగిసింది. పెర్ల్ అకాడమీ ఉత్తమ ఇన్ స్టిట్యూట్ డిస్ ప్లేగా ట్రోఫీని గెలుచుకుంది. బెస్ట్ బూత్ అవార్డ్స్, బెస్ట్ యంగ్ ఉమెన్ అచీవర్స్ అవార్డులు కూడా దక్కాయి. అదనంగా, రూబీ రీడిఫైన్ ఒక ప్రత్యేకమైన డిజైన్ పోటీని నిర్వహించింది, ట్రెండీ, ఫ్యూచరిస్టిక్ శైలులలో అసాధారణ కోతలు లేదా రూపాలతో రూబీ జెమ్స్‌ను ఉపయోగించి ఆభరణాలను సృష్టించమని పాల్గొనేవారికి సవాలు విసిరింది. మాన్వీ గుప్తా మొదటి స్థానంలో, సోనాల్ లఖేరా రెండో స్థానంలో, హ్యాపీ శ్యామ్సుఖా, కార్తీ ఖబియా మూడో స్థానంలో నిలిచారు.

మియాపూర్‌లో ముజిగల్ అత్యాధునిక మ్యూజిక్ అకాడమీ ప్రారంభం

హైదరాబాద్: భారతదేశపు అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్, ముజిగల్ తమ అత్యాధునిక సంగీత అకాడమీని హైదరాబాద్‌లో ప్రారంభించింది. జెపి నగర్, మియాపూర్ (హైదరాబాద్)లో ఉన్న ఈ అకాడమీ 1700 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇది గాత్ర, వాయిద్యాలతో సహా సంగీతాన్ని నేర్చుకోవడానికి అత్యంత అనుకూలమైనది. దాదాపు 500 మంది విద్యార్థులకు పలు బ్యాచ్‌లుగా బోధన చేసే సౌకర్యాలు కలిగిన జెపి నగర్, మియాపూర్‌లోని ఈ మ్యూజిక్ అకాడమీలో పియానో, కీబోర్డ్, గిటార్, డ్రమ్స్, కర్నాటిక్ వోకల్స్, హిందుస్తానీ వోకల్స్, వెస్ట్రన్ వోకల్స్, వయోలిన్, ఉకులేలే లో బోధన చేస్తారు. సంగీత అభ్యాసంలో సమగ్రమైన కార్యాచరణ అందించడం ద్వారా, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపాలలో బోధనతో సంగీత విద్యలో అత్యున్నత ప్రమాణాలను ముజిగల్ అత్యాధునిక అకాడమీ ఏర్పరిచింది. ఇదే కేంద్రంలో సంగీత పరికరాలను సైతం విక్రయాలకు అందుబాటులో ఉంచినట్లు ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి అన్నారు.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ మొబైల్ యాప్ ఐప్రు ఎడ్జ్‌కు ఆదరణ

ముంబయి: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, దాని సలహాదారుల కోసం ప్రత్యేకంగా అందించే మొబైల్ యాప్ 'ఐప్రు ఎడ్జ్' హెచ్1-ఎఫ్‌వై2025లో వారి ఉత్పాదకతలో 37% పెరుగుదలకు దారితీసింది. ఫలితంగా వారికి అధిక ఆదాయమూ వచ్చింది. ముఖ్యంగా ఐప్రు ఎడ్జ్‌ని ఉపయోగించే 98.1% ఏజెంట్లకు అదేరోజు కమీషన్లను చెల్లించే మొదటి జీవిత బీమా సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్. కంపెనీ 2 లక్షలకు పైగా సలహాదారుల నెట్‌వర్క్‌ను కలిగిఉంది. కంపెనీ అగ్ర సలహాదారులలో దాదాపు 61% మంది ఇప్పుడు తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడంలో సహాయపడే యాప్‌ను చురుకుగా ఉపయోగిస్తున్నారు. ఈ మొబైల్ యాప్ ఏజెంట్ల కోసం ప్రయాణంలో సైతం కార్యాలయంగా పనిచేస్తుంది.

కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్‌కు ఘన నివాళి

హైదరాబాద్: మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్ 22వ వర్ధంతిని పురస్కరించుకొని మహబూబ్‌నగర్‌లోని ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. దేశ అభివృద్ధికి చేసిన కృషిని, రక్షణ శాఖ సహాయ మంత్రిగా, రైల్వే శాఖ సహాయ మంత్రిగా చేసిన సేవలను ప్రస్తావించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నేతగా ఆయన ప్రస్థానం, ఆ తర్వాత ఏపీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన కృషి, మహబూబ్‌నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఓలా ఇ-బైక్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు పట్టణంలో ఇటీవలే ఏర్పాటు చేసిన ఓలా ఇ-బైక్ షోరూం బుధవారం అందుబాటులోకి వచ్చింది. ఈ బైక్ షోరూం ను ఇల్లందు కరెంట్ ఆఫీస్ సెంటర్లో ఏర్పాటు చేయగా దాన్ని కోరం కనకయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం, వాతావరణంలో కాలుష్యం అధికమవడంతో ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలను ప్రోత్సహిస్తుందని ఆయన తెలిపారు. పెట్రోల్ డీజిల్‌తో ఆర్థిక భారం పెరగడంతో ఎక్కువమంది ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల పట్ల ఆకర్షితులవడం మంచి పరిణామం అన్నారు. ఇంధనం, నిర్వహణ ఖర్చులను తగ్గించి పర్యావరణానికి ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడుగు సాంబమూర్తి, బొల్లా సూర్యం, నిలవెల్లి నరసింహారావు, చిట్టిబాబు, చిల్లా శ్రీనివాస్, ఉల్లింగ సతీష్,సాయి, ఊరకొండ ధనుంజయ్, పింగళి నరేష్, అఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారఖ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: అంతార్గం మండలం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన 9 మందికి కళ్యాణ లక్ష్మి, షాది ముభారఖ్ చెక్కులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక పాలకుర్తి మండలంలో రెండవసారి కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే 6 గ్యారంటీలను దశల వారిగా అమలు చేస్తున్నామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, రైతు భరోసాను అందిస్తామని, సన్న వడ్లకు ఈ సీజన్ నుండే 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్గం మండల తహసీల్దార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపాదకీయం

రుధిరంతో ఎరుపెక్కింది!

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి 99 ఏళ్లు పూర్తయి, వందోయేట అడుగుపెట్టింది. ఈ రోజు నుంచి 365 రోజులపాటు ఆ పార్టీ శతవసంత వేడుకలను జరుపుకుంటుంది. ఎర్రజెండాను నమ్ముకున్న ప్రతి కమ్యూనిస్టూ సంబరపడే రోజులివి. కమ్యూనిస్టుల పతాకానికి ఎరుపురంగు ఊరికే రాలేదు. వీరుల రుధిరంతో అది ఎరుపెక్కింది. అవునన్నా కాదన్నా. ఆది నుంచీ అమరుల త్యాగాలు ఆ పార్టీ సొంతం. మహామహుల రక్తతర్పణాలను విస్మరిస్తూ, వారి త్యాగాలను స్పృశించకుండా చరిత్రను చదవలేం. అందుకే కమ్యూనిస్టు పార్టీ చరిత్ర చదవడానికి కొందరు భయపడుతూ ఉంటారు. కమ్యూనిస్టు పార్టీ చరిత్ర అసాధారణం. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో అదొక పార్శ్వం. ఉరికంబాలపై ఒరిగిన వీరుల మహోన్నత త్యాగాలు అందులో భాగం. విప్లవోద్యమాలు, కఠిన కారాగార శిక్షలు అనుభవించిన విప్లవకారుల గాథలు, లాఠీలు, తూటాలు, ఎన్నెన్నో నిషేధాలు, నిర్బంధాలు, దౌర్జన్యాలను ఎదుర్కొంటూ ముందుకు సాగిన దేశభక్తులు ఊపిరిలూదిన వీరగాథలకు సీపీఐ చరిత్రలో లెక్కలేనన్ని పేజీలుంటాయి. ఇంతటి త్యాగాలు మావల్ల కాదంటారు నేటి బూర్జువాపార్టీల నేతలు. భారత కమ్యూనిస్టు పార్టీకి ఉన్నంత త్యాగచరిత్ర ఏ పార్టీకీ లేదంటే అతిశయోక్తికాదు. సిద్ధాంత వైరుధ్యాలతోనో, భావజాల భారాలతోనో కమ్యూనిస్టుపార్టీ పదిపన్నెండు ముక్కలైనా, మాతృసంస్థ సీపీఐ మాత్రం మనోనిబ్బరంతో నిజమైన మాతృమూర్తిలాగ, అందరికీ దన్నులాగ, ఉద్యమజ్వాలలు రగిలించే నిఖార్సయిన నిప్పులాగ, ఆరనిదివ్వెలాగ కాంతులీనుతూ, నిరుపేదకు అండగా నిలిచే పెద్దన్నలాగ కలబడైనా సరే తడబడకుండా నిలబడుతూ ముందుకు, మున్ముందుకు సాగిపోతోంది. కమ్యూనిస్టుపార్టీని నమ్ముకున్నవాళ్లలో ఈ వందేళ్లు పోయినవారు పోయినా, వచ్చినవారు వస్తూనే పార్టీకి పునరంకితమవుతూ నడిపిస్తున్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ బూర్జువా పార్టీకాదు, కార్పొరేట్ పార్టీ అసలే కాదు. దీనికి వ్యాపార, వాణిజ్య సామ్రాజ్యాధినేతల అండదండలేమాత్రం ఉండవు. ఐదేళ్లకోసారి అధికారంలోకి వస్తామన్న నమ్మకాలు ఉండనే ఉండవు. కుర్చీలకోసం ప్రాకులాట వంటపట్టలేదు. పదవుల కోసం అర్రులుజాచే అలవాట్లులేవు. నల్లకళ్లజోళ్ల వెనుక కనుసైగల నడుమ డబ్బుసంచులూ మారవు. ఖద్దరు చొక్కాలు, తెల్లపంచెలూ, ఐదారు సుమోలు, బడా బౌన్సర్లూ, మందీమార్బలమూ కానరావు. ఇంత హడావిడి లేనప్పుడు నేటి సమాజంలో కమ్యూనిస్టును గుర్తుపట్టడం ఒకింత కష్టసాధ్యమే. ఇది ప్రజాపార్టీ. ప్రజల కోసం, ప్రజల యొక్క, ప్రజలే నడుపుతున్న పార్టీయిది. రెండు చొక్కాలను సంచిలో వేసుకొని, వాటినే ఉతుక్కుంటూ, దేశమంతా సంచరిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసిన చండ్ర రాజేశ్వరరావు వంటి అలుపెరుగని యోధులు నడిపిన పార్టీయిది. కులమతభేదాల్లేని అచ్చమైన లౌకికపార్టీయిది. ఫాసిజం, మతోన్మాదాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన అస్త్రం కమ్యూనిస్టు పార్టీ. భారత రాజ్యాంగ వ్యవస్థకు ప్రధాన కాపలాదారు కమ్యూనిస్టు పార్టీ. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అహర్నిశలు పాటుపడుతున్న ఓ మహాశక్తి కమ్యూనిస్టు పార్టీ. కార్మికులు, కర్షకులు, మహిళలు, సామాన్య, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అరుగాలం శ్రమిస్తున్న ఏకైక వేదిక కమ్యూనిస్టు పార్టీ.

భారత కమ్యూనిస్టు పార్టీ ఉజ్వల పోరాట చరిత్ర ఉద్వేగపూరితం. కాదనలేని సత్యమిది. కాకపోతే అది చరిత్రగా మిగిలిపోవాల్సిందేనా? నూరేళ్ల పోరాటాలు, త్యాగాలు నల్లరాతిపై చెక్కిన శాసనాల్లాగ చారిత్రక గురుతులేనా? ఈ ప్రశ్నలకు సమాధానాలుగా ఆత్మస్తుతి, ఆత్మపరిశీలన, ఆత్మనింద, పరనింద..ఇలా రకరకాల పేర్లతో కర్తవ్యబోధన చేసుకునే ముందు ఇంకో అంశాన్ని పరిశీలిద్దాం! మనం మిస్సయిన అంశాలు ఇక్కడ దొరకుతాయేమో చూద్దాం!

భారత కమ్యూనిస్టు పార్టీ తరహాలోనే రష్యా అక్టోబరు విప్లవ స్ఫూర్తితో, మార్క్సిస్టు, లెనినిస్టు విప్లవ సూత్రాల ప్రాతిపదికగా చైనా కమ్యూనిస్టు పార్టీ (సీసీపీ) 1921లో అవతరించింది. 1949లో మావో జెడాంగ్ సారథ్యంలోని సీసీపీ కొమింటాంగ్ నాయకత్వంలోని జాతీయవాదులను ఓడించి, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను ఏర్పాటు చేసింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు మారుతున్న ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా పార్టీలోనూ, చైనాలోనూ సంస్కరణలు చేపడుతూ ఎర్రజెండా నీడలోనే మహా చైనా అవతరించింది. మందగిస్తున్న ఆర్థిక పురోగతి, కుంచించుకుపోతున్న పర్యావరణ వ్యవస్థ, అమెరికాతో ఉద్రిక్తతలు అనే మూడు అంశాలు పార్టీ ముందున్న సవాళ్లుగా ఇటీవల జరిగిన సీసీపీ సమావేశం గుర్తించింది. ఆ పార్టీకి 9 కోట్ల మంది క్రియాశీల కార్యకర్తలున్నారు. వారిలో ఒక కోటి మంది సోషల్‌మీడియా వేదికగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పనిచేస్తూ ఉంటారు. వారు పార్టీ కార్యకలాపాలను, ప్రభుత్వ కార్యక్రమాలను సమతుల్యం చేస్తూ ప్రచారం చేస్తూ ఉంటారు. అతిపెద్ద అమెరికా సైతం చైనా సైన్యమే లక్ష్యంగా చూస్తూ ఉంటుంది. కానీ, సామాజిక మాధ్యమాలు వేదికగా పనిచేసే చైనా సైన్యం అంతకన్నా అతిబలమైనది. సోషల్ మీడియాపై సీసీపీ పెట్టే వ్యయంపై లెక్కలు ఇక్కడ అప్రస్తుతం. ఆ రంగానికి సీసీపీ ఇచ్చే ప్రాధాన్యత మాత్రమే ప్రస్తావనార్హం. చైనా కమ్యూనిస్టు పార్టీ సాహసాలు, త్యాగాలను నేటి తరానికి బోధిస్తూనే ఉంటుంది. అలాగే, అమెరికాకు ఎదురొడ్డి నిలబడిన క్యూబా ఫిడెల్ కాస్ట్రో, రౌల్ కాస్ట్రో, ప్రస్తుతం మిగ్యుల్ డియాజ్ కానెల్ సారథ్యంలో సత్పరిపాలనతో ముందుకు సాగుతోంది. నేటికీ అమెరికాను అతిపెద్దగా వణికిస్తున్న అతిచిన్న దేశం క్యూబానే. క్యూబన్ కమ్యూనిస్టు పార్టీ సోషల్ మీడియాపై యేటా ఒక మిలియన్ డాలర్లను ఖర్చుచేస్తుంది. చే గువేరా, కాస్ట్రో పోరాటాలు, త్యాగాలను ఎప్పటికప్పుడు ప్రజలకు ముఖ్యంగా యువతకు గుర్తుచేస్తూ ఉంటుంది. ఇంకొన్ని కమ్యూనిస్టు దేశాలైన వియత్నాం, లావోస్‌లో సైతం సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలంగా పనిచేస్తూ ఉంటాయి.

పైన పేర్కొన్న అంశాలకు అనుసంధానంగా చెప్పాల్సిన కీలక అంశం ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. మిలీనియల్స్, జెన్-వై, జెన్-జెడ్, జెన్-ఆల్ఫా అనే పదాలు ఈనాడు తరచూ విన్పిస్తున్నాయి. మిలీనియల్స్ అంటే 1980-1994 మధ్య జన్మించిన వారు. జెన్-జెడ్ అంటే జనరేషన్ జెడ్. వీరు 1995-2012 మధ్య పుట్టినవారు. ఇక జెన్-ఆల్ఫా అంటే 2013-25 మధ్య జన్మించిన వారు అని అర్థం. మిలీనియల్స్‌లో కమ్యూనిస్టు భావజాలం తగ్గిపోతూ ఉంది. ఇక జెన్-జెడ్ పూర్తిగా టెక్నాలజీపైనే ఆధారపడి బతుకుతున్న తరం. ఇక జెన్-ఆల్ఫా తరం ఏ స్థాయిలో ఉంటుందో ఇట్టే ఊహించుకోవచ్చు. ఈ విశ్లేషణలో చెప్పొచ్చేదేమిటంటే, భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల త్యాగాలను, పోరాటాలను జెడ్-జెడ్, జెన్-ఆల్ఫాలకు తెలియజేయకపోతే, ఇంత గొప్ప చరిత్ర నిజంగానే చరిత్రగా మసగబారిపోతుంది. ఇందుకోసం చైనా, క్యూబా, వియత్నాం, లావోస్ కమ్యూనిస్టు పార్టీలను స్ఫూర్తిగా తీసుకోవాలి. త్యాగాల రుధిరంతో రూపొందిన అరుణపతాక గొప్పతనాన్ని చెప్పడానికి ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాలు తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉందని చెప్పలేం.

రక్త రంజిత సారంగి

గురువారం పార్లమెంటు ఆవరణలో జరిగిన సంఘటనలు మన పార్లమెంటరీ సంప్రదాయాలకు భారీ విఘాతం కలిగిస్తాయని మాటిమాటికీ ప్రస్తావించ నవసరం లేదు. పార్లమెంటు ఆవరణలో తోపులాట జరిగిందని ఇందులో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎవరెవరినో నెట్టేశారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఇదే అదును అని రాహుల్ గాంధీ మీద ఎఫ్.ఐ.ఆర్. కూడా నమోదు చేయించారు. పార్లమెంటు ఆవరణలో జరిగిందన్న తోపులాటలో రాహుల్ గాంధీని విలన్ గా నిలబెట్టడానికి ప్రయత్నం జరుగుతోంది. అప్రయత్నంగానే బీజేపీ సభ్యుడు ప్రతాప్ చంద్ర సారంగి క్షతగాత్రుడై హీరో అయిపోయారు. రాహుల్ గాంధీ మరెవరినో తోసేస్తే ఆయన వచ్చి తనమీద పడితే తాను కింద పడిపోయానని ప్రతాప్ చంద్ర సారంగి చెప్తున్నారు. సారంగితోపాటు మరో వ్యక్తిని కూడా రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చేర్పించారు. వాళ్లకు తగిలిన గాయం ఏపాటిదో ఆ గాయాలను గోరంతలను కొండంతలు చేసి ఎలా చూపారో ఈ పాటికే అందరికీ తెలుసు. విచిత్రం ఏమిటంటే పార్లమెంటు ఆవరణలో ఆయన కింద పడిపోయినప్పుడు ఆయన ఎడమ కణత మీద ఓ జేబు రుమాలుతో ఎవరో అదిమిపట్టారు. మరి కొన్ని ఫొటోల్లో ఆయనే స్వయంగా కుడి కణత మీద ఒత్తి పట్టుకున్నట్టుగా ఉంది. కుడి ఎడమలకు పెద్ద తేడా ఏముందిగనక! ఆయనకు రక్తస్రావం కావడం లాంటిది ఏమీ కనిపించలేదు. ఆసుపత్రిలోలో చేరిన తరవాత ఆ గాయానికి కట్టిన కట్టు గడియారంతో పోటీపడి పెరుగుతూ పోయింది.

ఒకే ఒక్కడు

మొదటి చిన్న కట్టు మాత్రమే ఉండేది. ఆ తరవాత అది మరింత పెద్ద కట్టుగా రూపాంతరం చెందింది. చివరకు ఆయన తలకు తలపాగా అంత పెద్ద కట్టుగా మారిపోయింది.

గాయపడిన ఇద్దరు బీజేపీ నాయకుల ఆరోగ్యం మీద కేంద్ర మంత్రులు, ఇతర నాయకులు తీసుకున్న జాగ్రత్త, చేసిన హడావుడి ఏ లెక్కన చూసినా అపూర్వమైందే. అనేక మంది కేంద్ర మంత్రులు బారులు కట్టి ఐ.సి.యు.లో ఉన్న సారంగిని పరామర్శించారు. ప్రధానమంత్రి మోదీ కూడా ఆ ఇద్దరి ఆరోగ్యం గురించి ఫోన్‌చేసి వాకబు చేశారు. ఇంత జరిగిన తరవాత ప్రతాప్ చంద్ర సారంగి పూర్వాపరాలేమిటి తెలుసుకోవాలన్న ఆసక్తి సహజంగానే ఉంటుంది. సారంగి కేంద్రంలో కొంత కాలం మంత్రిగా కూడా ఉన్నారు. సారంగి గాయపడ్డ తరవాత, కాదు కాదు రాహుల్ గాంధీ మరెవరినో తోసేస్తే ఆ వ్యక్తి సారంగి మీద పడినందువల్ల ఆయనకు గాయం అయిన తరవాత అసలీ సారంగి ఎవరు అన్న విచికిత్స పెరిగిపోయింది. జనం "గూగుల్ ఖోదో" కార్యక్రమంలో మునిగిపోయారు. ఆయన రెండుసార్లు శాసన సభ్యుడిగా, రెండుసార్లు లోక్‌సభ సభ్యుడిగా ఉన్నా చాలా నిరాడంబరంగా జీవిస్తారట. ఇప్పటికీ వెదురుకర్రలతో నిర్మించిన గుడిసెలో ఉంటారట. ఆయనకు ఎంపీగా వచ్చే జీతభత్యాలను కూడా పేదలకు పంచిపెడ్తారట. 2019లో ఆయన మొట్టమొదటి సారి కేంద్రంలో నరేంద్ర మోదీ మంత్రివర్గంలో మంత్రి అయినప్పుడు ఇలాంటి సమాచారం అంతా గూగుల్ మాత కడుపులోంచి తన్నుకు వచ్చింది. పార్లమెంటు ఆవరణలో ఆయన గాయపడిన తరవాత 2019లో వచ్చిన సమాచారానికే తిరగమోత పెట్టి మళ్లీ ప్రచారంలో పెట్టారు. కానీ క్రైస్తవ మిషనరీ గ్రహం స్టెయిన్స్, ఆయన ఇద్దరు పిల్లలను హతమార్చిన కేసులో ప్రతాప్ చంద్ర సారంగి నిందితుడు అని తెలుసుకునే శ్రమ చాలా మంది తీసుకోలేదు. ఒరిస్సా శాసనసభలోకి చొరబడి మత కలహాలు సృష్టించినందుకు జైలుకెళ్లిన ఘనతా ఆయనకు ఉంది.

ప్రతాప్ చంద్ర సారంగి ఇంటిపేరు నిజానికి సారంగి కాదు. ఒరిస్సాలో షడంగి అన్న ఇంటిపేరు ఉండొచ్చు. కానీ సారంగి అన్న ఇంటిపేరు కనిపించదు. అంటే ఆయన ప్రతాప్ చంద్ర షడంగి అయి ఉండాలి. ఆయన అత్యంత నిరాడంబర జీవితం గడుపుతారని ప్రతీతి. అయితే నిజానికి ఆయనది రక్త రంజిత చరిత్రే. 1999 జనవరి 22న గ్రహం స్టెయిన్స్ ఆయన ఇద్దరు పిల్లల సజీవ దహనం కేసులో ఈ షడంగి నిందుతుడట. గ్రహం స్టెయిన్స్ ఒరిస్సాలో దశాబ్దాల తరబడి ఒరిస్సాలోని కుష్టు రోగుల సేవలో నిమగ్నమై పోయారు. ఇద్దరు పిల్లలతో కలిసి గ్రహం స్టెయిన్స్ తన పిల్లలు ఫిలిప్, తిమోతీతో కలిసి కారులో నిద్రిస్తున్నారు. అప్పుడే కొందరు మతోన్మాదులు ఆయన వాహనానికి నిప్పు పెట్టారు. గ్రహం స్టెయిన్స్, అమాయకులైన ఆయన ఇద్దరు పిల్లలు సజీవంగా దహనమై పోయారు. ఈ కేసులో విచారణ జరిగినప్పుడు బజరంగ్ దళ్ నాయకుడు దారా సింగ్, ప్రతాప్ చంద్ర షడంగితో సహా మొత్తం 12 మంది మీద కేసు దాఖలైంది. ఈ కేసులో కింది కోర్టు దారా సింగ్ కు మరణ శిక్ష విధించింది. షడంగితో సహా మిగతా 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. నిందితుల జాబితాలో ప్రతాప్ చంద్రది రెండో పేరు. ఆ తరవాత ఒరిస్సా హైకోర్టు దారా సింగ్ మరణ శిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. రుజువులు లేవన్న కారణంగా ప్రతాప్ చంద్ర షడంగీతో పాటు మిగత 11 మందిని హైకోర్టు నిర్దోషులుగా తేల్చింది. తన యావజ్జీవ కారాగార శిక్షను రద్దు చేయించుకోవడానికి దారా సింగ్ ఇప్పటికీ సుప్రీంకోర్టు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మరో సంఘటన చూద్దాం. 2001 డిసెంబర్ 26న ఒరిస్సా శాసనసభ ఘెరావ్ జరుగుతోంది. బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషద్, దుర్గా వాహిని కార్యకర్తలు అసెంబ్లీ ఎదుట ప్రదర్శన ప్రారంభించారు. రామ మందిరం కోసం కేటాయించిన భూమిని ఆలయం నిర్మించేవారికి అందజేయాలని, అప్పుడు జైలులో ఉన్న గిరిరాజ్ సింగ్ ను విడుదల చేయాలని అసెంబ్లీ ఎదుట ఘెరావ్ చేసిన సందర్భం అది. సాయంత్రం శాసనసభ కార్యకలాపాలు ముగుస్తాయనగా ధర్నా చేస్తున్న నిరసనకారులు శాసన సభలోకి చొచ్చుకు వెళ్లారు. విధ్వంసానికి దిగారు. నిరసన తెలియజేస్తున్న విశ్వహిందూ పరిషత్, దుర్గా వాహిని, బజరంగ్ దళ్ కార్యకర్తల చేతుల్లో త్రిశూలాలు ఉన్నాయి. ఆందోళనకారులు జై శ్రీరాం నినాదాలు చేస్తూ ఒరిస్సా శాసనసభలో బీభత్సం సృష్టించారు. ఈ రగడలో కొందరు శాసనసభ్యులు, పత్రికా రచయితలు, శాసనసభ సిబ్బంది గాయపడ్డారు. అప్పుడు ఒరిస్సా బజరంగ్ దళ్ అధ్యక్షుడితో సహా 66 మందిపై కేసు నమోదైంది. జైలుకు వెళ్లిన వారిలో సారంగి కూడా ఉన్నారు. షడంగి నిరాడంబర జీవితం, తన వేతనంలోంచి గణనీయమైన భాగం పేదలకు పంచిపెట్టడం ప్రతాప్ చంద్ర సారంగి జీవితంలో ఒక పార్శ్వం మాత్రమే. రెండో పార్శ్వం అంతా నేరపూరితమైంది.

అనన్యవర్మ

సీపీఐ చరిత్ర పోరాటాలు, త్యాగాలు

డి. రాజా,
సీపీఐ ప్రధాన కార్యదర్శి

సీపీఐ స్థాపన జరిగి వంద సంవత్సరాలైంది. జరిగిన కాలమంతా పోరాటాలు, త్యాగాల చరిత్రే. దేశం కోసం, ప్రజల కోసం గొప్ప పోరాటాలు చేసింది. మనదేశ విముక్తి కోసం స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ పాల్గొన్నది. స్వాతంత్ర్యం అనంతరం దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు రక్తం, స్వేదం చిందించిన తరువాతనే మనం పురోగతి సాధించాం. భారతదేశ చరిత్రలో 1925 డిసెంబరు 26న సీపీఐ స్థాపన గొప్ప సంఘటనగా నిలిచిపోయింది. దేశం నలుమూలల నుంచి అంకిత భావం గల కమ్యూనిస్టులంతా సమీకృతులై సీపీఐని స్థాపించుకున్నారు. సీపీఐ స్థాపన తరువాతనే మన స్వాతంత్ర్య పోరాట మార్గం గొప్ప మార్పు చెందింది. స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ అగ్రభాగాన నిలిచింది. ఉద్యమం మన పార్టీ ప్రణాళికకు భిన్న సైద్ధాంతిక భావజాలంల అంతర్గతంగా అనుసంధానమైన పాత్ర వహించింది. 20వ శతాబ్దిలో సీపీఐ మూలాలు విస్తరించాయి. వలస పాలన కాలంలో మన ప్రజలు అనుభవించిన కష్టాలు, వాస్తవ పరిస్థితులు మనపైన ఎంతో ప్రభావం చూపాయి. 1917 లో రష్యా విప్లవం విజయం మనపైన గొప్ప ప్రభావం చూపింది. కార్మికులు, కర్షకులు, మహిళలు, అణగారిన వర్గాల సమస్యలను, బాధలను ఎలుగెత్తడం కోసం 1920 ల నుంచే దేశభక్తియుత వ్యక్తులు, గ్రూపులు జాతీయ స్థాయిలో ఒక సంస్థను ఏర్పాటు చేసిన అనంతరం 1925 లో సీపీఐ స్థాపన జరిగింది. కాన్పూరులో జరిగిన ప్రథమ మహాసభ మన దేశ రాజకీయ చట్రంలో మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. కాన్పూరులో సీపీఐ స్థాపనకు ముందే శైశవదశలోనే కమ్యూనిస్టులను నలిపివేయాలని కమ్యూనిస్టులపై కేసులను బ్రిటిషు పాలకులు బనాయించారు. ఇండియాలో కమ్యూనిస్టు భావజాలాన్ని వలస పాలకులు ఏ మాత్రం సహించలేదు. కాన్పూరు, మీరట్, పెషావర్ కుట్ర కేసులు విఫలమయ్యాయి. జైళ్లలో పడిన బాధలు ఎంతగానో ప్రోత్సాహాన్నిచ్చాయి. మన దేశ విముక్తి కోసం వీరోచిత పోరాటం చేస్తున్న వందలాది మంది కమ్యూనిస్టులను అండమాన్ జైళ్లలో నిర్బంధించినప్పటికీ వారిలో ఉన్న పోరాట స్ఫూర్తిని ఏమాత్రం విఫలం చేయలేకపోయారు.

కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల వారి బాధలను నిర్మూలించడం కోసం ప్రారంభ దశలో కమ్యూనిస్టులు దోపిడీ శక్తులు, బ్రిటిషు వలస పాలకులపై పోరాటం చేశారు. ఇదే సమయంలో అణగారిన సామాజిక వర్గాలు, కులం పితృస్వామ్య సమస్యలపై కమ్యూనిస్టులు శ్రద్ధపెట్టారు. కాన్పూర్ మహాసభకు అధ్యక్షత వహించిన ఎం.సింగార్ వేలు చెట్టియార్ అంటరానితనాన్ని ఖండిస్తూ దాన్ని నిర్మూలించాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు భావజాల పరంగా సామాజిక వ్యతిరేక పోరాటంలో మమేకమై ఉండటమే గాక గాఢంగా సెక్యులరిజాన్ని అనుసరించారు. కమ్యూనిస్టులు ముందుగానే సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్‌చంద్రబోస్ లాంటి నాయకులు సంపూర్ణ స్వాతంత్ర్యం డిమాండ్‌కు అనుకూలం ప్రకటించారు. వలస పాలకులు దోపిడీదారులని, వీరిని పూర్తిగా కూలదోసి స్వాతంత్ర్యం పొందాలని 1920లలో, 1930లలో పూర్తిగా కమ్యూనిస్టులు ప్రచారం చేశారు. ఇదే సమయంలో బ్రిటీష్ వలస పాలనను పూర్తిగా తిరస్కరించాలని, భారత దేశ ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే రాజ్యాంగ అసెంబ్లీని ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టులు డిమాండ్ చేశారు. భారత్‌లో రాజకీయ భవిష్యత్‌పై చర్చించాలని కోరారు. ప్రజల సార్వభౌమాధికారం ఆధారంగా నూతన రాజకీయ వ్యవస్థగా ఉండాలని కమ్యూనిస్టులు వాదించారు. మన రాజ్యాంగం పీఠిక "మేము భారతదేశ ప్రజలం" అన్న భావనను ప్రతిబింబించాలి. రాజ్యాంగ అసెంబ్లీలో కామ్రేడ్ సోమనాథ్ లహరి ఒక్కరే ఉన్నారు. అయినప్పటికీ సీపీఐ సైద్ధాంతిక భావజాలం రాజ్యాంగ తుదిపత్రంలో చెరిపివేయలేని ముద్ర వేసింది. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల ప్రజల హక్కులు కేంద్రంగా ఉండాలన్నది కమ్యూనిస్టుల దృష్టి. రాజ్యాంగంలోని కీలక అంశాలను రాజ్యాంగం తుది పత్రం ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు పీఠిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆశయాలను

ప్రతిబింబిస్తోంది. కమ్యూనిస్టులు డిమాండ్ చేసిన సమ్మిళిత తత్వం, ప్రజాస్వామ్య భారతదేశంలో పైన పేర్కొన్న అంశాలన్నీ ఇమిడి ఉన్నాయి. ఆర్థిక న్యాయం, కార్మిక వర్గం రాజకీయ ప్రాతినిధ్యం కోసం మౌలిక హక్కులను చేర్చడం, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వ ఫ్రేమ్ వర్క్ తదితర అంశాలు కమ్యూనిస్టు నాయకత్వం ప్రమోట్ చేసిన భావాలలో గమనించవచ్చు. రాజ్యాంగ అసెంబ్లీలో ఎక్కువ మంది కమ్యూనిస్టు సభ్యులు లేకపోయినా వారు విడవకుండా ఈ సమస్యలపై జరిపిన చర్చ ప్రజల అభిప్రాయం రూపొందడానికి కీలక పాత్ర వహించింది. దేశానికి త్వరలో స్వాతంత్ర్యం లభిస్తుందని అనుకున్న కాలానికి కొంచెం ముందు సీపీఐ విప్లవకర పాత్రను పోషించింది. బ్రిటీషు సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా బలమైన శక్తిగా నిలిచి పార్టీ పోరాడింది. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం, సామాజిక న్యాయం, కార్మికులు, కర్షకులు హక్కుల కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ముందు పీఠిన నిలచి పోరాడారు. గోవాలో పోర్చుగీసుకు వ్యతిరేకంగా, పుదుచ్చేరిలో ఫ్రెంచి వాళ్లకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ లార్డ్సుకు, భూస్వామ్యానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నిరంతం పోరాడారు. తెలంగాణలో నిజాం పాలనలో ఉన్న హైదరాబాదు రాష్ట్రంలో సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాటం జరిగింది. నాలుగు వేలమందికి పైగా కమ్యూనిస్టు కార్యకర్తలు, రైతులు ప్రాణ త్యాగం చేశారు. నిజాం అణచివేతకు వ్యతిరేకంగా రైతులు ఆయుధాలు ధరించి పోరాటాలు చేయడంతో నిజాం పాలన అంతమైంది. భూసంస్కరణలు డిమాండ్ చేస్తూ కేరళలోని పున్నప్ర- వాయిలార్‌లో కమ్యూనిస్టుల నాయకత్వంలో తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాట్లు కేవలం స్థానిక ప్రతిఘటనకాదు, దేశవ్యాప్తంగా బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న మహత్తర ఉద్యమంలో భాగమే. దోపిడీ వర్గాలు సామాజిక - ఆర్థిక రంగాలపైన అధిపత్యం వహించాయి. ఈ ఉద్యమాలన్నింటిలోనూ కమ్యూనిస్టుల ప్రత్యక్ష పాత్ర ఉంది. వలస పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా సోషలిస్టు వ్యవస్థ కోసం కమ్యూనిస్టుల పాత్ర అన్ని ఉద్యమాలలో ఉంది. కార్మికులను, కర్షకులను, విద్యార్థులను, రచయితలను, మేధావులను ఏఐటీయూసీ, అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్), అఖిల భారత విద్యార్థిసమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్), ఏఐవైఎఫ్, అభ్యుదయ రచయితల సంఘం (అరసం), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ద్వారా సమీకరించడానికి కమ్యూనిస్టులు ముందుగా చొరవ తీసుకున్నారు. బ్రిటీష్ వలసపాలకులకు వ్యతిరేకంగా 1946 లో భారత నావికా సిబ్బంది తిరుగుబాటు జరిగింది. ఇది దేశ వ్యాప్తంగా ఉన్న పోర్టులలో ఉన్న నావికాదళాలకు వ్యాపించింది. ఈ పోరాటాలకు కమ్యూనిస్టులు అత్యంత క్రియాశీలకంగా మద్దతునిచ్చారు. నావికా తిరుగుబాటుకు అనుకూలంగా కమ్యూనిస్టులు పెద్దఎత్తున ప్రదర్శనలు జరిపారు. నావికా తిరుగుబాటు ప్రాథమిక దశలో సైనిక తిరుగుబాటు వలె జరిగింది. నావికులు సమ్మెలు, ప్రదర్శనలు చేశారు. వీరికి అండగా నిలిచేందుకు కార్మిక వర్గాన్ని సమీకరించడం ద్వారా కమ్యూనిస్టులు కీలక పాత్ర వహించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయానికి సీపీఐ కట్టుబడి ఉంది.

విప్లవకర ఉద్యమాలతో కమ్యూనిస్టులు మమేకమయ్యారు. మార్క్స్, ఏంగిల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక, రష్యా విప్లవం విలువలు స్ఫూర్తినిచ్చాయి. దేశ రాజ్యాంగం రూపొందించేందుకు యత్నిస్తున్నప్పుడు నైతిక సూత్రాలు పాటించడంతో పాటు కమ్యూనిస్టుల మద్దతు నిచ్చారు. రాజకీయ స్వేచ్ఛలతో పాటు ఆర్థిక సామాజిక హక్కులు హామీ ఉండే రాజ్యాంగం కావాలని, దేశవ్యాప్తంగా విస్తరించిన తిరుగుబాట్లు, కార్మికవర్గం ప్రతిఘటనలు తెలియజేశాయి. ఇదే కాలంలో 1925 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను స్థాపించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ ద్వంద్వ ప్రమాణాలు, ప్రతీఘాతక పాత్రను నిర్వహించింది. ప్రత్యేకించి 1940 లో స్వాతంత్ర్యం సిద్ధించడానికి ముందుకాలంలో ద్వంద్వ ప్రమాణాలను, ప్రతీఘాత పాత్రను అత్యంత తీవ్రంగా అనుసరించింది. బ్రిటీష్ పాలకులతో తుది పోరాటానికి సిద్ధమవుతున్న సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు కెబి హెగ్డేవార్, తరువాత ఎంఎస్ గోల్వాల్కర్ పరస్పర వైరుధ్యాన్ని అనసరించారు. కొన్ని సమయాలలో స్వాతంత్ర్య పోరాటానికి బహిరంగంగానే వ్యతిరేక వైఖరిని ప్రదర్శించారు.

మన రాజ్యాంగ పత్రాన్ని రచిస్తున్న దశలో దేశ విభజన తర్వాత మతరాజ్యం కావాలని ఆర్‌ఎస్‌ఎస్ వత్తిడి చేసింది. భారత రాజ్యాంగం ప్రధానమైన రూపకల్పన కర్త డాక్టర్ అంబేద్కర్ మత ప్రాధాన్యత గల రాజ్యాంగాన్ని మొదటి నుంచి ధృడంగా వ్యతిరేకించారు. ఆయన సెక్యులర్ రాజ్యం, దళితులకు హక్కులుండాలని కోరారు. మత రాజకీయాలను వ్యతిరేకించారు.. ఆర్‌ఎస్‌ఎస్ విచ్ఛిన్నకర సిద్ధాంతాన్ని గట్టిగా తిరస్కరించారు. సమానత్వానికి, సామాజిక న్యాయానికి అంకితమైన గొప్ప దూరదృష్టి గల నాయకుడు. భవిష్యత్ భారతదేశాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. సీపీఐ శతవార్షికోత్సవాన్ని నిర్వహించుకుంటున్న తరుణంలో రాజ్యాంగంలో చేర్చిన విలువలపైన ఆర్‌ఎస్‌ఎస్ దాడి చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాజ్యాంగంలో పొందుపరిచిన సెక్యులరిజం, సమ్మిళితం, ప్రజాస్వామ్య సూత్రాలను ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంఘాలు తమ సైద్ధాంతిక భావజాలం, రాజకీయ వ్యూహాల ద్వారా దిగజార్చడానికి ప్రచారం సాగిస్తున్నారు. కులం, మతం, జాతులతో నిమిత్తం లేకుండా రాజ్యాంగం పౌరులందరికీ హక్కులు కల్పించింది. హిందూ రాష్ట్రం కోసం ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం ప్రచారం సాగిస్తోంది. రాజ్యాంగ రూపకర్తలు రాజ్యాంగంలో పొందుపరిచిన సెక్యులర్ విజన్‌ను తమ ఎజెండాలో ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకిస్తోంది. దళితులకు, వెనుకబడిన తరగతులకు, మైనారిటీలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలను రద్దుచేయడానికి లేదా మార్చుకునేందుకు, నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఇండియా రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రధానమైన సామాజిక న్యాయం, సమానత్వం, మైనారిటీల హక్కుల పరిరక్షణ విలువలకు నేరుగా ముప్పు కలిగించేలా సంఘ్ పరివార్ చర్యలు కనిపిస్తున్నాయి.

ఈ దాడులకు సమాధానంగా విశాల ప్రతిఘటనోద్యమం ఏర్పడింది. ఇందులో వివిధ రాజకీయ, సామాజిక, మేధో గ్రూప్‌లు కమ్యూనిస్టులు ఉన్నారు. రాజ్యాంగ విలువలను, మన దేశ సమ్మిళిత స్వభావాన్ని పరిరక్షించడానికి ఈ ఉద్యమం జరుగుతోంది. సెక్యులరిజం కోసం కమ్యూనిస్టులు దీర్ఘకాలంగా కృషి చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంస్థలు సైద్ధాంతిక భావజాల దాడికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో కమ్యూనిస్టులు ముందు పీఠిన ఉన్నారు. అణగారిన తరగతుల ప్రజలను రాజ్యాంగపరంగా రక్షించడానికి వామపక్షాలు విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నాయి. తీవ్రమైన అసమానతలు, సామాజిక, ఆర్థిక న్యాయం కోసం దేశం ఇంకా తడబడుతూనే ఉంది. స్వాతంత్ర్యం, సమానత్వం, సామాజిక మార్పు, ప్రజాస్వామ్య సూత్రాల పరిరక్షణ కోసం సుదీర్ఘకాలం జరిగిన పోరాట ఫలితంగా రాజ్యాంగ రూపకల్పన జరిగిన విషయాన్ని కమ్యూనిస్టులు దేశ ప్రజలకు ప్రచారం ద్వారా తెలియజేస్తూనే ఉన్నారు. రాజ్యాంగాన్ని దాని విలువలు, సోషలిజం, సెక్యులరిజం, న్యాయం, ఇండియా ఫాబ్రిక్‌ను మతోన్మాదుల, ఆశ్రిత పెట్టుబడిదారుల నుంచి కాపాడడం సంక్లిష్టంగానే ఉంది. వంద సంవత్సరాల క్రితం నాటి వారసత్వాన్ని రక్షించడం, విస్తరించడం, వర్గరహిత, కుల రహిత సోషలిస్టు నూతన ఇండియా కోసం పోరాటంలో విఖ్యాతమైన మన పాత్రను కొనసాగించాలి.

ఒక స్వప్నాన్ని సాకారం చేసేందుకు...

ఆర్వీ రామారావ్

"మానవ సమాజ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే"నని మార్క్స్-ఎంగెల్స్ 1848లో రాశారు. వాళ్లలా రాసిన 77 యేళ్లకు, 1925లో ఈ చరిత్ర మన దేశంలో ఓ మూలమలుపు తీసుకుంది వర్గ సమాజాన్ని అంతమొందించడమనే ఏకైక లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ ఈ గడ్డపై ఆవిర్భవించింది. అంటే, మన మిప్పుడు, మన పార్టీ శత వసంత ఉత్సవాల ముని వాకిట్లో నిలబడివున్నాం! నూరేళ్ల కిందట, భారతదేశ సామాజిక ఆర్థిక స్థితిగతులెలా వున్నాయో అర్థం చేసుకుంటే తప్ప, 1925లోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఎందుకు పుట్టిందో మనకు అర్థం కాదు! 1920 దశకం నాటి భారతీయ సామాజికార్థిక జీవనం, నేటి జీవితానికి ఎంతో భిన్నంగా వుండేది. అంతకు రెండు శతాబ్దాలకు పూర్వమే మన దేశంలో పారిశ్రామికీకరణ మొదలైన మాట నిజం. జౌళి వస్త్రాలు, పట్టు వస్త్రాలు, కాగితం, పరిమళద్రవ్యాల తయారీ, నౌకానిర్మాణం, తోళ్ల పరిశ్రమ- ఇలాంటి పరిశ్రమలు పద్దెనిమిదో శతాబ్దం నుంచీ మన దేశంలో ఉనికిలో ఉన్న మాట వాస్తవమే! వాటన్నింటినీ మించి మూడు పూవులూ ఆరు కాయలుగా వ్యవసాయమూ మనదేశంలో అభివృద్ధి చెందింది. ప్రపంచం నలుమూలల నుంచీ వర్తకులు, వాణిజ్యవేత్తలు భారతదేశానికి తరలి వచ్చేవారు. బంగారం, వెండి ధారపోసి వస్త్రాలనూ, పెట్లుప్పు అనే సూరేకారాన్నీ, పొగాకునూ కొనుక్కుపోయేవారు. 'రాబిన్సన్ క్రూసో సృష్టికర్త, తొలితరం ఆర్థిక పాత్రికేయుడు డేనియెల్ డీఫో ఈ విషయం రాశాడు కూడా! కానీ, స్ఫుటమైన వర్గ స్వభావం కలిగిన పారిశ్రామిక కార్మికవర్గం మాత్రం, నాటికి మన దేశంలో తలెత్తలేదు. సాంస్కృతికంగా వెనకబడి వుండిన ఆనాటి భారతదేశం, పేదరికం-అవిద్య-అసమానతల్లో మగ్గుతోంది. వలస వచ్చిన సామ్రాజ్యవాదులకు తోడుగా, నవాబులూ, జాగీర్దార్లూ, జమీందార్లూ ప్రజలను వేధిస్తూండేవారు. ఇరవయ్యో శతాబ్దికి అటూ ఇటూగా మన దేశంలో వ్యవసాయాధారిత పరిశ్రమలు మొదలయ్యాయి. భారీ ఎత్తున సాగి, ముగిసిన నీలిమందు సేద్యం ఈ తరహా పరిశ్రమల్లో మొదటిదని చెప్పొచ్చు. టీ-కాఫీ రబ్బర్ తోటలు, బొగ్గు గనులు, ముడి ఇనుప ఖనిజం తవ్వకాలు క్రమంగా విస్తరిస్తూ వచ్చాయి. ఇరవయ్యో శతాబ్దిలో మద్రాసు, కలకత్తా, బొంబాయి, ఢిల్లీ నగరాల్లో ట్రాములు నిర్మితమయ్యాయి. గాంధీజీ నేతృత్వంలో సహాయ నిరాకరణోద్యమం ఉవ్వెత్తున ఎగసిపడింది 1920వ సంవత్సరంలోనే. అప్పుడే, లాలాలజపత్‌రాయ్, జోసెఫ్ బాప్టిస్టా, ఎన్.ఎమ్.జోషీ ఏఐటీయూసీని స్థాపించడం కాకతాళీయం కాదు. తిలక్ అరెస్టు, అక్టోబర్ మహావిప్లవ విజయం, నూలు మిల్లు కార్మికుల సమ్మె, చౌరీచౌరా పరిణామాలు -ఈ సంఘటనల పరంపర, వాటి పర్యవసానాలు ఏఐటీయూసీ ఆవిర్భావానికి చారిత్రక నేపథ్యమై అమరింది. అదే, మన గడ్డమీద మన పార్టీ ఆవిర్భవించడానికి సైతం చారిత్రక నేపథ్యంగా అమరింది. అలా, 1925, డిసెంబర్ 26న కాన్పూర్ జాతీయ మహాసభలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. కాకలు తీరిన కార్మికవర్గ యోధుడు, కామ్రేడ్ ఎస్.వి. ఘాటే మన పార్టీకి ప్రప్రథమ ప్రధాన కార్యదర్శి. అంతకుముందు మూడు నాలుగేళ్లుగా, దేశంలోని కమ్యూనిస్టులపై "కుట్ర"కేసులు నడుస్తూవున్నాయి. అప్పటికి, మొగ్గగా వుండిన కమ్యూనిస్టు ఉద్యమాన్ని మొగ్గగానే చిదిమేయాలన్నదే సామ్రాజ్యవాదుల "కుట్ర". 1921-24 మధ్యలో పెషావర్ కుట్రకేసు, మీరట్ కుట్రకేసు, కాన్పూర్ బోల్షివిక్ కుట్రకేసులు మోపింది రాజ్యం. ఈ "కుట్ర" కేసుల ద్వారా సామ్రాజ్యవాదం తానొకటి తలిస్తే, స్వాతంత్ర్య కాంక్షతో రగులుతున్న కాలం మరొకటి తలచింది! అప్పటివరకూ, దేశం నలుమూలలా పనిచేస్తూ వుండిన కమ్యూనిస్టులు ఒకే వేదికమీద సమీకృతులయ్యారు. ఇరవయ్యో శతాబ్ది ప్రథమార్థంలో వలసవాదం, సామ్రాజ్యవాదం బలహీనపడ్డాయి. ఆసియా-ఆఫ్రికా దేశాలనేకం జాతీయ విముక్తి పోరాటాలు చేపట్టాయి. మన పార్టీ కూడా మన దేశంలో జరిగిన జాతీయ విముక్తి సమరంలో సమరశీల పాత్ర పోషించింది. మతప్రాతిపదికపై సామ్రాజ్యవాదం మన దేశాన్ని రెండు ముక్కలు చెయ్యాలనే ప్రయత్నాన్ని తీవ్రంగా ప్రతిఘటించింది. ప్రజాస్వామ్య విలువలకు అద్దంపట్టే రాజ్యాంగ చట్టం రూపుదిద్దుకునే కృషిలో చురుకైన పాత్ర వహించింది. ఇప్పటికీ మన రాజ్యాంగంపై మతవాదులూ-మనువాదులూ ఉమ్మడిగా జరుపుతున్న దాడిని తిప్పికొడుతోంది. కానీ, చరిత్రలో ఎన్నో అనివార్య ఘటనలు జరిగిపోతుంటాయి- వాటిలో ఒకటి మన దేశవిభజన. ఇప్పటికీ, ఈ ద్విజాతి సిద్ధాంతాన్ని వలసవాదుల వారసులు ఏదో రూపంలో ముందుకు తీసుకొస్తూనే వున్నారు. దాన్ని మన పార్టీ శక్తివంచన లేకుండా తిప్పికొడుతూనే వుంది. ఈ నూరేళ్ల కాలంలో, ఎందరో అమరవీరులు "దారిపొడుగునా గుండెనెత్తురులు తరణ చేస్తూ" వచ్చారు. మరెందరో "కార్మికవీరుల కాయంనిండా కాలువకట్టే ఘర్మజలా"లు, ఉద్యమక్షేత్రంలోకి ప్రవహిస్తూనే వున్నాయి. "చిన్ని నా బొజ్జకూ శ్రీరామరక్ష" అనుకోకుండా ఎందరో విప్లవకారులు తమ సర్వస్వాన్నీ పార్టీ కోసం త్యాగం చేస్తున్నారు. వారంతా అలా చేసినందువల్లనే మన పార్టీ ఈ నాటికీ కార్మికవర్గ ప్రయోజనాలకోసం పోరాడుతూ, నిలబడివుంది. అవును మరి- చిన్నపాటి లక్ష్యాలను సాధించాలనుకునే వాళ్లు కొద్దిపాటి త్యాగాలు చేస్తే సరిపోతుంది. మరింత ఎక్కువ సాధించాలనుకునేవాళ్లు మరింత ఎక్కువ త్యాగం చేయవలసి వుంటుంది. ఇక, అత్యున్నత లక్ష్యాలను సాధించడానికి కంకణబద్ధులైన వాళ్లు మహోన్నతమైన త్యాగాలను చెయ్యకతప్పదు. ఏడువేల సంవత్సరాలుగా అమల్లో వున్న సామాజికార్థిక వర్గసమాజ విధానాన్ని మార్చడం మన పార్టీ లక్ష్యం. దాని స్థానంలో వర్గరహిత సమాజ జీవనాన్ని స్థాపించడమనేది అక్షరాలా మహోన్నతమైన లక్ష్యమే! అలాంటి లక్ష్యాన్ని సాధించడానికి, అందుకు తగిన ప్రమాణంలో మన కృషీ, త్యాగశీలతా వుండి తీరవలసిందే!!

"ఇక్కడ ఎవరికీ, ఏదీ సొంతం కాదు- కానీ, ప్రతి ఒక్కరూ ధనవంతులే! అవును - ఆనందం కన్నా చిత్తశాంతి కన్నా, మానసిక ఆందోళనల నుంచి విముక్తి పొందడం కన్నా మహనీయమైన సంపదలేముంటాయి మరి?" అన్నాడు "ఉటోపియా" స్వాప్నికుడు థామస్ మోర్. ఆ స్వప్నాన్ని శాస్త్రీయంగా సాకారం చెయ్యడమే మన పార్టీ లక్ష్యం; అంటే, మన అందరి లక్ష్యం!

చెదిరిన బతుకులు... కొత్త పయనం

- 20 ఏళ్ల నాటి సునామీ విషాద జ్ఞాపకాలు
- పీడకలను వీడి జీవన ధైర్యంతో ముందుకు

న్యూదిల్లీ: మనిషి జీవితం ఎప్పుడూ ఆశావహకంగానే ఉండాలి. కష్టమొచ్చినా... విపత్తు విరుచుకుపడినా... మరొక విషాద ఘటన చోటుచేసుకున్నా... ఆ బాధ... భయాన్ని అధిగమించి జీవన ప్రయాణం సాగించడమే బతుకుకు అర్థం... జీవన చిత్రం.

2004 సునామీ... మునుపెన్నడూ చూడని ఘోర విపత్తు. ప్రజల బతుకులను చెదరగొట్టిన ప్రకృతి వైపరీత్యం. సముద్రపు అలలు ఆకాశాన్ని తాకేలా ఉవ్వెత్తున ఎగిసిపడి వేలాది మందిని పొట్టనబెట్టుకున్న భయంకర విషాద ఘటన. ఆ చెరగని మచ్చలు 2004 నాటి జ్ఞాపకాలను తెచ్చిపెట్టినప్పటికీ, సునామీ నుండి బయటపడినవారు తమ జీవన ధృడత్వాన్ని ప్రదర్శిస్తూ బతుకు నావలో ముందుకు సాగుతున్నారు. 2004 డిసెంబరు 26వ తేదీ ఉదయం సునామీ సంభవించి 20 ఏళ్లు గడిచినా వారి కుటుంబ సభ్యులను, బంధువులను పోగొట్టుకున్న విషాదభరితమైన మచ్చలు ఇప్పటికీ వారిని వెంటాడుతూనే ఉన్నాయి. 6,065 మంది ప్రాణాలను బలిగొన్న భారీ అలల తీవ్రతను భరించిన నాగపట్నం జిల్లాలో ప్రాణాలతో బయట పడిన వారిలో ఒకరైన సౌమ్య ఇప్పుడు ఒక ఆడపిల్లకు తల్లి అయ్యింది. సునామీ వల్ల అనాథలైన అనేక మంది ఇతర పిల్లల్లాగే, ఆమె కఠినమైన వాస్తవాన్ని అంగీకరించింది. సంక్షోభాన్ని అధిగమించి జీవించేందుకు ధైర్యాన్ని ప్రదర్శించింది. సునామీ తీరాన్ని తాకినప్పుడు ఆమె నాలుగు సంవత్సరాల వయస్సులో ఆస్తి, జీవితాలను భారీగా నాశనం చేసింది. సౌమ్య తర్వాత ఐఏఎస్ అధికారి డాక్టర్ జె.రాధాకృష్ణన్‌కి గాడ్ డాటర్‌గా మారింది. ఎకనామిక్స్‌లో బీఏ పూర్తి చేసింది. రాధాకృష్ణన్ 2022లో టెక్నీషియన్ అయిన కె.సుభాశ్‌తో తన వివాహం నిశ్చయించారు. ఈ ఏడాది అక్టోబరులో ఆమె ఒక ఆడపిల్లకు తల్లి అయింది. 'మా ఆడపడుచు ఎదుగుతూ తల్లిగా మారడం చూస్తుంటే మనసుకు హత్తుకునేలా ఉంది. మా కుటుంబం ఆశీర్వాదంగా భావించబడింది' అని ప్రస్తుతం సహకార శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి రాధాకృష్ణన్ అన్నారు. ఆయన భార్య కృతిక, కుమారుడు డాక్టర్ ఆర్.అరవింద్, నాగపట్నం జిల్లా కలెక్టర్ పి.ఆకాశ్‌తో కలిసి సౌమ్యను జిల్లాలోని ఆమెను పెంచిన గృహంలో ఆశీర్వదించి బహుమతులు అందజేశారు. అన్నై సత్య ప్రభుత్వ చిల్డ్రన్స్ హోమ్‌లో 40 మంది పిల్లలలో పసిబిడ్డగా రక్షించబడిన మీనా, సౌమ్య ఉన్నారు. సునామీ 20వ వార్షిక ఏడాదికి ముందు డిసెంబరు 22న వారందరూ కలుసుకున్నారు. వారిలో ప్రస్తుతం 35 ఏళ్ల తమిళరసి విజయబాలన్... ఐటీలో బీఎస్సీ డిగ్రీతో పాటు ఎంసీఏ కూడా పూర్తి చేశాడు. ఇప్పుడు సునామీ తర్వాత 100 మంది పిల్లలను చూసుకోవడానికి స్థాపించబడిన అన్నై సత్య ప్రభుత్వ చిల్డ్రన్స్ హోమ్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. నాగపట్నం సమీపంలోని సామంతన్‌పేటైలో ఉన్న ఇల్లు ఇప్పుడు వేధింపులు, బాల్య వివాహాల బాధితులను చూసుకుంటుంది. నాగపట్నం జిల్లాలో సహాయ, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు రాధాకృష్ణన్‌ను కలెక్టర్‌గా నియమించారు. రాధాకృష్ణన్, ఆయన కుటుంబంతో పాటు కలెక్టర్ ఆకాశ్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వి.ఎళిలరసి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుడు ఎం.మలర్విజి కూడా సునామీ నుంచి ప్రాణాలతో బయటపడి తిరిగి జీవనం సాగించేలా ధైర్యాన్ని ప్రదర్శించిన వారిని ప్రశంసించారు.

అలలెత్తిన విషాదం... విలువ కట్టలేని నష్టం

అలల ఉగ్రరూపం దాల్చడం వల్ల రాష్ట్రంలోని కాంచీపురం, విల్లురం, కడలూరు, నాగపట్నం, కన్యాకుమారి, తూత్తుకుడ్‌లోని ఆరు కోస్తా జిల్లాల్లోని దాదాపు 50 పట్టణ పంచాయతీలు దెబ్బతిన్నాయి. విపత్తు తీవ్రతను బట్టి, ప్రభావిత పట్టణ పంచాయతీలను అధ్వానంగా, పాక్షికంగా దెబ్బతిన్నాయని వర్గీకరించారు. ప్రాణ, ఆస్తి నష్టం ఎక్కువగా ఉన్నందున 50 పట్టణ పంచాయతీలలో 19 అధ్వానంగా దెబ్బతిన్నాయని ఒక అధికారి తెలిపారు. కాగా, క్రిస్మస్ తర్వాత ప్రశాంతమైన ఆదివారం కడలూరు నుంచి కన్యాకుమారి వరకు కోస్తా జిల్లాల్లోని అనేక వందల కుటుంబాలకు భయంకరమైన పీడకలగా మారింది. భారీ అలలు నివాసాలను, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయి. అనేక మంది ప్రాణాలను బలిగొన్నాయి. 'రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు ఇళ్లను పునర్నిర్మించడానికి, మా జీవనోపాధిని పునరుద్ధరించడానికి సహాయపడ్డాయి' అని నాగపట్నంలోని ఇండియన్ నేషనల్ ఫిషర్‌మెన్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.ఎం.పి.రాజేంద్ర నట్టార్ చెప్పారు. సునామీ విషాదం సంభవించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని నంబియార్‌నగర్‌లో మినీ ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు మత్స్యకారుల వాటా రూ.11.34 కోట్లను మాఫీ చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 'మత్స్యకారులు సునామీ పునరావాసం కింద ప్రభుత్వం వారి కోసం నిర్మించిన తమ ఇళ్లను తనఖా పెట్టి, వారి సహకారం అందించారు. వారు ఇప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వారికి అందజేసిన రుణాన్ని మాఫీ చేయడం మత్స్యకారులకు ఉపశమనం కలిగిస్తుంది' అని ఆయన పీటీఐకి చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే మత్స్యశాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చామని, రుణ మాఫీపై ప్రభుత్వం మాత్రమే విధానపరమైన నిర్ణయం తీసుకోగలదని చెప్పినట్లు నట్టార్ అన్నారు. గత ఏడాది ప్రారంభించిన మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.22.87 కోట్లు అందించింది.

బీజేపీ ఎమ్మెల్యేపై కోడిగుడ్లతో దాడి

బెంగళూరు: బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై గుర్తు తెలియని వ్యక్తులు కోడిగుడ్లతో దాడి చేశారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని నగరంలోని నందిని లేఅవుట్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై కోడిగుడ్లు విసిరారు. కాగా ఈ ఘటనకు సంబంధించి ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేష్, వారి సన్నిహితులే ఈ దాడికి పాల్పడ్డారని ఎమ్మెల్యే మునిరత్న ఆరోపించారు. 'ఇది నన్ను చంపే ప్రయత్నమే. నన్ను అంతం చేసేందుకు దాదాపు 150 మందిని తీసు కొచ్చారు. నా మద్దతుదారులు, పోలీసులు లేకుంటే నన్ను చంపేసేవారు. ఇందులో డీకే శివకుమార్, డీకే సురేష్, హనుమంత రాయప్ప మరికొందరికి ప్రమేయం ఉంది" అని మునిరత్న పేర్కొన్నారు. కాగా బెలగావిలో ఉన్న డీకే శివకుమార్ మునిరత్న ఆరోపణల్ని ఖండించారు. 1924 భారత జాతీయ కాంగ్రెస్ సెషన్ శతాబ్ది ఉత్సవాల ఏర్పాట్లలో తాను తీరికలేకుండా ఉన్నానని తెలిపారు. మునిరత్న తన ప్రాంతంలోని కాంగ్రెస్ కార్యకర్తలను బెదిరిస్తున్నాడని డీకే సురేష్ ఆరోపించారు. ఆయన అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారన్నారు. కాగా అరెస్టులను కర్నాటక హెూంమంత్రి పరమేశ్వర ధృవీకరించారు. "ముగ్గురిని అరెస్టు చేశాం. వారు ఎవరో, ఎందుకు చేశారో గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది" అని ఆయన విలేకరులతో అన్నారు. దాడిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఖండించారు. ఇలాంటి దాడి మునిరత్నకే కాదు, రాష్ట్రమంతటికీ అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మాజీ మంత్రి సీటీ రవి కూడా ఈ ఘటనను ఖండించారు. అత్యాచారం కేసు సహా వివిధ పోలీసు కేసులు ఎదుర్కొంటున్న మునిరత్న ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు.

వాజ్‌పేయ్‌కు ప్రముఖుల నివాళి

న్యూదిల్లీ: దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ శతజయంతిని పురస్కరించుకుని దిల్లీలోని 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, ఏపీ సీఎం చంద్రబాబు, పలువురు ఎంపీలు బుధవారం ఆయనకు ఘన నివాళు లర్పించారు. భారత జాతి గర్వించదగిన నేత వాజ్‌పేయ్ అని చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆయన దూరదృష్టి వల్లే నేడు మన దేశం ప్రపంచదేశాలతో పోటీ పడుతోందని పేర్కొన్నారు.

ప్రత్యేక నాణెం విడుదల

వాజ్‌పేయ్ 100వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు. ఆయన జయంతిని పురస్కరించుకుని రూ.100 స్మారక నాణేన్ని, స్టాంప్‌ను మోదీ రిలీజ్ చేశారు.

వాజ్‌పేయి 'రెండవ నెహ్రూ': సంజయ్ రౌత్

ముంబై: దివంగత బీజేపీ అగ్రనేత, మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయిని భారత రాజకీయాలలో 'రెండవ నెహ్రూ' అని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ బుధవారం అభివర్ణించారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడిన రౌత్... 'రాజ ధర్మం' ఎప్పుడు ముప్పులో పడినా దేశం వాజ్‌పేయిని స్మరించుకుంటుందని అన్నారు. బుధవారం వాజ్‌పేయి జయంతిని జరుపుకుంటున్నారు. సంజయ్ రౌత్ మాట్లాడుతూ తమ పార్టీ బీజేపీతో లేనప్పటికీ, వాజ్‌పేయిని ఎప్పటికీ గుర్తుంచుకుంటామని అన్నారు. 'ప్రస్తుత బీజేపీ (భారత తొలి ప్రధానమంత్రి పండిట్ (జవహర్‌లాల్) నెహ్రూ వారసత్వాన్ని దుష్ప్రచారం చేస్తుండవచ్చు. కానీ వాజ్‌పేయి రెండవ నెహ్రూ. ఆయన కాంగ్రెసేతర పార్టీలకు నెహ్రూ' అని రాజ్యసభ సభ్యుడు పేర్కొన్నారు. గట్టి హిందుత్వవాది అయినప్పటికీ, వాజ్‌పేయి దేశం అందరికీ చెందినదని నమ్మారు. వాజ్‌పేయి నేతృత్వంలోని బీజేపీ అందరినీ కలుపుకొని ఉంది. భారతదేశాన్ని ఐక్యంగా, బలంగా ఉంచాలని పార్టీ కోరుకుంటుందని ప్రజలు విశ్వసించారు' అని ఆయన అన్నారు.

చేతకాకపోతే చెప్పండి సహకరిస్తాం: అఖిలేశ్

లక్నో: బీజేపీ నేతలు ఎన్నికల ప్రణాళికల్లో బిజీగా ఉండి మహా కుంభమేళా ఏర్పాట్లలో పాల్గొనలేకపోతున్నారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. కుంభమేళాకు సమయం సమీపిస్తున్నా భక్తుల భద్రతకు సరైన సౌకర్యాలు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని అన్నారు. బీజేపీకి కుంభమేళా నిర్వహించడం రాకపోతే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సహాయం చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. మహా కుంభమేళాకు చేయాల్సిన ఏర్పాట్లలో అధికారుల సమన్వయలోపం వల్ల భద్రతాపరమైన ఏర్పాట్లు ఆలస్యమవుతున్నాయని ఆరోపించారు. స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు, ఇతర అవసరాల కల్పనను యోగి ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్నారు. ఏర్పాట్లలో ఆలస్యం జరగకుండా ఉండేందుకు తమ నేతలు ప్రభుత్వానికి సహకరిస్తారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని తాము కోరుకుంటున్నామన్నారు. 'మహాదాని' పరిపాలకుడు హర్షవర్ధనుడి విగ్రహం తొలగించడంలో ఆతృత ప్రదర్శించిన బీజేపీ ప్రభుత్వం... ఇప్పుడు మాత్రం అదే వేగాన్ని ఎందుకు కనబరచడం లేదని విమర్శించారు. ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఈ మహా కుంభమేళా కొనసాగనుంది. ప్రతి 12 సంవత్సరాలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది యాత్రికులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. దాదాపు 45 కోట్ల మంది యాత్రికులు, సాధువులు, సన్యాసులు, పర్యటకులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

బహు భాషా నిఘంటువు ఆవిష్కరణ

కన్నడ-ఆంగ్ల భాషల్లో విద్యార్థులకు ప్రావీణ్యత

బెంగళూరు: కర్నాటకలోని బెంగళూరు డీఎస్ఈఆర్‌టీ సమావేశ మందిరంలో బుధవారం కర్నాటక ప్రభుత్వం, బాల్ రక్షా భారత్ సంయుక్తంగా రూపొందించిన బహు భాషా నిఘంటువు (బై-లింగువల్ డిక్షనరీ)ను ఆవిష్కరించారు. సమగ్ర శిక్షణ, పాఠశాల విద్యాశాఖ కర్నాటక అధ్వర్యంలో రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ... బాల్ రక్షా భారత్ -సేవ్ ది చిల్డ్రన్ సాంకేతిక భాగస్వామ్యంతో విద్యార్థులకు కన్నడ, ఆంగ్ల భాషలో ప్రావీణ్యతను పెంపొందించడానికి బైలింగువల్ బహు భాషా నిఘంటువును తీర్చిదిద్దారు. ఒకటి నుంచి ఐదు... ఆరు నుంచి ఎనిమిది తరగతులకు వేర్వేరుగా కన్నడ, ఆంగ్ల భాషా కఠిన పదాలను, వ్యాకరణం, పదాల ఉచ్ఛరణలను పరిగణనలోనికి తీసుకున్నారు. 1-8 తరగతి పాఠ్యపుస్తకాలు... అనగా కరికులం ఆధారిత కఠిన పాదాలను గుర్తించి వాటిని వివరణాత్మకంగా విద్యార్థులు సులువుగా నేర్చుకొనేలా, వాక్యాలను రూపొందించేలా... చదివేలా తద్వారా కన్నడ -ఆంగ్ల బహు భాషల్లో ప్రావీణ్యత సాధించేలా ఈ డిక్షనరీలను ప్రత్యేకంగా రూపొందించారు. అన్ని సబ్జెక్టులను కన్నడ, ఆంగ్లం, ఈవీఎస్, సాంఘిక , సామాన్య శాస్త్రాలు , గణితం, హిందీ పాఠ్యంశాలలో కఠిన పదాలను గుర్తించి వాటి అర్థాలు, వివరాలు, వ్యాకరణం వంటి సూక్ష్మ విషయాలను ప్రాథమిక స్థాయి నుంచి తర్ఫీదు పొందేలా పెంపొందించారు. ఈ డిక్షనరీల రూపకల్పనలో బాల్ రక్షా భారత్ సాంకేతికతను అందించగా, డీఎస్ఈఆర్‌టీ కర్నాటక సంస్థ సబ్జెక్టు నిపుణులు, ఉపాధ్యాయులు సుమారు 50 మంది పాలుపంచుకుని సుమారు రెండు సంవత్సరాలు శ్రమించారు. ఈ క్రతువుకు ఆంధ్ర ప్రదేశ్ విద్యా శాఖ స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు. ప్రాథమిక తరగతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ బై-లింగువల డిక్షనరీని రూపొందించి ఈ రీతి తెలుగు -ఇంగ్లీష్ బహు భాషల పాఠ్యపుస్తకాలతో బాటు డిక్షనరీని కూడా అందుబాటులో ఉంచారు. ఈ ప్రయత్నాన్ని కర్నాటక విద్యా శాఖాధికారులు సందర్శించి అదే స్ఫూర్తితో 1-8 తరగతి వరకు రూపొందించారు. ఈ డిక్షనరీని ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అన్ని పాఠశాలలో విద్యార్థులందరికీ అందుబాటులో ఉంచేలా ప్రయత్నిస్తామని డీఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ గోపాల కృష్ణ వెల్లడించారు. ప్రత్యేక అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష పథక సంచాలకులు బి. శ్రీనివాసరావు వర్చువల్‌గా హాజరయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ బై-లింగువల్ డిక్షనరీ... బైలింగువల్ పాఠ్య పుస్తక అమలు- అనుభవాలను పంచుకొన్నారు. డీఎస్ఈఆర్‌టీ నుంచి రాధ, బాల్ రక్షా భారత్ సంస్థ నుంచి విజయమ్మ సారథ్యం వహించారు. అవినాష్ సింగ్, చంద్రశేఖర, మల్లాడి శ్రీనగేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫలాలు ప్రజలకందడమే ప్రామాణికం

- ప్రధాని నరేంద్రమోదీ
- మధ్యప్రదేశ్‌లో నదుల అనుసంధానానికి శ్రీకారం

ఖజురహో: దేశాభివృద్ధిలో మాజీ ప్రధానమంత్రి అత్‌బిహారీ వాజ్‌పేయి కీలక పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వాల కాలంలో జరిగిన అభివృద్ధిని ఇతర పార్టీల పాలనతో పోల్చి చూడాలని మేథావులకు విజ్ఞప్తి చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్-బెత్వా నది అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధాని బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లు బెత్వా, కెన్ నదుల జలాలతో కూడిన రెండు కలశాలను ప్రధాని మోదీకి అందజేయగా... వాటిని ఆయన ప్రాజెక్టు నమూనాలో పోశారు. అనంతరం రిమోట్ బటన్ సాయంతో నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ... "బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రంలో ఏడాది పూర్తయింది. ఈ కాలంలో ఇక్కడ అభివృద్ధికి కొత్త దిశ లభించింది. ఇక్కడ రూ.వేల కోట్ల విలువైన కార్యక్రమాలు మొదలయ్యాయి. నేడు కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది. దేశాభివృద్ధిలో అటల్ బిహారీ వాజ్‌పేయి కీలక పాత్ర పోషించారు. సుశాసన్ దినోత్సవం మా ప్రభుత్వానికి ఒక్కరోజు కార్యక్రమం కాదు.. మా గుర్తింపు అది. దేశ ప్రజలు మూడోసారి కేంద్రంలో ఎన్డీయే సర్కారును ఎన్నుకున్నారు. ఇక మధ్యప్రదేశలో వరుసగా మా పార్టీని ఎన్నుకోవడంలో సుపరిపాలన పాత్ర చాలా కీలకం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని మేథావులు కొన్ని ప్రమాణాలను తీసుకొని...కాంగ్రెస్, లెఫ్ట్, కుటుంబ, సంకీర్ణ పార్టీల పాలనలో ఏం పనులు జరిగాయి..? బీజేపీ ఉన్న చోట్ల అభివృద్ధి ఎలా జరిగిందో విశ్లేషించాలి. మా పార్టీ ప్రజల కోసం కట్టుబడి ఉంది. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎంత వరకు చేరాయి అన్నదే ప్రామాణికం. కాంగ్రెస్ సర్కారు కేవలం అభివృద్ధి ప్రకటనల హడావుడికే పరిమితమయ్యేది. ఆ పథకాల ఫలాలు ప్రజలకు చేరేవి కావు. ఏళ్ల క్రితం శంకుస్థాపనలు అయిన వాటి పని కూడా ఒక్క అంగుళం ముందుకు జరగకపోవడాన్ని మేము గమనించాము. మా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పించాము. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జల్‌శక్తిపై ఎవరు పనిచేశారో తెలుసా.. వాస్తవాలను ఇన్నాళ్లూ దాచిపెట్టారు. భారత జల్‌శక్తి, డ్యామ్‌ల వెనుక ఘనత బాబా సాహెబ్ అంబేద్కర్‌కు చెందుతుంది" అని మోదీ చెప్పుకొచ్చారు. అంతకు ముందు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పేరిట తపాల బిళ్ల, రూ.100 నాణెంను ప్రధాని మోదీ విడుదల చేశారు. నదుల అనుసంధానంలో మొదటిదైన కెన్-బెత్వా పథకం వల్ల మధ్యప్రదేశ్‌లోని పది జిల్లాల్లో దాదాపు 44 లక్షల మందికి, ఉత్తరప్రదేశ్‌లోని 21 లక్షల మందికి కింద తాగునీరు అందుతుంది. దీని అంచనా వ్యయం రూ.44,605 కోట్లని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,000 గ్రామాల్లోని దాదాపు 7.18 లక్షల వ్యవసాయ కుటుంబాలు లబ్ధి పొందుతాయని, 103 మెగావాట్ల జలవిద్యుత్, 27 మెగావాట్ల సౌరశక్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు వివరించారు. ప్రత్యేకించి వెనకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. 2009లోనే అప్పటి కేంద్రప్రభుత్వం దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. మొత్తం ఒకేసారి కాకుండా దశలుగా విభజించి పనులు చేపట్టాలని నిర్ణయించింది.

కుంభమేళాకు 'వీఐపీ' ఏర్పాట్లు

మహాకుంభ్ నగర్ (యూపీ): ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహాకుంభమేళాకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 మహాశివరాత్రి వరకు 45 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. కుంభమేళాకు భారత్ నుంచే కాక ప్రపంచదేశాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రీకులు రానున్నారు. ఈ క్రమంలో కుంభమేళాకు హాజరయ్యే ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక అధికారులు మరియు సిబ్బందితో 24×7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రముఖుల ప్రోటోకాల్ నిర్వహణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు అదనపు కలెక్టర్లు, అనేకమంది సబ్ కలెక్టర్లు, తహసీల్దార్‌లు, నలుగురు రెవెన్యూ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు 25 సెక్టార్లలో ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. కుంభమేళాకు హాజరయ్యే ప్రముఖులందరికీ మంచి అనుభూతి అందించడమే లక్ష్యంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నితీశ్... నవీన్‌కు భారతరత్న ఇవ్వాలి

గిరిరాజ్ సింగ్

బెగుసరాయ్/పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వాలని కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ బుధవారం అన్నారు. బాహాటంగా మాట్లాడే ఈ బీజేపీ నాయకుడు తన లోక్‌సభ నియోజకవర్గం బెగుసరాయ్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లిన నితీశ్ కుమార్ అధికారంలోకి వచ్చేంత వరకు బీహార్ శిథిలావస్థకు చేరిన రోడ్లు, పాఠశాలలు, భవనాలకు పేరుగాంచింది. అలాగే నవీన్ పట్నాయక్ ఒడిశాకు ఎన్నో ఏళ్లు సేవలందించారు. ఇలాంటి నాయకులు భారతరత్న వంటి అత్యున్నత గౌరవానికి అర్హులు' అని అన్నారు. రాబోయే ఎన్నికలలో జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ నాయకత్వంలో పోటీ చేసేందుకు ఎన్డీఏ చూస్తోందని అన్నారు. ఇదిలాఉండగా, మంగళవారం లాలూ ప్రసాద్ కుమారుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి కార్యాలయాన్ని బీజేపీ స్వాధీనం చేసుకుంది. నితీశ్ నలుగురు సన్నిహితులు... వీరిలో ఇద్దరు దిల్లీలో ఉన్నారు. బీజేపీ నాయకత్వంతో టచ్‌లో ఉన్నారు. అమిత్ షా పనిలో పడ్డారు' అని స్పష్టం చేశారు. బీహార్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు నితీశ్ కుమార్ ఎన్డీఏకు ముఖంగా ఉంటారని ఒక ప్రైవేట్ న్యూస్ ఛానెల్ నిర్వహించిన కార్యక్రమంలో ధ్రువీకరించడానికి అమిత్ సా విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో యువ నాయకుడు ఈ వ్యాఖ్య చేశారు. మహారాష్ట్రలో అనుసరించిన మాదిరిగానే ఏడాదిలోపు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో బీజేపీ వ్యూహం రచించవచ్చని మీడియాలో ఒక వర్గం ఊహాగానాలకు దారితీసింది. గత నెలలో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను ఎన్డీయే పక్షాన నిలబెట్టలేదు. ఎన్డీఏ ఘన విజయం సాధించిన తర్వాత అతి పెద్ద భాగస్వామ్య పక్షంగా ఆవిర్భవించిన బీజేపీ నుంచి ఫడ్నవీస్ కొత్త ముఖ్యమంత్రి అయ్యారు.

పురాతన బావిని సందర్శించిన ఏఎస్ఐ బృందం



సంభల్ (ఉత్తర ప్రదేశ్): ఐదో రోజుకు చేరిన తవ్వకాల్లో పురోగతిని అంచనా వేయడానికి భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) బృందం బుధవారం ఇక్కడ చందౌసిలోని పురాతన మెట్ల బావి స్థలాన్ని సందర్శించింది. ఏఎస్ఐ అధికారులు నిర్మాణం, తవ్వకం పనిని కొనసాగించడానికి ఉత్తమమైన విధానాన్ని అధ్యయనం చేస్తున్నారు. చందౌసీ మునిసిపాలిటీ కార్యనిర్వహణాధికారి కృష్ణ కుమార్ సోంకర్ కసరత్తు సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. 'ఈరోజు తవ్వకం ఐదవ రోజు. మా ఏఎస్ఐ సహచరులు ఇక్కడ స్థలాన్ని అధ్యయనం చేస్తున్నారు. తదుపరి దశలను అంచనా వేస్తున్నారు. నిర్మాణం సంక్లిష్టత కారణంగా జేసీబీ యంత్రాలు ఉపయోగించదు. అందువల్ల కార్మికులను ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు బావి నిర్మాణం అనేది స్పష్టంగా బయటపడుతోంది. అయితే ఈ ప్రక్రియకు ఎంత సమయం పడుతుందో ఊహించడం కష్టం' అని సోంకర్ విలేకరులతో అన్నారు. 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సుమారు 125 నుంచి 150 సంవత్సరాల వయస్సు గల మెట్ల బావి గత వారం ఇక్కడ చందౌసిలోని లక్ష్మణ్ గంజ్ ప్రాంతంలో తవ్వకాలలో బయటపడింది. సంభల్‌లోని భస్మ శంకర్ ఆలయాన్ని 46 సంవత్సరాలుగా మూసి ఉంచిన తర్వాత డిసెంబరు 13న తిరిగి తెరిచిన తర్వాత ఈ తవ్వకం జరిగింది. స్థానిక ఆధారాల ప్రకారం, బిలారి రాజు తాతల కాలంలో ఈ మెట్ల బావిని నిర్మించారు.

ఆతిశీని తప్పుడు కేసులో అరెస్టు చేస్తారు

బీజేపీ తీరుపై అరవింద్ కేజ్రీవాల్



న్యూదిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీని బీజేపీ ఆదేశానుసారం కేంద్ర దర్యాప్తు సంస్థలు 'తప్పుడు' కేసులో అరెస్టు చేసే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం అన్నారు. అతిశికి అండగా నిలిచిన కేజ్రీవాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'సీఎం ఆతిశీని తప్పుడు కేసులో అరెస్టు చేయాలని బీజేపీ దర్యాప్తు సంస్థలను ఆదేశించిందని మాకు తెలుసు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నుంచి ఆప్ దృష్టి మరల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది' అని ఆరోపించారు. 'రవాణా శాఖలో ఆతిశీపై వారు తప్పుడు కేసును సిద్ధం చేస్తున్నారని మాకు తెలుసు. వారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల పథకాన్ని నిలిపివేయాలని కోరుకుంటున్నారు' అని కేజ్రీవాల్ అన్నారు. మద్యం పాలసీ కుంభకోణంకు సంబంధించిన కేసులో బెయిల్‌పై ఉన్న కేజ్రీవాల్... 'నేను జీవించి ఉన్నంత వరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల పథకాన్ని ఆపనివ్వను' అని స్పష్టం చేశారు. ఆప్‌కి చెందిన ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజనలతో బీజేపీ ఉలిక్కిపడిందన్నారు. దిల్లీలో బీజేపీ ఏ పనీ చేయలేదని, కేజ్రీవాల్‌ను దుర్భాషలాడటం ద్వారా కాషాయ పార్టీ ఓట్లు డిమాండ్ చేసిందని ఆయన ఆరోపించారు. దిల్లీలో ఆప్ ప్రభుత్వ పథకాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్ని రోజుల క్రితం మహిళా సమ్మాన్ యోజన, సంజీవన యోజన పథకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకాలు ప్రకటిండచం కొందరికి నచ్చలేదని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సీఎం ఆతిశీని తప్పుడు కేసులో అరెస్టు చేయాలని ప్రణాళిక చేస్తున్నారని ఆరోపించారు. అంతకంటే ముందు అనేక మంది ఆప్ నేతల ఇళ్లలో సోదాలు జరగొచ్చని అన్నారు. దిల్లీ ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి, ఆరోగ్య శాఖలు మహిళలకు రూ.2,100 ఆర్థిక సాయం, వృద్ధులకు ఉచిత చికిత్స అందించడం వంటి అధికార పార్టీ ఆప్ వాగ్దాన పథకాల నుంచి తమను తాము దూరం చేసుకుంటూ బుధవారం బహిరంగ నోటీసులు జారీ చేయడంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాజా వివాదాన్ని రేకెత్తించింది. 'ఉనికిలో లేని' పథకాల కోసం నమోదు సాకుతో ఎవరికైనా వ్యక్తిగత వివరాలను అందించవద్దని రెండు విభాగాలు ప్రజలను హెచ్చరించాయి. ఏదైనా ప్రైవేట్ వ్యక్తి లేదా రాజకీయ పార్టీ అటువంటి భౌతిక రూపాలు లేదా సమాచారాన్ని ఎటువంటి అధికారం లేకుండా సేకరించడం 'మోసం' అని పేర్కొన్నాయి. కేజ్రీవాల్ నేతృత్వంలో ఆప్ నేతలు ఇటీవల చాలా ఆర్భాటంగా రెండు పథకాల కోసం వ్యక్తులను నమోదు చేసే కసరత్తును ప్రారంభించారు.

ఆ అధికారులపై కఠిన చర్యలు: సీఎం ఆతిశీ

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజనకు వ్యతిరేకంగా పబ్లిక్ నోటీసు జారీ చేసినందుకు రాజధాని నగరంలోని మహిళా, శిశు అభివృద్ధి (డబ్ల్యూసీడీ) శాఖపై కఠిన చర్యలు తీసుకుంటామని దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ విలేకరుల సమావేశంలో తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సెమీ క్రిస్మస్ వేడుకల్లో మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ శంకర్‌నగర్ కాలనీ బండి సత్తయ్య కమ్యూనిటీ హాల్ నందు మునపర్తి కామేశ్వరి, ఊర్మిళ, చిరంజీవి, మైఖేల్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ దేవుడి కృప ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ముందస్తుగా నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఎంతో పవిత్రంగా భావించే క్రిస్మస్ పండుగను ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ముందస్తు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, ప్రవీణ్ పాశం, పాస్టర్లు రమేష్, జాన్ పాల్, మునపర్తి కామేశ్వరి, ఊర్మిళ, చిరంజీవి, మైఖేల్ కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజల మధ్య అవగాహన పెంచడానికి పండుగలు దోహదం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: పండుగలు మనుషులను దగ్గర చేయడానికే గాని, గొడవలు పడటానికి కాదు అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ సలీం ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయంలో క్రిస్టమస్ వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ సలీం మాట్లాడుతూ పండుగలు ప్రజల మధ్య అవగాహన పెరగడానికి దోహదపడతాయని అన్నారు. డాక్టర్ సుధాకర్ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆఫ్ ది పార్టీ మహిళా వింగ్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యమునా గౌడ్, పార్టీ యువజన విభాగం అధ్యక్షులు విజయ మల్లంగి, అధికార ప్రతినిధి జావిద్ షరీఫ్. అబ్బాస్ అహసాస్, సోషల్ మీడియా, మొహమ్మద్ బాజీ బాబా, జై సింగ్ యాదవ్, అజీమ్ పాషా, కొడంగల్ శీను, విశాలి, భార్గవి, హర్షిత, అప్స సలీం, ధర్మేంద్ర తివారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, ఆనందం, కరుణలతో కూడిన పండుగే క్రిస్మస్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : శాంతి, ప్రేమ, ఆనందం, కరుణలతో కూడిన పండుగే క్రిస్మస్ అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద వెల్లడించారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 - సూరారం డివిజన్ స్కందానగర్‌లోని "మరనాత బైబిల్ మిషన్ దేవాలయం" నందు తిమోతి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ పండుగ వేడుకల కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రేమ, ఆనందం, కరుణలతో కూడిన పండుగే క్రిస్మస్ అని తెలియజేశారు. ఆ యేసు ప్రభు దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో- ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, నాయకులు దొడ్ల ఆంజనేయులు, దొడ్డ శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహా చక్రాలు

విశాలాంధ్ర - అమనగల్లు : ధ్యానం బతికున్నంత వరకు ప్రపంచ ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ మనతోనే ఉంటారని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్పల్లి గ్రామ సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్లో జరుగుతున్న మహిళ ధ్యాన మహా యాగాలు జోరుగా కొనసాగుతున్నాయి. మహేశ్వర పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం 11 రోజుల వేడుకలు భూతల స్వర్గాన్ని తలపిస్తున్నాయి. క్రిస్మస్ సెలవు రోజు కావడంతో, ప్రపంచ నలుమూలల నుంచి ధ్యానులు హాజరై పత్రీజీ శక్తి స్థల్ వద్ద నివాళ్లర్పించారు. ఉ.5 గంటల నుంచి 8 వరకు నిర్వహిస్తున్న ప్రాతఃకాల ధ్యానానికి వేల మంది ధ్యానులు హాజరయ్యారు. పత్రీజీ శక్తి స్థల్ ప్రాజెక్టుకు ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు, కవులు, ఆధ్యాత్మిక వేత్తలను పిరమిడ్ నిర్వాహకులు సత్కరించారు. ధ్యాన వేదికపై కళాకారుల నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఆధ్యాత్మిక గీతాలు, ధ్యాన గురువుల సందేశాలతో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో పిఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రీ, ట్రస్ట్ సభ్యులు మాధవి, శ్రీరామ్ గోపాల్, రాంబాబు, నిర్మలాదేవి, సాంబశివరావు, శివప్రసాద్, లక్ష్మి, దామోదర్ రెడ్డి, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

గోదావరి జలాలను విడుదల చేసిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్, ములుగు జిల్లా బ్యూరో : గోదావరి జలాల ద్వారా ములుగు నియజకవర్గాన్ని సశ్యశామలం చేస్తామని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు పంపు హౌస్ నుండి గోదావరి జలాలు జంగాల పల్లి బంజరు చెరువుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన ములుగు నియోజకవర్గానికి చుక్క నీరు ఇవ్వకుండా సిద్దిపేట సిరిసిల్లకు నీళ్లను తరలించుకుపోయారని మంత్రి విమర్శించారు. రాబోయే రోజుల్లో ములుగు పంపు హౌస్ నుండి కొత్త గూడ గంగారాం మండలాలకు గోదావరి జలాలు అందించి ఆ రైతాంగాన్ని ఆదుకుంటామని రెండు పాటలకు నీళ్లను అందిస్తామని త్వరలోనే పంపు హౌస్ నుండి కాశిం దేవిపేట మీదిగా కేనాయిల్ ద్వారా లక్నవరంకు నీళ్లను పంపింగ్ చేసుకోవడం జరుగుతుందన్నారు. రైతులను రాజులుగా చెయ్యడమే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బాణోత్ రవి, చందర్‌తో పాటు అధికారులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ఏసు ప్రభువు బోధించిన బోధనలు భావితరాలకు అందించాలి...

ములుగు జిల్లా కేంద్రములోనీ ఓలి మిని స్ట్రీట్ చర్చిలో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు మంత్రి సీతక్క క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా ఏసుక్రీస్తు బోధనలైన స్వార్థ రహిత జీవనం, ప్రేమా, దయ, ఎదుటి వారిని క్షమించే గుణం, తమకు ఉన్న జ్ఞానాన్ని పంచుకోవడం ఇవి ఏసు బోధనలు అని శాంతి సౌభ్రాతృత్వాన్ని పంచే క్రీస్తు బోధనలు యధాతథంగా ఎంత గొప్పగా ప్రచారంలోకి వస్తే ఈ ప్రపంచానికి అంత గొప్ప మేలు జరుగుతుంది అని మంత్రి సీతక్క అన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేక్ కట్ చేసిన మంత్రి సీతక్క చేశారు.

ఏసుప్రభువు బోధనలు భావితరాలకు అందించాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏసు ప్రభువు బోధించిన బోధనలు భావితరాలకు అందించాలి అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మహబూబ్ నగర్ పట్టణం లోని కల్వరీ యంబి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యులు డి.కె.అరుణతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా ఏసుక్రీస్తు బోధనలైన స్వార్థ రహిత జీవనం, ప్రేమా, దయ, ఎదుటి వారిని క్షమించే గుణం, తమకు ఉన్న జ్ఞానాన్ని పంచుకోవడం ఇవి ఏసు బోధనలు అని ఆయన చెప్పారు. గతంలో ఎన్నో విద్యాసంస్థలు ఈ సంస్థ నుంచి గొప్పగా నిర్వహించి, ఎందరికో జ్ఞానం అందించారని, మళ్ళీ మీరు ఈ పవిత్ర మైన క్రిస్మస్ పండుగ సందర్భంగా జ్ఞానాన్ని అందించేందుకు విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని నా వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నిజాం సంస్థానంలో నాడు ఏర్పడిన సెంట్ జార్జెస్ పాఠశాల విద్యార్థిగా అక్కడి ఫాస్టర్స్ అందించిన ప్రోత్సాహం, వారు అందించిన జ్ఞానం తోటి సమాజంలో ప్రజా జీవితంలో ఎలా ఉండాలని నాకు వారు అక్కడ నేర్పించారని అందుకే నేను మహబూబ్ నగర్ లో విద్యా వ్యవస్థ అభివృద్ధికి ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరికి ఉండాలి...

ఏసు క్రీస్తు ఆశీస్సులు అందరికీ సంపూర్ణంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని మోతీనగర్, బెత్రెస్థ హెూలీ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభు ఆశీర్వాదం తోటి మీ అందరి మధ్య ఈరోజు ఈ వేడుకలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. భవిష్యత్తులో మీకు కావాల్సిన అన్ని రకాల అభివృద్ధి పనులకు సంపూర్ణ సహకారం ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. రెవరెండ్ ఫాస్టర్ ఎస్ వరప్రసాద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మిథున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మీడియా ఇంచార్జీ సిజె బెనహర్, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు శ్యామ్యూల్, ఫాస్టర్స్ జాకబ్, డ్యానియల్ సుదీర్, మరియన్, వరప్రసాద్, మహబూబ్ నగర్ పురపాలక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు యాదవ్, మోయిస్, ఫయాస్, కిరణ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజాపాలన యందు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా బుధవారం ఉదయం సర్వే పురోగతిని కమీషనర్ జి. రామలింగం మున్సిపల్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలన చేశారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్ బిజెపి అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో భారత రత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి శత జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధానకార్యదర్శి రవి నాయక్, మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్‌రావు, జిల్లా బిజెపి అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, ఉప్పల్ మహిళా కన్వినర్ అనిత రెడ్డి, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు అభిషేక్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు నవీన్, చంద్రమౌళి, అంజి ఉపాధ్యక్షులు యోగేశ్వర్ రెడ్డి, ఉదయకిరణ్, శ్రీధర్ రెడ్డి, డివిజన్ కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజి రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నవీన్ రెడ్డి, డివిజన్ బిజెపి నాయకులు నారాయణ రెడ్డి, కృష్ణ గౌడ్, శేఖర్, శ్రీనివాస్ యాదవ్, రమేష్ గౌడ్, బాలకృష్ణ, నవీన్ మహిళ మోర్చా అధ్యక్షురాలు మంజువాని, వరలక్ష్మి, డింపుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల భవనానికి అశోక్‌యాదవ్ భారీ విరాళం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి 10 లక్షల భారీ విరాళం అందజేసిన నందారం అశోక్ యాదవ్ వయసులో చిన్నవాడైన అందరికీ ఆదర్శంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న నందారం అశోక్ యాదవ్ మనసున్న మారాజు అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇటీవల కాలంలో షాద్ నగర్ నియోజకవర్గంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో అలరిస్తున్న షాద్ నగర్ పట్టణ చటాన్ పల్లి బీఆర్ఎస్ యువ నాయకుడు నందారం అశోక్ యాదవ్ బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా 10 లక్షల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమానికి తాను ఎంతగానో ఆకర్షితులయ్యానని అన్నారు. ఒక మంచి లక్ష్యంతో స్వచ్ఛందంగా కడుతున్న కళాశాల భవన నిర్మాణానికి తన వంతు సాయంగా 10 లక్షల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న ఈ మంచి పనికి తనవంతు ఆర్థిక సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. పార్టీలకు రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ మహత్కార్యానికి ప్రతి ఒక్కరు స్పందించి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అశోక్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సమాజంలో రాజకీయాలు వేరు స్నేహం వేరని పార్టీలపరంగా కొంత వ్యత్యాసం ఉన్నప్పటికీ స్నేహం కోసం అదేవిధంగా మంచి పనుల కోసం కలిసి నడవడం గొప్ప విషయం అని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. చిన్నవాడైన ఎంత పెద్ద మనసుతో భారీ విరాళాన్ని తనకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అశోక్ యాదవ్ ఇతర పార్టీలో ఉన్నప్పటికీ తనకు ఎంతో దగ్గర వ్యక్తి అని ఎమ్మెల్యే శంకర్ ప్రశంసించారు. రాజకీయాలకు పార్టీలకు అతీతంగా జరుగుతున్న ఈ గొప్ప సంకల్పానికి తనతో పాటు నడుస్తున్న వారందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద విద్యార్థులు అత్యంత ఆధునిక చదువులు చదువుకునేందుకు మంచి విద్యను అందించేందుకు ప్రైవేటు రంగాలతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్న ఈ కళాశాల భవనానికి సహకరిస్తున్న వారందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నందవరం అశోక్ యాదవ్ చేసిన ఈ గొప్ప ఆర్థిక సహాయానికి దేవుడు కూడా ఆశీర్వదిస్తాడని తన కుటుంబంతో పాటు చటాన్ పల్లి గ్రామస్తులు కూడా చల్లగా ఉండాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, బాలాజీ, మహేష్ మాల, సంతోష్, నక్కల శ్రీకాంత్ గౌడ్, శివ, శ్రీరామ్, హరీష్, మహేష్ దేవగిరి, నాని, నర్సింలు, రమేష్, చెన్నయ్య, లింగారెడ్డిగూడెం అశోక్, నందిగామ శంకర్, భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి నోటీసులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలని పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడంటూ గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కౌశిక్ రెడ్డితో పాటు 20 మంది అనుచరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐజీ శివధర్ రెడ్డి తన ఫోన్ టాప్ చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడానికి వచ్చిన సమయంలో సీఐతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ కేసులో కౌశిక్ రెడ్డిని డిసెంబర్ 6న పోలీసులు అరెస్ట్ చేశారు. కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందుహాజరు పరిచినప్పుడు ఆయనకు కోర్టు వెంటనే బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈనెల 27న మరోసారి వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మాసబ్ ట్యాంక్ పోలీసుల ముందు హాజరు కావాలని ఆదేశించారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై మాసబ్ ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసి.. విచారణకు రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. మాసబ్‌ట్యాంక్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే కౌశిక్ రెడ్డిపై మాసబ్‌ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేశారు. డిసెంబర్ 6న గచ్చిబౌలిలోని ఇంట్లో ఎమ్మెల్యేను అరెస్ట్ చేసి నేరుగా న్యాయస్థానం ముందు హాజరుపర్చారు. అయితే వెంటనే కౌశిక్ రెడ్డికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కానీ పోలీసుల విచారణకు సహకరించాలని, పోలీసులు ఈ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా సహకరించాలని, విచారణకు హాజరుకావాలని గతంలో బెయిల్ ఇచ్చిన సమయంలో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో మాసబ్‌ట్యాంక్ పోలీసుల ముందు కౌశిక్ రెడ్డి విచారణకు హాజరు కావాల్సి ఉంది. డిసెంబర్ 4న పాడి కౌశిక్‌రెడ్డితో పాటు దాదాపు 20 మంది తన అనుచరులతో కలిసి బంజారాహిల్స్ పీఎస్‌కు వెళ్లారు. అయితే ఎస్‌హెచ్‌వోగా ఉన్న సీఐ రాఘవేంద్ర వేరే పనిమీద బయటకు వెళ్తున్న క్రమంలో సీఐతో ఎమ్మెల్యే వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా సీఐకి సంబంధించిన వాహనాన్ని అడ్డుకోవడమే కాకుండా అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సీఐకు, ఎమ్మెల్యేకు మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయంలో తన విధులకు ఆటంకం కలిగించారంటూ ఎస్‌హెచ్‌వోగా ఉన్న రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరింత విచారణ కోసం కౌశిక్‌రెడ్డికి నోటీసులు ఇచ్చిన పోలీసులు మరోసారి బీఆర్ఎస్ ఎమ్మెల్యేను విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది.

రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి...

విశాలాంధ్ర - అమనగల్లు : భారతదేశ మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్ పేయి శతజయంతి వేడుకల సందర్భంగా వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామంలో వివిధ యువజన సంఘాలు, బిజెపి నాయకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ సంపతి జనార్దన్ రెడ్డితో కలిసి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారి, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువతి యువకులు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తం కేవలం దాతృత్వం ద్వారానే లభిస్తుందనిచ రక్తానికి ఎలాంటి కంపెనీలు ఫ్యాక్టరీలు ఉండవని ఆయన అన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువతీ యువకులను ఆయన అభినందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు గ్రామీణ ప్రాంతాల్లో చేసే సేవా కార్యక్రమాలు చాలా గొప్పవని పేద ప్రజలు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 40 మంది యువతీ, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ శిబిరంలో మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సంపతి జనార్దన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, కోశాధికారి గుజ్జరి నరసింహ, జిల్లా చైర్మన్ జూలూరు రమేష్, ఓంకారం, బండెల రామచంద్రారెడ్డి, అంజిరెడ్డి, జూలూరు లింగయ్య, లైన్స్ క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేష్, రవి రాథోడ్, శ్రీను, రక్తదాన శిబిర క్యాంప్ చైర్మన్ మట్ట మదన్ గౌడ్, మట్ట పరమేష్ గౌడ్, క్లబ్ పిఆర్వో పాషా, కురుమిద్ద యాదగిరి, యన్నం శేఖర్ రెడ్డి, జంగయ్య యాదవ్, విష్ణు గౌడ్, మట్ట శారదమ్మ, చక్రవర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబాయ్ హోటల్ ప్రారంభం

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ప్రధాన రహదారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన్న నూతనంగా నిర్మించిన బాబాయి హోటల్‌ను బుధవారం ముఖ్య అతిధులుగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కార్పొరేటర్లు విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెూటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం అందిచడం, పరిశుభ్రమైన పదార్థాలను సరసమైన ధరలకు ప్రజలకు అందిస్తూ మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు రసాల వెంకటేష్ యాదవ్, చీరాల నర్సింహా, కొత్త చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, సుమన్ నాయక్, కోష్టన్ రంగా బ్రహ్మన్న గౌడ్, బొమ్మకు శ్రీనివాస్, గుర్రాల వెంకటేష్ యాదవ్, జయ రాములు, కృప సాగర్, రాపోలు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: బైపాస్ సోలిపూర్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద గల సోలిపూర్ చర్చి వద్ద జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలను సమానంగా చూసిన యేసు క్రీస్తు లోకరక్షకుడు అని శంకర్ అన్నారు. పాపపరిహారార్థమై యేసు క్రీస్తు భూలోకానికి వచ్చాడని, క్రీస్తు జన్మదినం సందర్భంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ అందరికీ ఆదర్శమని అన్నారు. క్రిస్మస్ అనే మాటకు క్రీస్తును ఆరాధించుట అని అర్థం అన్నారు. ఆ ఆరాధన హృదయాంతరాళాల నుంచి పెల్లుబికాలి జగతి పరమార్థాన్ని గ్రహించి బతకాలన్నా, నిజమైన ఆనందాన్ని మదిలో నింపుకోవాలన్నా ఘనుడైన దేవుని ఆరాధించాలన్నారు. సర్వశక్తిమంతుడు, సర్వేశ్వరుడు, ఆదిసంభూతుడు, అత్యున్నతుడు, ఆరాధనకు యోగ్యుడూ క్రీస్తే అన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

దయగల హృదయమే భగవాన్ నిలయం, పరిశుద్ధాత్మడైన ప్రభువే ఏసుక్రీస్తు అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఎం.బి చర్చిలో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అంజయ్య యాదవ్ ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ పరిశుద్ధాత్మ అయిన ప్రభువు, మానవ జాతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోనీయుడు, ఎన్నో కష్టాలు అనుభవించి మానవ జీవితాల్లో మార్పు తెచ్చిన మహానుభావుడు, ప్రేమ తత్వాన్ని ప్రబోధించి ప్రతి మనిషిని ప్రేమించమని, అసూయ ద్వేషాలను విడనాడాలని ఏసుక్రీస్తు సూచించిన మార్గంలో నడిచి మనమందరము మానవ జీవిత అభ్యుదయాలకు పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెస్ సత్యనారాయణ, ఒగ్గు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రైతు భరోసా అమలు చేయాలి : ఎమ్మెల్సీ కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత ప్రభుత్వం ప్రతి పేదవాడు పండుగలను సంతోషంగా జరుపుకునేందుకు ఇచ్చే క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎగిరిపోయాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బుధవారం నాడు క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిని సందర్శించిన ఆమె విలేకరుల సమావేశంలో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మహిళలకు నెలకు 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు కానీ ఇవ్వలేదు, కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ప్రజలు ఆశించారు కానీ ప్రభుత్వం అటువంటి ఆలోచన కూడా చేయడం లేదని దుయ్యబట్టారు. ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ.30 వేలు బాకీ పడిందని, 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదన్నారు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్ పథకాన్ని నిలిపివేయడం చేయకపోవడం దారుణమని, రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయన్నారు. నేర రేటు పెరగడం ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదని, మహిళలు చూస్తూ ఊరుకోబోరని, కచ్చితంగా ప్రశ్నిస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టిందని, తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయ వద్దని, కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదన్నారు. ధన్యానికి బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు కేవలం సన్న వడ్లకే పరిమితం చేసిందన్నారు. మెదక్ జిల్లాను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని, కేసీఆర్ గోదావరి జలాలతో సింగూరును నింపారని, మెదక్‌కు నీళ్లు వచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను ప్రభుత్వం నిలిపి వేదయం దారుణమన్నారు. కేసీఆర్‌పై కోపాన్ని మెదక్ ప్రజలపై తీర్చుకుంటే ఏమొస్తుంది, కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను కొనసాగించాలని అన్నారు.

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు అరుదైన అవార్డ్

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌కు స్వచ్ఛ్ భారత్ మిషన్ 2.0లో మరో అవార్డ్ దక్కింది. సుస్థిర సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులను ప్రోత్సహించి, సుస్థిర వాతావరణాన్ని నిర్మించడంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచిన పీర్జాదిగూడ మున్సిపాలిటీ స్థిరమైన ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడంలో పీఎంసీ గొప్ప పనితీరుని కనబరిచింది. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చెయ్యడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమైనవి. స్వచ్ఛమైన ప్రకృతి నిర్మాణాన్ని ఏర్పాటు చెయ్యడానికి ఇతర మునిసిపాలిటీలు కూడా అనుసరించడానికి ఒక నమూనాగా పీర్జాదిగూడ మున్సిపాల్ కార్పొరేషన్ నిలిచింది. క్లీన్ ఇండియా మిషన్ అనేది దేశవ్యాప్తంగా పారిశుద్ధ్యం, పరిశుభ్రతను మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమం అన్నారు. ఇలాంటి ప్రయత్నాలు మెరుగైన వ్యర్థాల విభజన, కంపోస్టింగ్, రీసైక్లింగ్, పల్లపు వ్యర్థాల తగ్గింపుకు దారితీస్తాయి, ఇలాంటి కార్యక్రమాలు వల్ల స్థిరమైన పట్టణ వాతావరణానికి ఏర్పాటుకు దోహదం చేస్తుంది. ఇలాటి గుర్తింపు పొందిన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేశారు. ప్రజా ఆరోగ్యం, ప్రకృతి పరిరక్షణ విషయంలో మేయర్ అమర్ సింగ్ కృషి అభినందనీయం. ఈ అవార్డు సాధించడంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పనితీరుని మేయర్ అమర్ సింగ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇది కేవలం నా ఒక్కరి కృషి వల్ల మాత్రమే వచ్చిన గుర్తింపు కాదని, ఇందులో మున్సిపాలిటీ సిబ్బంది, అధికారుల పనితీరు ఉందన్నారు. ముఖ్యంగా పీర్జాదిగూడ ప్రజల సహకారం మరువలేనిదన్నారు.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : విలువలతో కూడిన రాజకీయ వెత్త భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి అని నేరేడుచర్ల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి కొనియాడారు. భారత మాజీ ప్రధానిఅటల్ బిహారీ వాజ్ పాయ్ శత జయంతి వేడుకలను నేరేడుచర్ల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ 1984 లో భారతీయ జనతా పార్టీ కేవలం రెండు పార్లమెంట్ సీట్లతో ప్రస్థానం మొదలుపెట్టి నేడు దిగ్విజయంగా భారతదేశాన్ని పరిపాలిస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని కొనియాడారు. అవిశ్వాస తీర్మానంలో ఒక్క ఓటు తేడాతో తృణప్రాయంగా ప్రధాని పదవిని సైతం వదులుకున్న గొప్ప రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. భారతదేశ అభివృద్ధి కోసం అనునిత్యం తపన పడిన వ్యక్తి అటల్ బిహారీ వాజ్ పాయ్ అని అన్నారు. నేటి తరం రాజకీయ నాయకులు ఆయనని ఆదర్శంగా తీసుకోవాలని యువతకు సూచించారు. నేరేడుచర్ల టౌన్ ప్రధాన కార్యదర్శి కొనతం నాగిరెడ్డి కిసాన్ మోర్చా అధ్యక్షులు తాళ్ల నరేందర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు కాలం నాగయ్య, ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, కాల్వ సైదులు, పూర్ణచంద్రరావు, దేవి రెడ్డి నాగిరెడ్డి, కొనతం కిరణ్ రెడ్డి, గొట్టేటి పవన్, పుల్లెంల సతీష్, పెండెం నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రేమకు, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్: మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రేమకు, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు, నల్గొండ జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం మంత్రి నల్గొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్‌లో ఉన్న సెంటీనరీ బిషప్ చర్చిలో, అలాగే క్లాక్ టవర్ వద్ద ఉన్న చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు నిర్వహించుకుంటున్న క్రిస్మస్‌కు ఎంతో ప్రత్యేకత ఉందని,క్షమించే గుణం ఉన్నవారు క్రైస్తవులని, వారందరూ పేదలకు ఉచిత సహాయం చేస్తారని, ప్రేమకు, శాంతికి ప్రతిరూపం క్రిస్టమస్ అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి క్లాక్ టవర్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, చర్చి ఫాదర్ జోసెఫ్ రెడ్డి, బిషప్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లాలల్లో వివిధ మండలల్లో, గ్రామాలలోని చర్చ్ లల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించి, బాల యేసు పుట్టినరోజు సందర్భంగా, వివిధ చర్చల్లో దైవజనుల ఆధ్వర్యంలో కెక్ కట్ చేశారు. క్రైస్తవులు, కుటుంబ సామెతంగా వచ్చి, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షకుడు, యేసుక్రీస్తు ప్రవచనల నెర వేర్పు కోసం పుట్టడని, దైవజనులు ప్రసంగించారు. బుధవారం ఉదయం తెల్లవారుజామున నుండి చర్చల్లో దైవజనులు, క్రైస్తవులు పెద్దలు, మహిళాలు, పిల్లలు, వృద్ధులు,ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చ్ దైవజనులు, క్రైస్తవులు పెద్దలు, మహిళాలు, యువత, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

లివింగ్‌గాడ్ చర్చ్‌లో ఘనంగా క్రీస్మస్ వేడుకలు..

ఏటూరునాగారం, (క్రాస్ రోడ్) లివింగ్ గాడ్ చర్చ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించి, దైవజనులు ఎస్. సామెల్ సన్, దైవ సేవకురాలు విజయమ్మ, సంఘ పెద్దల ఆధ్వర్యంలో కెక్ కట్ చేశారు.ముందుగా క్రిస్మస్ పాటలు, పాడుతూ, నృత్యలు చేశారు. ఈ సందర్భంగా లివింగ్ గాడ్ చర్చ్ దైవజనులు ఎస్. సామెల్ సన్ మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా, వృద్ధులకు, అనాధలకు, వికలాంగుల బట్టలు పంపిణీ చేశామని తెలిపారు. సంఘ పెద్దలు, పి లాజర్, టి.యాకోబు, ఆర్. సమ్మయ్య, యెంపెల్లి నరేష్, ఆర్ రాజు, పి.రాజు, పి.ప్రకాష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - మెదక్‌లో: ఆసియా ఖండంలో రెండో అతి పెద్ద చర్చిగా పేరుగాంచిన మెదక్ కెథడ్రల్ చర్చిలో క్రిస్మస్ సంబరాలు అంగరంగా వైభవంగా జరిగాయి. చర్చి నిర్మించి వందేళ్లు పూర్తి కావడంతో శతాబ్ది వేడుకలు ఈసారి ప్రత్యేకం. వేడుకలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఆనవాయితీ ప్రకారం చర్చి కమిటీ బాధ్యులు శిలువను ఊరేగింపుగా తీసుకువచ్చి చర్చిలోని ప్రధాన వేదిక మీద ప్రతిష్ఠించారు. తెల్లవారు జామున 4:30 గంటలకు ప్రాతఃకాల ఆరాధనతో చర్చిలో క్రిస్మస్ వేడుకలకు శుభారంభం పలికారు. ఇంఛార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ భక్తులకు దైవ వాక్యాన్ని వినిపించారు. క్రిస్మస్ జరుపుకుంటున్న సమస్త క్రైస్తవ సోదరులకు మెదక్ చర్చి ఇన్చార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ శుభాకాంక్షలు తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ మహా దేవాలయంలో ప్రతిష్ట మహోత్సవం జరుపుకుంటున్న అందరం ధన్యులమ న్నారు. దివ్యమైన మహాదేవాలయంలో 1924 డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు మొదలయ్యాయని గుర్తు చేశారు. స్థానిక ప్రిసిబిటరీ ఇంచార్జి డా.శాంతయ్య, డయాస్ కోశాధికారి విమల్ సుకుమార్, కమిటీ బాధ్యులు డేవిడ్, సాంసన్ సందీప్, గంట సంపత్ తదితరులున్నారు.

విశాలాంధ్ర - కారేపల్లిలో : సమాజానికి దిక్సూచిలా ఏసుక్రీస్తు బోధనలు నిలుస్తున్నాయని ప్రముఖ ఏసుక్రీస్తు ప్రబోధకుడు పాస్టర్ ముత్తారపు ఏలియా అన్నారు. క్రైస్తవుల పవిత్ర పండగ అయినా క్రిస్టమస్ వేడుకలను బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని మాదారంలో గల ఏజీ సీఎం ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఏలియా ఆధ్వర్యంలో క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాదారం మాజీ ఎంపిటిసి భాగం రూప-నాగేశ్వరరావు దంపతులు పదివేల రూపాయలను చర్చికి వితరణగా అందజేశారు. అంతకుముందు ప్రముఖ సీనియర్ జర్నలిస్టులు పగడాల నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, అనంతారపు వెంకటాచారిల చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు.

గ్రామ పెద్దలు కిలారు అప్పారావు, తాళ్ళూరి రాంబాబు, నాగండ్ల సీతయ్య, గుర్రం కిట్టు, గుర్రం నరసింహారావు, కోయిల శ్రీను, నిధి కొండ వెంకన్న, కాసాని లక్ష్మీనారాయణ, కుర్ర శ్రీను, దేవరకొండ లక్ష్మీనరసింహచారి, కాసాని శ్రీనివాసరావు, బట్టు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జా చేసి మరీ

అక్రమ నిర్మాణం...

> నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో అనుమతులు ఒకలా... నిర్మాణం మరోలా...
>
> ప్రభుత్వ అధికారులను పక్కదారి పట్టిస్తూ నిర్మాణం చేపడుతున్న బిజెపి లీడర్...
>
> ఓసి తర్వాత అక్రమంగా ఫ్రంట్ హౌస్ నిర్మించేందుకు యత్నిస్తున్న నిర్మాణదారుడు....

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో బిజెపి లీడర్ బరితెగించి నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వ అధికారులను సైతం మోసం చేస్తూ, అక్రమాలు చేస్తే ఉపేక్షించేది లేదనే బిజెపి పార్టీ సిద్ధాంతాలను కాలరాస్తూ అధికారులను తన ఉచ్చులోకి లాగి హెచ్ఎండిఏ అనుమతులను తీసుకొని, సరైన సెట్రో బ్యాక్‌లు లేకుండా రోడ్డును ఆక్రమించి దానిని సెట్ బ్యాక్ రూపంలో చూపుతూ ఓసి పొందేందుకు శతవిధాలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. ఓసి పొందిన తర్వాత అట్టి నిర్మాణంపై మరొక పెంట్ హౌస్ నిర్మాణం దర్జాగా చేపట్టేందుకు పావులు కదుపుతున్నాడని సమాచారం. వివరాల్లోకి వెళ్తే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ విలేజ్, రాజీవ్ గృహకల్ప సముదాయంలో బిజెపి లీడరైన ఓ నిర్మాణదారుడు దొడ్డిదారిన హెచ్ఎండిఏ అనుమతులు పొంది, అనుమతులలో చూపిన విధంగా సరైన సెట్ బ్యాక్ లు లేకుండా అధికారులను బురిడి కొట్టిస్తూ నిర్మాణం చేపడుతున్నాడు. బిజెపి పార్టీ నాయకులుగా ప్రజలకు పౌరులకు సరైన మార్గంలో నడిచి వారిని మేల్కొల్పాల్సిన నాయకులు వక్రమార్గంలో నడిచి ప్రభుత్వాన్ని, ప్రభుత్వ యంత్రాంగాలను తప్పుదారి పట్టించడం ఎంతవరకు సమంజసం అని పలువురు నిర్మాణదారుడుపై ఆరోపణలు చేస్తున్నారు.

అనుమతులు ఒకలా....నిర్మాణం మరోలా..

హెచ్ఎండిఏ అనుమతులు పొంది నిర్మాణానికి పూనుకున్న అట్టి నిర్మాణదారుడు సెట్ బ్యాక్ లు వదలకుండా అధికారులను ఏమార్చి హెచ్ఎండిఏ నిబంధనలు తుంగలోకి తొక్కి డోంట్ కేర్ అనేలా పనులను చకచగా కానిచ్చేస్తున్నాడు. హెచ్ఎండిఏ అనుమతుల నిబంధనల ప్రకారం 200 నుండి 300 గజాల స్థలంలో నిర్మాణాలు చేపడితే అట్టి నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేయాలని, లేదా ఎటువంటి తప్పిదాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు చేపడతామని అనుమతుల కాఫీలలో పొందుపరిచి ఉంటుంది. ఇవన్నీ ఉన్నా వారికిచ్చిన కాస్త వెసులుబాటును అదునుగా భావించిన అట్టి నిర్మాణదారుడు అధికారులను తనకు అనుకూలంగా మలుచుకొని వారికి తిలాపాపం తలా పిరికెడు అన్న చందంగా అధికారులను కూడా ఆయన చేసిన అక్రమణలోకి లాగాడని స్థానికులు గుసగుసలాడుతున్నారు. 200 నుండి 300 గజాల స్థలంలో నిర్మాణానికి హెచ్ఎండిఏ నార్మ్స్ ప్రకారం బిల్డింగ్ ప్రధాన ద్వారానికి ఏ రోడ్డునైతే చూపించి అనుమతులు పొందాడో ఆ రోడ్డుకు ఆయన నిర్మాణానికి సుమారు 2 నుండి 3 మీటర్ల స్టేట్ బ్యాంక్ వదలాలి. అలాగే ఇరువైపులా వెనుక భాగంలో 2 మీటర్ల చొప్పున సెట్ బ్యాక్ వదిలి నిర్మాణాన్ని చేపట్టాలి. కానీ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నిర్మాణాన్ని చేపడుతున్న బిజెపి లీడర్ అయినా నిర్మాణదారుడు హెచ్ఎండిఏ చట్టాలను ఉల్లంఘించి నిబంధనలను అధిగమించి నిర్మాణం ముందు సుమారు 2, 3 మీటర్లకు బదులుగా రోడ్డు కబ్జా చేసి 1 మీటర్ సెట్ బ్యాక్, అలాగే ఇరువైపులా వెనుక భాగంలో 2 మీటర్లకు బదులుగా అర మీటర్ సెట్ బ్యాక్ వదిలి నిర్మాణం చేపడుతున్నాడు.

అధికారుల చొరవతోనే నిర్మాణం...

హెచ్ఎండిఏ అనుమతులు పొందిన కార్పొరేషన్ లోకల్ బాడీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సరైన సెడ్ బాక్స్ ఉన్నాయా లేదా అని నిర్ధారణ చేసి పై అధికారులకు తెలియపర్చాలి. కానీ ఈ నిర్మాణాన్ని అధికారులు, సిబ్బంది సరైన విధంగా పరిశీలించకుండానే నిర్మాణదారుడుతో అమ్యామ్యాలకు లోనై అనుమతులకు ఓకే చేశారనే ఉదంతాలు ఇక్కడ గట్టిగానే వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రోడ్డును కూడా ఆక్రమించి షెడ్ బ్యాక్ చూపిస్తూ ఓసి కోసం పాకులాడుతూ, ఓసి రిలీజ్ కాగానే పెంట్ హౌస్ కూడా నిర్మించేందుకు నిర్మాణదారుడు పరితపిస్తున్నాడు. ఏదైతేనేం చూడాలి మరి బిజెపి కేంద్ర రాష్ట్ర నాయకత్వ సిద్ధాంతాలను కూని చేస్తున్న ఇక్కడ లీడర్, ఆయన చేపడుతున్న నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహబూబ్‌నగర్ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం సభ్యులు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేకి నూతనంగా ఎన్నికైన గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యవర్గ సభ్యులను రాష్ట్ర తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఉపాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ గౌడ్, పరిచయం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్‌గా ఎన్నికైన వారు ఏ రంగంలో ఉన్నవారు ఆ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు కృషి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్‌ను మొదటి స్థానంలో ఉంచే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. అందరం కలిసి కట్టుగా శ్రమిస్తే రానున్న నాలుగు సంవత్సరాలలో అన్నింటిలో మన మహబూబ్‌నగర్ మొదటి స్థానంలో నిలపడం సాధ్యం అవుతుంది అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్.విజయ్ కుమార్, ఉపాధ్యక్షురాలు కె.సంధ్య, కార్యదర్శి కె.వరప్రసాద్, అదనపు కార్యదర్శి జాకీర్, ఆఫీస్ కార్యదర్శి జగన్ మోహన్, సభ్యులు ఆర్ రవింధర్, మురళీధర్, శ్రీను గౌడ్, నాగరాజు, చంద్రకళ, గంగాధర్, రాష్ట్ర సభ్యులు బక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : డెక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కే.నవనీత్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ సుమా మీనన్, కోఆర్డినేటర్ తదితరులు హాజరయ్యారు. ప్రారంభ వేడుకలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్వాగత నృత్యం నిర్వహించి అందరినీ అలరించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థిని షణ్ముఖి "రోజువారి జీవితంలో గణిత శాస్త్రం ప్రాధాన్యత" గురించి తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ, శ్రీనివాస రామానుజన్ గణిత రంగానికి అందించిన విశిష్ట సేవలను వివరించింది. అనంతరం ఉన్నత తరగతుల విద్యార్థుల కోసం విజ్ఞానవంతమైన క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని సమాధానాలు ఇచ్చి ప్రతిభ చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుమా మీనన్ మాట్లాడుతూ, "గణితశాస్త్రం మన దైనందిన జీవితంలో అంతర్భాగమై ఉంది. ఇది ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రభావితం చేసే శాస్త్రం. దీని ప్రాముఖ్యతను పిల్లలకు బోధించడమే మా లక్ష్యం," అని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ కె. నవీన్ కుమార్ మాట్లాడుతూ, "విద్యార్థుల అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం, విద్యార్థుల్లో సృజనాత్మకత, గణిత పట్ల ఆసక్తి పెంపొందించడమే మా లక్ష్యం" అని అన్నారు. విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జాతీయ గణిత దినోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా జరుపుకున్నారు.

బద్దుల యాదయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - షాద్ నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ కార్యకర్త బద్దుల యాదయ్య కుటుంబానికి బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ సమిష్టిగా లక్ష రూపాయలు పోగు చేసి మృతి చెందిన బద్దుల యాదయ్య కుటుంబానికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి చేతుల మీదుగా మృతుని కుటుంబానికి అందించారు. చెక్కును అందజేసిన వారిలో బెంది శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయి యాదవ్, మాజీ సర్పంచ్ యాదయ్య, కంటెస్టెడ్ యంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్స్, బిఆర్ఎస్ గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

27న 'అరుణిమ-త్రికాల' నవలల ఆవిష్కరణ

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఈనెల 27న ఎన్టీఆర్ స్టేడియం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని సాదిక్ వేదిక వద్ద తాను రచించిన రెండు నవలల ఆవిష్కరణ, పరిచయ సభను ఘనంగా నిర్వహిస్తున్నట్లు రచయిత డాక్టర్ సంధ్య విప్లవ్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ బ్రోచర్‌ను డా.హరికాంత్‌తో కలసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రచయిత్రి, హస్మిత పబ్లికేషన్స్ భండారు విజయ సభాధ్యక్షతన 'అరుణిమ' నవలను బీసీ కమిషన్ మాజీ చైర్మన్, సామాజిక తత్త్వవేత్త బీఎస్.రాములు ఆవిష్కరిస్తారని తెలిపారు. ముఖ్య వక్తలుగా కోఠి సిటీ కాలేజీ తెలుగు శాఖ హెచ్ఓడీ డా.కోయి కోటేశ్వర్‌రావు, సామాజిక ఉద్యమకారిణి, పిఓడబ్ల్యూ సంధ్య, వీక్షణం పత్రిక వ్యవస్థాపకులు, ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ ఎన్.వేణుగోపాల్, స్వాగత పలుకులు రచయిత్రి, బాలోత్సవ్ నిర్వాహకురాలు రూప రుక్మిణి పాల్గొంటారని తెలిపారు. సా.7 గం.కు రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు, ప్రొఫెసర్ కుమారి రచన శృంగవరపు సభాధ్యక్షతన త్రికాల నవల ఆవిష్కరణ, పరిచయ సభకు ముఖ్య వక్తలుగా ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్, ఏపీ జర్నలిజం కాలేజీ వ్యవస్థాపక అధ్యక్షులు సతీష్ చందర్, హెచ్ఓడి తెలుగు శాఖ ఓయూ, ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.సీ.కాశీం ముఖ్య వక్తలుగా హాజరవుతారని తెలిపారు. జోగిని వ్యవస్థపై తాను రచించిన త్రికాల నవలకు ప్రోత్సాహక నవలా పురస్కారం అందుకుందన్నారు. వేల ఏండ్ల అణచివేతను భారతీయ స్త్రీలు ఎలా ఎదుర్కొన్నారనేది ఈ నవల సారాంశం అని పేర్కొన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో తాము పాల్గొన్న నేపథ్యంలో రచనలకు బీజం పడింది అన్నారు.

హామీలు నెరవేర్చేందుకు వ్యూహం

- నడ్డా నివాసంలో ఎన్‌డీఏ నేతల భేటీ
- మత్స్యకార వర్గానికి రిజర్వేషన్లపై చర్చ
- సుపరిపాలన... రాజకీయ అంశాలపైనా...

న్యూఢిల్లీ: ఎన్నికల హామీలను నెరవేర్చడం... సుపరి పాలన... సమన్వయంపై ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలు చర్చించాయి. మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా బుధవారం బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా నివాసంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) నాయకులు సమావేశమయ్యారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జేడీ-యూ నేత, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, అప్నాదళ్ (ఎస్) అధ్యక్షురాలు, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్, అలాగే జేడీ (ఎస్) నాయకుడు, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, బీహార్ హిందుస్థానీ అవామ్ మోర్చా (ఎస్) నాయకుడు, మోదీ ప్రభుత్వంలో మంత్రి కూడా అయిన జితన్ రామ్ మాంఝీ, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహ, రాజ్యసభ ఎంపీ, భారత ధర్మ జనసేన అధ్యక్షుడు తుషార్ వెల్లప్పల్లి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం అజెండాపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేకపోయినా, సుపరిపాలన, రాజకీయ అంశాలపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. 'ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన సమావేశానికి ఎన్‌డీఏ నేతలు హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో భారతదేశం అపూర్వమైన మైలురాళ్లను సాధిస్తోంది. ప్రపంచ సూపర్ పవర్‌గా తనను తాను నిలబెట్టుకుంది' అని జె.పి.నడ్డా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఎన్‌డీఏ ప్రభుత్వం 'వికసిత్ భారత్-2047' దార్శనికతను కొనసాగించడంలో స్థిరంగా ఉంది. అందరికీ ఉజ్వలమైన, మరింత సంపన్నమైన భవిష్యత్‌ను నిర్ధారిస్తుంది' అని తెలిపారు. 'ఇది వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఎన్‌డీఏ నేతల 'అనధికారిక' సమావేశమని ఉత్తర ప్రదేశ్ నిషాద్ పార్టీ అధ్యక్షుడు సంజయ్ నిషాద్ అన్నారు. 'కలిసి ముందుకు సాగడమే మా భవిష్యత్ వ్యూహం. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ ఐక్యతను చాటాలి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు అందరూ (బీజేపీ నేతలను) సమావేశంలో అభినందించారు' అని సమావేశం గురించి అడిగినప్పుడు విలేకరులతో అన్నారు. ప్రధాని మోదీ చేసిన 'అన్ని పనులు' క్షేత్ర స్థాయికి చేరేలా, 'ఎన్నికల సమయంలో ఎన్నికల సమయంలో ప్రజలకు చేసిన వాగ్దానాలు నెరవేరేలా చూసేందుకు సంకీర్ణ వ్యూహాన్ని కూడా సమావేశంలో చర్చించినట్లు నిషాద్ తెలిపారు. మత్స్యకార సామాజిక వర్గానికి రిజర్వేషన్ కల్పించే అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలిపారు. 'మత్స్యకార సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఎన్నికల హామీ అయినందున నేను 30-37 పేజీల ఆధారాలు ఇచ్చాను. వారు ఒక వారం తర్వాత మాతో చర్చిస్తారు' అని అన్నారు. సమావేశంలో అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల అంశం ప్రస్తావనకు వచ్చిందా అని ప్రశ్నించగా... 'మేము ప్రజల సంక్షేమం కోసం వచ్చాం. అందులో విజయం సాధించడం ఎలా, దాని కోసం శక్తిని వెచ్చించాలి' అని అన్నారు. ఎన్‌డీఏ కూటమి జమిలి ఎన్నికలపై దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఆ ప్రతిపాదనకు అన్ని భాగస్వామ్య పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఏకకాల ఎన్నికల కోసం రెండు బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటయిన పార్లమెంటు సంయుక్త కమిటీ జనవరి 8న సమావేశం కానుంది.

జర్నలిస్టులకు రైల్వే పాసులు పునరుద్ధరించండి

కేంద్ర మంత్రికి ఎంపీ కలిశెట్టి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ప్రెస్ అక్రిడిటేషన్ కార్డులు కలిగిన పాత్రికేయులకు రైల్వే పాసులను పునరుద్ధరించాలని విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం దిల్లీలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలిశెటీ... తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అనేక రైల్వే సమస్యలపై చర్చించారు. రాజాం, పాలకొండ, సీతంపేట, కోతూరు, హద్దు బంగి, పర్లాకిమిడి ప్రాంతాల రైల్వే అనుసంధానం ప్రాజెక్టుపై డీపీఆర్ తయారీకి అనుమతులు తక్షణమే ఇవ్వాలని మరోసారి కోరారు. ఒడిశా రాష్ట్రంతో అనుసంధానించుకునే విధంగా రైల్వే మార్గం ఏర్పాటు చేయడం అనేది ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. రైల్వే లైన్ల నిర్మాణం, నిర్వహణ స్థానిక ప్రజలకు ఉద్యోగావకాశాలు అందిస్తుందన్నారు. అందువల్ల రైల్వే మార్గం స్థాపన కోసం త్వరగా ఒక సామర్థ్య అధ్యయనాన్ని ప్రారంభించాలని మంత్రిని కోరారు. అలాగే పాత్రికేయుల రైల్వే పాసు అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గతంలో జర్నలిస్టులకు రైల్వే పాసులు ఇచ్చేవారని, కరోనా నుంచి జర్నలిస్టులకు రైల్వే పాసుల జారీ నిలిచిపోయిందన్నారు. ఈ సదుపాయాన్ని పునరుద్ధరించాలని కోరారు.

మార్టిన్ డిజిటల్ డేటా కాపీ చేయొద్దు

ఈడీకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఆయన, బంధు మిత్రులు, ఉద్యోగుల నుంచి సీజ్ చేసిన ఎలక్ట్రానిక్ పరికారాలు తెరవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఆదేశించింది. ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎఫ్‌జీహెచ్‌ఎస్‌పీఎల్) పిటిషన్‌పై విచారణ క్రమంలో మార్టిన్‌కు చెందిన మొబైల్, ల్యాప్‌టాప్‌లోని డేటాను సేకరించవద్దని, అందులోని సమాచారాన్ని కాపీ చేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. కోర్టు ఉత్తర్వులను పరిశీలించామని, డిజిటల్ రికార్డులే కాకుండా తమ వద్ద మరింత విశ్వసనీయ సమాచారం ఉందని ఈడీ వర్గాలు తెలిపాయి. ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మోసాలకు పాల్పడిందన్న 2014 నాటి సీబీఐ కేసు ఆధారంగా 2018లో మార్టిన్, ఆయన బంధువులు, సంస్థలోని అధికారులపై మనీలాండరింగ్ కేసును ఈడీ నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నవంబరులో తమిళనాడు, హర్యానా, పంజాబ్, పశ్చిమ బెంగాల్ సహా ఆరు రాష్ట్రాలలోని మార్టిన్ కార్యాలయాలు, ఆస్తులు సోదా చేసింది. 22 చోట్ల తనిఖీలు నిర్వహించి రూ.12.41 కోట్ల నగదుతో పాటు మొబైల్, ల్యాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. దీంతో మార్టిన్... సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సంబంధిత ఎలక్ట్రానిక్ పరికరాల్లోని సమాచారాన్ని యాక్సెస్ చేయొద్దని, కాపీ చేయొద్దని ఈడీకి సూచిస్తూ సర్వోన్నత న్యాయస్థానం తాజా ఉత్తర్వులు జారీచేసింది. ఇంకొన్ని కంపెనీల ఇదే తరహా పిటిషన్లతో కలిపి మార్టిన్ కేసును విచారిస్తామంటూ తదుపరి విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

1,839 ఉద్యోగాలు తగ్గించాలి

అధికారులకు దక్షిణ మధ్య రైల్వే సూచనలు

న్యూఢిల్లీ: తమ జోన్‌కు మంజూరైన మొత్తం 88వేలకుపైగా పోస్టుల్లో నుంచి రెండు శాతం అంటే 1,839 ఉద్యోగాలు తగ్గించాలని అధికారులకు దక్షిణ మధ్య రైల్వే సూచించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు, విభాగాల్లోని పోస్టులను సరెండర్ చేయాలని వివిధ శాఖల అధిపతులకు దక్షిణ మధ్య రైల్వే జోన్ సర్క్యులర్ జారీచేసింది. 2024-25లో మంజూరైన ఉద్యోగుల సంఖ్యలో కోత-కార్మికశక్తి ప్రణాళిక అంశమై మే 8న తేదీన రాసిన రైల్వే బోర్డు లేఖను ప్రస్తావిస్తూ తాజా సర్క్యులర్ వెలువడింది. మంజూరైన ఉద్యోగాల్లో నుంచి రెండు శాతం అంటే 1,839 ఉద్యోగాలు తగ్గించాలనే నిర్ణయం జరిగినట్లు దక్షిణ మధ్య రైల్వే తాజాగా వెల్లడించింది. ఎస్‌సీఆర్‌లోని ఆరు డివిజన్లలో ఒకటైన సికింద్రాబాద్ డివిజన్ నుంచే గరిష్ఠంగా 476 పోస్టులను సరెండర్ చేయాలని లేఖ పేర్కొంది. కాగా మొత్తం 14,40,789 పోస్టుల్లో నుంచి 28,816 పోస్టులను 2024-25 ఆర్థిక సంవత్సరంలో సరెండర్ చేయాలని అనుబంధ పత్రం పేర్కొంది. ఈ క్రమంలో ఎక్కువ ఉద్యోగాలున్న నార్తెన్ రైల్వే 1,62,142 పోస్టుల్లో నుంచి 3,243; ఈస్టరన్ రైల్వే 1,26,418 నుంచి 2,528 పోస్టులను 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింసే లోపు సరెండర్ చేయాల్సి ఉంది.

ఆప్ పథకాలతో సంబంధం లేదు

దిల్లీ ప్రభుత్వ శాఖల ప్రకటన - కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: అధికార ఆప్ ప్రకటిత పథకాలతో తమకు సంబంధం లేదంటూ దిల్లీ ప్రభుత్వ మహిళా, శిశు సంక్షేమం, ఆరోగ్య శాఖలు బుధవారం ప్రకటించాయి. మహిళలకు రూ.2,100 ఇస్తామని, వృద్ధులకు ఉచిత వైద్యం హామీని ఆప్ ప్రభుత్వం హామీ ఇవ్వగా వాటితో తమకు సంబంధం లేదని, లేని పథకాల కోసం నమోదు నెపంతో మీ వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఇవ్వవద్దని, అది దుర్వినియోగం కావచ్చంటూ దిల్లీ ప్రజలకు ఆ శాఖలు సూచనలు చేశాయి. ఇలాంటి పథకాల గురించి దిల్లీ ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం లేదని ప్రకటన పేర్కొంది. పాన్ నంబర్లు, ఫోన్ నంబర్లు, ఓటర్ ఐడీ వంటి వివరాలను ఆ పథకాల పేరిట రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రైవేటు/ప్రభుత్వ వ్యక్తులతో పంచుకుంటే సైబర్ నేరాలకు, బ్యాంకు మోసాలకు అవకాశమిచ్చిన వారవుతారని దిల్లీ ప్రజలను హెచ్చరించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన', 'సంజీవని యోజన' అనే రెండు పథకాలను ఆప్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. ఈ పథకాల కోసం రిజిస్ట్రేషన్లను ఒక ఉద్యమంగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేపట్టారు. ఇలాంటి సందర్భంలో తాజా పరిణామం వివాదాస్పదంగా మారింది. కేంద్రానికి, ఆప్ ప్రభుత్వానికి మధ్య అధికార పోరునకు మరోమారు అద్దం పట్టింది. సంబంధిత ప్రభుత్వ శాఖల తాజా ప్రకటనలపై కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ పథకాల వల్ల కేంద్రం వెన్నులో వణుకు మొదలైంది. అందుకోసమే మరికొద్ది రోజుల్లో తప్పుడు కేసులో ముఖ్యమంత్రి అతిశీని అరెస్టు చేయాలని పావులు కదుపుతోంది' అని ఎక్స్ మాధ్యమంగా ఆరోపణలు చేశారు. అతిశీ అరెస్టుకు ముందు ఆప్ సీనియర్ నేతల ఆస్తులను సోదా చేస్తారని కూడా హెచ్చరించారు.

రేపు విద్యుత్ చార్జీల పెంపునకు వైసీపీ నిరసనలు

విశాలాంధ్ర-విజయవాడ: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ అధినేత జగన్ పిలుపు మేరకు ఈ నెల 27న తలపెట్టిన ర్యాలీలు, వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం విధించడం దుర్మార్గం అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ గురువారం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాభాగస్వామ్యంతో విద్యుత్ కార్యాలయాలకు ర్యాలీలు నిర్వహిస్తూ, విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోయి, ఇబ్బంది పడుతున్న రైతుల పరిస్థితిని తెలుసుకోవాలని, కష్టకాలంలో వారికి అండగా ఉంటామనే భరోసా అందించాలని సూచించారు.

అన్నా వర్సిటీలో దారుణం

ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం: నిందితుడి అరెస్టు

చెన్నై: తమిళనాడులోని ప్రతిష్ఠాత్మక అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఘోరం జరిగింది. ఇంజినీరింగ్ విద్యార్థినిపై దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం 'డిసెంబర్ 23 రాత్రి బాధితురాలు, ఆమె స్నేహితుడు కలిసి అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో కలిసి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, ఆమె స్నేహితుడిని దారుణంగా కొట్టి బయటకు తరిమేశారు. తరువాత వారిద్దరూ కలిసి ఆమెను దారుణంగా అత్యాచారం చేశారు. తరువాత ఆమెకు సంబంధించిన అభ్యంతరకర ఫొటోలను తమ సెల్‌ఫోన్‌తో తీశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే, ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరించారు. తరువాత ఆమెను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు.' అయినప్పటికీ ఆమె భయపడకుండా మరుసటి రోజు తన స్నేహితుడితో కలిసి కొట్టూరుపురం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు భారతీయ న్యాయ సంహిత, సెక్షన్-64 ప్రకారం అత్యాచార కేసు నమోదు చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ సాయంతో ఓ నిందితుని ఇప్పటికే పట్టుకున్నారు. మరో నిందితుడి కోసం 4 స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. విచారణలో శాస్త్రీయ ఆధారాల ఆధారంగా కొత్తూరు (కాలేజీకి సమీపంలో ఉన్న పొరుగు ప్రాంతం)కి చెందిన జ్ఞానశేఖరన్ (37)ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు నేరం అంగీకరించాడని... ఇతడు పేవ్‌మెంట్‌పై బిర్యానీ దుకాణం నడుపుతుంటాడని తెలిపారు. అతడికి ఇతర నేరాల్లో ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. యూనివర్సిటీ అధికారులతో సంప్రదింపుల అనంతరం విద్యార్థుల భద్రతను పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. విచారణలో పోలీసులకు వర్సిటీ పూర్తి సహకారం అందిస్తోందని అన్నా యూనివర్సిటీ రిజిస్ట్రార్ జె ప్రకాష్ తెలిపారు. వర్సిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటీ కూడా విచారణ ప్రారంభించిందని తెలిపారు.

కాగా విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్సిటీ క్యాంపస్ ఎదుట ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విద్యార్థినిని క్యాంపస్ లోపల ఇద్దరు బయటి వ్యక్తులు లైంగికంగా వేధించారని నిరసనకారుల్లో ఒకరు తెలిపారు. కాగా ఈ ఘటన తమిళనాడ రాజకీయ దుమారం రేపింది. ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎలప్పాడి పళనిస్వామి అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. తమిళనాడు నడిబొడ్డులో ఉన్న అన్నా యునివర్సిటీలో ఇలాంటి ఘటన జరగడం సిగ్గుచేటన్నారు. దిల్లీలో నిర్భయ అత్యాచారం జరిగిన 12 ఏళ్ల తరువాత, తమిళనాడులో ఇలాంటి ఘటన జరిగిందని, ఇది రాష్ట్రంలో శాంతి, భద్రతలు ఎంతగా క్షీణించాయో తెలియజేస్తుందని అన్నారు. తమిళనాడు బీజేపీ నాయకుడు అన్నామలై ఎక్స్ వేదికగా అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు తమిళనాడు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, అలా జరిగి ఉండకూడదని డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నారు. పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారని, ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, బాధితురాలికి తగిన న్యాయం చేస్తామని తెలిపారు.

ఖాన్ వైఖరి రాజ్యాంగ విరుద్ధం

కొత్త గవర్నర్ పనితీరుపై ఆశాభావంతో ఉన్నాం: గోవిందన్

తిరువనంతపురం: బీహార్‌కు బదిలీపై వెళ్లిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మాదిరిగా కాకుండా, కొత్తగా నియమితులైన రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ రాజ్యాంగబద్ధంగా పని చేస్తారని, రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తారని కేరళలోని అధికార సీపీఎం ఆశాభావం వ్యక్తం చేసింది. వివిధ సమస్యలపై వామపక్ష ప్రభుత్వంతో విభేదించిన ఖాన్‌ను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ తీవ్రంగా విమర్శించారు. సంఘ్‌పరివార్ ఎజెండాను అమలు చేసేందుకు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడ్డారన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మీడియా గవర్నర్ ఖాన్‌ను అత్యంత గౌరవనీయమైన వ్యక్తిగా చిత్రీకరిస్తోందని మండిపడ్డారు. కొన్ని వార్తాపత్రికలు ఖాన్‌ను గొప్ప ప్రతిపక్ష వ్యక్తిగా కూడా ప్రశంసించాయన్నారు. సంఘ్ పరివార్ ఎజెండాను అమలు చేయడానికి వామపక్ష ప్రభుత్వంతో ఘర్షణ పడుతున్న సమయంలో ఖాన్‌ను మీడియా వెనకేసుకొచ్చిందన్నారు. "ఈ విధానం అత్యంత ప్రజా వ్యతిరేకమైనదిగా పరిగణించ బడుతుంది" అని తెలిపారు. గవర్నర్లు వారి రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సి ఉండగా... ఖాన్ రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమైన వైఖరి తీసుకున్నారని ఆరోపించారు. శాసనసభ ఆమోదించిన చట్టాలకు సమ్మతిని నిలుపుదల చేయడం, సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పుడు బిల్లులను రాష్ట్రపతికి పంపడం వంటి ఖాన్ చర్యలు అసాధారణమైనవని గోవిందన్ విమర్శించారు. కొత్త గవర్నర్ నియామకం గురించి ప్రశ్నించినప్పుడు... గవర్నర్ ఎంపిక ఆర్ఎస్ఎస్-బీజేపీ వ్యవస్థపై ఆధారపడి ఉందని, అయితే దాని గురించి తాను ఎటువంటి పక్షపాత వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టం చేశారు. కొత్త గవర్నర్ రాజ్యాంగ బద్ధంగా పని చేస్తారని, ప్రభుత్వానికి సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశంలో ఘనంగా క్రిస్మస్

న్యూఢిల్లీ: భారత్‌లో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. అన్ని చోట్ల పండుగ వాతావరణం కనిపించింది. రంగు రంగుల విద్యుత్ దీపాలతో చర్చిలను అలంకరించారు. క్రైస్తవులు చక్కగా ముస్తాబై... కుటుంబ సమేతంగా ప్రార్థనలకు హాజరయ్యారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై వంటి మెట్రో పాలిటన్ నగరాల్లో క్రిస్మస్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో చర్చిలు, భవనాలను అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణలు, క్రిస్మస్ ట్రీలతో పండుగ శోభను పెంచారు. మిఠాయిలు, కేకలు పంచుకొని క్రైస్తవులు పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దేశ రాజధాని దిల్లీలోని మార్కెట్లు, షాపింగ్ మాల్స్‌లో క్రిస్మస్ సందడి కనిపించింది. ప్రత్యేక ఏర్పాట్లు, అలంకరణలతో పండుగ వాతావరణం నెలకొంది. ఆర్థిక రాజధాని ముంబైలోనూ క్రిస్మస్ ఘనంగా జరిగింది. అక్కడి చర్చిలతో పాటు అనేక భవనాలు విద్యుత్ దీపాల అలంకరణతో మెరిశాయి. గోవా మార్కెట్లు, భవనాలు సైతం మెరిసిపోయాయి. క్రిస్మస్ ట్రీల అలకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రిస్మస్, న్యూ ఇయర్ కారణంగా పర్యాటకుల తాకిడి పెరిగినట్లు గోవా అధికారులు వెల్లడించారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన చర్చిలన్నీ భక్తులతో నిండిపోయాయి. అన్ని చోట్ల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ గీతాలతో పండుగ వాతావరణం కనిపించింది.

కేజ్రీవాల్ నియోజకవర్గంలో డబ్బు పంచిన బీజేపీ: అతిశీ

న్యూఢిల్లీ: ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేయబోయే న్యూఢిల్లీ నియోజవకర్గంలో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు బీజేపీ డబ్బులు పంపిణీ చేస్తోందని సీఎం అతిశీ ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీపై నిప్పులు చెరిగారు. బీజేపీ మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ నివాసముండే విండర్స్‌లోని మురికి వాడల్లో మహిళలకు రూ.1,100 చొప్పున పంచి... వారి ఓటర్ ఐడీల వివరాలను సేకరించారని అతిశీ తెలిపారు. కోట్లు దాచిన ఆ బంగళా వద్ద తనిఖీలు నిర్వహించాలని దిల్లీ పోలీసులు, సీబీఐ, ఈడీకి సూచించారు. దీనిపై ఆప్ అధికారికంగా పోలీసులకు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తుందని చెప్పారు. వర్మ అరెస్టునకు డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో డబ్బు పంపిణీ జరిగినట్లు కేజ్రీవాల్ కూడా ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను వర్మ తోసిపుచ్చారు. తన తండ్రి, దిల్లీ మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ స్థాపించిన ఎన్‌జీవో 'రాష్ట్రీయ స్వాభిమాన్' ప్రచారంలో భాగంగా డబ్బు పంచినట్లు తెలిపారు. ప్రజలకు సాయం చేయడమే ధ్యేయమని అన్నారు.

మణిపూర్‌లో తక్షణ శాంతి అవసరం

సీఎం బీరేన్ సింగ్

ఇంఫాల్: గత ఏడాది మే నుంచి జాతి హింసాకాండలో చిక్కుకున్న రాష్ట్రానికి తక్షణ శాంతి అవసరమని, రెండు వర్గాలు ఒక అవగాహనకు రావాలని మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ బుధవారం విజ్ఞప్తి చేశారు. ఇక్కడ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన గుడ్ గవర్నెన్స్ డే కార్యక్రమంలో సింగ్ మాట్లాడుతూ తమ పార్టీ ఈశాన్య రాష్ట్రాన్ని రక్షించగలదని, కలిసి జీవించాలనే ఆలోచన నమ్ముతుందని అన్నారు. 'నేడు మణిపూర్‌లో జరుగుతున్నదానికి అనేక కారణాలున్నాయి. నేడు రాష్ట్రాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్న వారు ప్రభుత్వం ఏం చేస్తోందని అడుగుతున్నారు. అధికారం కోసం ఆకలితో ఉన్నారు' అని సింగ్ అన్నారు. ప్రజలను, అధికారులను మరింత చేరువ చేసే లక్ష్యంతో 'మీయంగి సుమిత్' (ప్రజా దినోత్సవం) వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యమంత్రి చెప్పారు. 'మేము ఏ ప్రత్యేక వర్గానికి వ్యతిరేకం కాదు. బీజేపీ వైఖరి స్పష్టంగా ఉంది. మేము కలిసి జీవించాలనే ఆలోచనను విశ్వసిస్తాం. మేము ఇప్పటికే పోలీసులు, ప్రజల మధ్య సంబంధాలను నిర్మించడం ప్రారంభించాం' అని చెప్పారు. పరిపాలనలోని అనేక విభాగాల్లో కమిటీలు వేయడం ద్వారా రాష్ట్రంలో నిర్వాసితుల అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్య, వ్యవసాయంలో నిర్వాసితులైన ప్రజలకు పరిపాలన తక్షణ పరిష్కారాలను అందిస్తోందని తెలిపారు. 'మేము ఎన్నడూ తప్పు చేయలేదు. భవిష్యత్ తరాలను రక్షించాలని మాత్రమే మేము కోరుకున్నాం. రెండు వర్గాల ప్రజలు ప్రశాంతంగా ఉండాలి. గతాన్ని చూసే బదులు... బయోమెట్రిక్, 1961 సంవత్సరం ఆధారంగా ఎన్ఆర్‌సీ ప్రక్రియపై దృష్టి పెట్టాలి' అని అన్నారు. 'మేము మా పనిని ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా కొనసాగిస్తాం. దీనికి సమయం పడుతుంది. ఇప్పుడు మనకు కావలసింది తక్షణ శాంతి, ఒకరినొకరు అపార్థం చేసుకున్న రెండు వర్గాల మధ్య అవగాహనకు రావడం' అని ముఖ్యమంత్రి అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి చెందిన కొన్ని ఐక్యత నేపథ్య ప్రాజెక్టులను కూడా ఆయన ప్రస్తావించారు. 'యూనిటీ మాల్‌లో రాష్ట్రంలోని అన్ని జాతుల స్టాల్స్ ఉంటాయి. 140 కోట్ల రూపాయల కంటే ఎక్కువ ఖర్చుతో నిర్మించడం జరుగుతుంది' అని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.